అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 22-8-2017 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 235 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

ధర్నాచౌక్ కోసం
పోరాడుదాం

కేసీఆర్ నియంతృత్వం వీడాలి

- నిరసనలు, ఉద్యమాలు, ప్రదర్శనలు ప్రజాస్వామ్యంలో భాగం
- రాజధాని నడిబొడ్డులోనే ధర్నాచౌక్ ఉండాలి..ఇందిరాపార్క్‌ను వదలబోం
- ప్రత్యేక రాష్ట్ర స్ఫూర్తితో 'ధర్నాచౌక్ పునరుద్ధరణ' పోరాటం
- అన్ని పక్షాలు ఐక్యంగా పోరాడాలి : జంతర్‌మంతర్ ధర్నాలో ప్రముఖులు
- నిరంకుశ సర్కార్లు ఎక్కువ కాలం నిలవలేవు : కోదండరామ్
- హోంమంత్రికి సీఎం వైఖరిపై ఫిర్యాదు..కేంద్రం స్పష్టమైన ఆదేశాలివ్వాలని విన్నపం



ఢిల్లీ ధర్నాలో ప్రొ॥ విశ్వేశ్వరరావు, సురవరం, కుంతియా, ఉత్తమ్, తదితరులు

నవతెలంగాణ–న్యూఢిల్లీబ్యూరో

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు, ఓట్లు, అధికారమే కాదని... నిరసనలు, ధర్నాలు, ప్రదర్శనలు సైతం అందులో భాగమేనని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ధర్నాచౌక్(ఇందిరాపార్క్) నిరసనలు తెలియజేసే ప్రజాస్వామిక హక్కు అని స్పష్టం చేశారు. ధర్నాచౌక్‌ను ఎత్తేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు, రైతులు, కార్మికులు, ప్రతిపక్షాలు, మహిళలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించేందుకు ధర్నాచౌక్ రాజధాని నడిబొడ్డులోనే ఉండాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో కేసీఆర్ అవలంబిస్తున్న నియంతృత్వ విధానానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇక తెలంగాణ హక్కుల కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తానన్న కేసీఆర్... మరీ రాష్ట్రంలో ధర్నాచౌక్‌ను ఎలా ఎత్తేస్తారని నిలదీశారు. అలాగే కేసీఆర్ వైఖరిపై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ప్రతినిధి బృందం ...10లో

పోరుబాటే సరైన మార్గం




సాయుధ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను కేసీఆర్ మరిచినట్టున్నారు

- నియంతృత్వాన్ని అనుమతించబోం: ఏచూరి

వివరాలు



భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలంలోని బట్టిగూడెం గ్రామంలో అవస్థలు ఇవి. ఇది మండల కేంద్రానికి ఐదు కిమీ దూరంలో ఉంది. ఈ గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలకు జలకం వారి గుంపు నుంచి ప్రతిరోజు పది మంది విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ చిన్నారులూ రాక పోకలు సాగిస్తుంటారు. జలకం వారి గుంపు పక్కనే వంగిడి చెరువు ఉన్నది. వర్షాకాలంలో ఈ చెరువు నిండి మూడు నెలల పాటు రహదారిలో నీరు నిల్వ ఉంటుంది. దీంతో ఈ గుంపునకు చెందిన విద్యార్థులతో పాటు, గ్రామస్తులు వాగును దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. –దుమ్ముగూడెం



అమెరికాలో కనువిందు చేసిన
సూర్య గ్రహణం
వందేండ్ల తర్వాత ఖగోళ అద్భుతం 7లో



విశ్వాసం సన్నగిల్లుతోంది..!

- దేశ ఆర్థికంపై భారతీయుల మాట వివరాలు
- ఉపాధి, జీవన ప్రమాణాలపై అనిశ్చితి :మాస్టర్‌కార్డ్, నీల్సన్

ప్రయివేటీకరణపై బ్యాంకు ఉద్యోగుల
సమరశంఖం


సమ్మెకు సంబంధించిన డిమాండ్ల పత్రాన్ని చూపుతున్న యూఎఫ్‌బీయూ నాయకులు

ప్రభుత్వరంగంలోని బ్యాంకులను ప్రయివేటీకరించేందుకు ఉద్దేశింపబడిన 'బ్యాంకు సంస్కరణల'ను తిప్పికొట్టాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయు) పిలుపునిచ్చింది. 9లో

సమ్మె నోటీస్‌కు స్పందించిన సర్కారు

- మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీతో చర్చలు
- 23న మరో దఫా చర్చలకు అంగీకారం వివరాలు

అక్టోబర్ 5న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు

షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర కార్మికశాఖ

- కోడ్ ఆఫ్ డిసిప్లిన్ మార్చాలని సీఐటీయూ డిమాండ్ వివరాలు
- సమావేశం నుంచి బాయ్‌కాట్

సిరిసిల్ల ఎస్పీ స్థాన చలనం వెనుక..!

- నేరెళ్ల నేపథ్యంలోనే ఈ చర్య?
- లడఖ్ స్వింగ్‌లో పాల్గొనడానికి వెళ్తున్నాడన్న పోలీసు ఉన్నతాధికారులు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి/సిరిసిల్ల

సిరిసిల్ల ఎస్పీ విశ్వజిత్ కంపాటికి స్థానచలనం జరిగిందా ? నేరెళ్ల ఘటనలో ఆయన అతిగా ప్రవర్తించినందుకే ఈ చర్యను అధికారులు అంతర్గతంగా తీసుకున్నారా? ఈ దిశలోనే అనుమానాలు షికార్లు కొడుతున్నాయి. 24 నుంచి సిరిసిల్ల ఎస్పీ బాధ్యతల నుంచి విశ్వజిత్‌ను తప్పించారని పోలీసు వర్గాల నుంచి విశ్వసనీయ సమాచారం. సిరిసిల్లా జిల్లా నేరెళ్లలో ఇసుక అక్రమ రవాణాను వ్యతిరేకిస్తు జరిగిన ఆందోళన సందర్భంగా నిరసనకారులపై విచక్షణారహితంగా పోలీసులు లాఠీచార్జి జరపడం పెనువివాదానికి దారి ...9లో

కాక్కా రోకో..


ఆ మిషన్ ఏదో మనదగ్గరుంటే.. నగరంలోని చెత్తతో దేశానికి సరిపడా కరెంటు తయారు చేయ్యొచ్చేమో..!!

కలిసి మాట్లాడుకోండి

ఇద్దరు సీఎంలకు ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి : వెంకయ్య


ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు మెమెంటోను బహూకరిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో కేంద్ర మంత్రి దత్తాత్రేయ, గవర్నర్ నరసింహన్, స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎంపీ జితేందర్‌రెడ్డి 9లో

ఢిల్లీ రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో సోమవారం బాంబు కలకలం సృష్టించింది. తెల్లవారుజామున 4.10గంటలకు ఓ అజ్ఞాత వ్యక్తి రైల్వేస్టేషన్‌కి ఫోన్ చేసి స్టేషన్‌లో నిలిపి ఉన్న ఓ రైలులో బాంబు ఉందని సమాచారం ఇచ్చాడు. దీంతో, అప్రమత్తమైన పోలీసులు ప్రయాణికులను బయటకు పంపించి తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్‌తో కలిసి జీఆర్పీ, ఆర్పీఎఫ్ బలగాలు స్టేషన్‌లో నిలిచి ఉన్న పలు రైళ్లతో పాటు స్థానిక ప్రాంగణంలో మూడు గంటల పాటు విస్తృతతనిఖీలు చేపట్టినట్టు డీసీపీ పరేష్ అహ్మద్ తెలిపారు. అయితే, రైల్వేస్టేషన్‌లోగానీ పరిసర ప్రాంతాల్లోగానీ ఎలాంటి అనుమానిత వస్తువులు లభించలేదని చెప్పారు.

మెక్‌డొనాల్డ్స్ 169 ఫ్రాంఛైజీలు కట్

ముంబయి: మెక్‌డొనాల్డ్స్ ఇండియా విక్రమ్ బక్షికి చెందిన కన్నాట్ ప్లాజాతో ఉన్న ఫ్రాంఛైజ్ ఒప్పందాలను రద్దు చేసుకున్నట్టు సోమవారం ప్రకటించింది. దీంతో మొత్తం 169 రెస్టారెంట్లు మెక్‌డొనాల్డ్స్ బ్రాండ్ పేరును వినియోగించడాన్ని 15రోజుల్లో నిలిపివేయాల్సి ఉన్నది. దేశంలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో కన్నాట్ ప్లాజా రెస్టారెంట్ ప్రయివేట్ లిమిటెడ్ (సీపీఆర్ఎల్) మెక్‌డొనాల్డ్స్ ఫ్రాంఛైజీలను నిర్వహిస్తున్నది.ఢిల్లీలోని కన్నాట్ ప్లాజా నేతృత్వంలో ఉన్న 40రెస్టారెంట్లు ఈటింగ్ హౌస్ అనుమతులు గడువు దాటడంతో...వాటిలో కార్యకలాపాలపై వేటు వేసింది.ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించటం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ సంస్థ తెలిపింది.

గోరక్షకులకు మార్గదర్శకాలు జారీ చెయ్యలేం

- అది ప్రభుత్వ విధి : బొంబాయి హైకోర్టు

ముంబయి: గోరక్షకులకు మార్గదర్శకాలు జారీ చేయలేమని బొంబాయి హైకోర్టు తెలిపింది. బక్రీద్ సందర్భంగా ఆవు మాంసం తరలిస్తున్నారని ఆరోపిస్తూ ముస్లింలపై గోరక్షకులు దాడులు చేసే అవకాశమున్నదంటూ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు విచారించినది. దీనిపై మహారాష్ట్ర ప్రభుత్వ తరఫున అఫిడవిట్ దాఖలు చేయనందుకు హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల మొదటివారంలో విచారణ సందర్భంగా గోరక్షకులను ఎలా కట్టడి చేస్తున్నారో తెలియజేయాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు నోటీస్ జారీ చేసింది. అయితే, న్యాయ పాలన తమ బాధ్యత కాదని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశివ్వగలమని ఫిర్యాదిదారులకు హైకోర్టు స్పష్టం చేసింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. బక్రీద్ సందర్భంగా స్వప్రకటిత గోరక్షకులు దాడులకు పాల్పడే అవకాశమున్నందున మార్గదర్శకాలు జారీ చేయాలంటూ బాంద్రాకు చెందిన వ్యాపారవేత్త షాదాబ్ పటేల్ హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం జరిగిన విచారణకు ఎంఐఎం ఎమ్మెల్యే వరిస్‌పఠాన్ కూడా హాజరయ్యారు.

బీహార్ ఎంపీ కాన్వాయ్ ఢీకొని ముగ్గురు మృతి

పాట్నా : సుపాల్ ఎంపీ, కాంగ్రెస్ అధికార ప్రతినిధి రంజిత్ రంజాన్ కాన్వాయ్ బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌లోని సుపాల్ నగరంలోని నిర్మలి-సికర్హట్ట మెయిన్ రోడ్డుపై సోమవారం ఈ దుర్ఘటన జరిగింది. పాదచారులపైకి కారు వేగంగా దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఘటనాస్థలంలో ఉన్న నిర్మలి బ్లాక్ అధ్యక్షుడు రామ్‌ప్రకాష్ యాదవ్ క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

శ్రీజన్ స్కాం ప్రకంపనలు

పాట్నా: బీహార్‌లో ఇటీవల వెలుగులోకి వచ్చిన దాదాపు రూ. ఏడు వందల కోట్ల రూపాయల కుంభకోణానికి సంబంధించిన ప్రధాన నిందితుడు మహేశ్ మండల్ మృతి చెందారు. మూత్ర సంబంధిత వ్యాధితో ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ కాలేజీ ఆస్పత్రి (జేఎల్ఎన్ఎంసీహెచ్)లో చేరిన ఆయన ఆదివారం మృతిచెందారు. భగల్పూర్ జిల్లా సంక్షేమ శాఖలో కీలక పదవిలో ఉన్న మడల్‌ను ప్రభుత్వ నిధులను సొంత ఎన్జీఓ శ్రీజన్ మహిళా సహయోగ్ సమితికి బదిలీ చేశారన్న ఆరోపణలతో ఈ నెల 13న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా... ఆస్పత్రి యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే ఆయన మృతిచెందినట్టు ఆరోపిస్తూ మండల్ కుటుంబసభ్యులు ఆస్పత్రిలో విధ్వంసం సృష్టించారు. ప్రభుత్వం తగిన చికిత్స అందించలేదని వారు ఆరోపించారు.

నితీశ్ రాజీనామా చేయాలి : అసెంబ్లీలో ఆర్జేడీ డిమాండ్

కోట్లాది రూపాయల 'శ్రీజన్ స్కామ్' వ్యవహారం బీహార్‌ని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రాజీనామా చేయాలని ఆర్జేడీ డిమాండ్ చేసింది. స్కామ్‌లో ప్రమేయమున్న ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఆర్జేడీ సభ్యులు సభాకార్యక్రమాలను సోమవారం అడ్డుకున్నారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాగానే, విపక్ష ఆర్జేడీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ నేత త్వంలోని ఆ పార్టీ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ స్కామ్ భగల్‌పూర్ జిల్లాకు మాత్రమే పరిమితం కాలేదని, పలు జిల్లాల్లోనూ ఈస్కామ్ లింక్‌లు ఉన్నాయని ఆరోపించారు.

గుజరాత్ రాజ్యసభ ఎన్నికలపై

అమిత్‌షా, స్మృతీ ఇరానీ, అహ్మద్ పటేల్‌కు హై కోర్టు నోటీసులు

అహ్మదాబాద్ : గుజరాత్‌లో ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి దాఖలైన ఒక పిటిషన్‌పై సీనియర్ కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్‌కు హై కోర్టు సోమవారం నోటీసు జారీ చేసింది. రాజ్యసభ ఎన్నికల్లో రెబల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవంటూ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీజేపీ అభ్యర్థి బల్వంత్ సిన్హ రాజ్‌పుట్ హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అహ్మద్ పటేల్‌తో పాటు రాజ్యసభ స్థానాలను గెలుచుకున్న మరో ఇద్దరు అభ్యర్థులు బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీలకు కూడా నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై సెప్టెంబరు 21లోగా స్పందించాలని ఆదే శించింది. ఎన్నికల్లో పటేల్ విజయం సాధించడానికి ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం దోహదపడిందంటూ రాజ్‌పుట్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అహ్మద్ పటేల్ గెలవడానికి కనీసంగా అవసరమైన 44 ఓట్లు ఆయనకు లభించాయి. ఈ ఫలితాల విషయంలో ఎన్నికల కమిషన్ నిర్ణయం చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించాలని, రాజ్‌పుట్ తన పిటిష న్‌లో పేర్కొన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు ఓటేసిన తరువాత ఆబ్యాలెట్ పత్రా న్ని అక్కడే ఉన్న ఒక అనధికార వ్యక్తికి చూపించారన్న కారణంతో వారి ఓట్లను అక్రమమైనవిగా ప్రకటించాలని రాజ్‌పుట్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

ట్రిపుల్ తలాఖ్‌పై 'సుప్రీం' తీర్పు నేడు

న్యూఢిల్లీ : త్రిపుల్ తలాఖ్‌ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించనుంది. సర్వోన్నత ధర్మాసనం తీర్పు కోసం వేలాది మంది ముస్లిం మహిళలు ఎదురుచూస్తున్నారు. చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్ నేతృత్వంలో జస్టిస్ కురియన్ జోసఫ్, జస్టిస్ రోహిన్టన్ ఫలీ నారిమన్, జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్, జస్టిస్ అబ్దుల్ నజీర్ త్రిపుల్ తలాఖ్‌పై తీర్పు వెలువరించనున్నారు. కాగా, ఇస్లాం మతంలోని త్రిపుల్ తలాఖ్‌ను (విడాకులు తీసుకునే విధానం) వ్యతిరేకిస్తూ షాయరా బానో సహా కొంత మంది మహిళలు, స్వచ్ఛంధ సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. రాజ్యాంగ ధర్మాసనం మే నెలలో ఆరు రోజులపాటు దీనిపై విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. పిటిషనర్ల తరుపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్, రామ్ జెఠ్మలానీ, సల్మాన్ ఖుర్షిద్, ఆనంద్ గ్రోవర్, ఇందిరా జైసింగ్, అమిత్‌సింగ్ చందా వాదనలు వినిపించారు.

ఓ పరువు నష్టం కేసు నుంచి కేజ్రీవాల్‌కు ఊరట

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఓ పరువు నష్టం కేసు నుంచి సోమవారం ఊరట లభించింది. బీజేపీ నేత,మాజీ ఎంపీ అవతార్ సింగ్ బదానా తాను గతంలో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్టు అదనపు జిల్లా జడ్జికి తెలపడంతో కేజ్రీవాల్‌పై కేసు కొట్టివేసినట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ పార్టీలో ఉన్నపుడు 2014 జనవరిలో తనపై కేజ్రీవాల్ అవినీతి ఆరోపణలు చేయడంతో కోటి రూపాయల నష్టపరిహారం కోరుతూ బదానా కోర్టును ఆశ్రయించారు. గతంలో తాను చేసిన అవినీతి ఆరోపణలను ఉపసంహరించుకున్నట్టు కేజ్రీవాల్ తెలపడంతో పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటున్నట్టు బదానా తరపున న్యాయవాది తెలిపారు.

ప్రత్యామ్నాయ ఎన్నిక పద్ధతులపై

పార్లమెంటరీ కమిటీ ప్రశ్నావళి

- అన్ని రాజకీయ పార్టీలు, ఎన్నికల కమిషన్‌కు పంపిణీ
- అభిప్రాయాలు కోరిన కమిటీ
- ప్రస్తుత విధానం పట్ల అసంతృప్తి
- 39 శాతం ఓట్లతో ఓ పార్టీ అధికారం చేపట్టడం ఎలా సబబని నిలదీత



న్యూఢిల్లీ: ప్రస్తుత ఎన్నికల విధానాన్ని మార్చాల్సిన అవసరమున్నదా..? లేదా..? మీ అభిప్రాయాలు తెలియజేయాలని కోరుతూ రాజకీయ పార్టీలతో పాటు, ఎన్నికల కమిషన్‌కు ఆరు పేజీల ప్రశ్నావళిని పార్లమెంటరీ కమిటీ పంపించింది. ఎన్నికల విధానంలో ప్రత్యామ్నాయాల పరిశీలన కోసం అన్ని పార్టీల ఎంపీలతో పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కాంగ్రెస్ ఎంపీ ఆనంద్‌శర్మ నేతృత్వం వహిస్తున్నారు.

ప్రస్తుతం మన దేశంలో లోక్‌సభ,అసెంబ్లీ ఎన్నికల కోసం అనుసరిస్తున్న ఎన్నికల విధానాన్ని ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్(ఎఫ్‌పీటీపీ)గా చెబుతారు. ఈ విధానంలో అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా నిర్ణయిస్తారు. మిగతా అభ్యర్థులకు పడ్డ ఓట్లు పరిగణనలోకి రాకుండా పోతాయి.

ఎన్నికలకు సంబంధించి పలు పద్ధతులున్నాయి: ఎఫ్‌పీటీపీ, జాబితా విధానం,నైష్పత్తిక విధానం, ప్రాధాన్యతా ఓటింగ్, మిశ్రమ పద్ధతి...మన దేశంలో రాష్ట్రపతి ఎన్నికకు నైష్పత్తిక ఓటింగ్ పద్ధతిని అనుసరిస్తున్నాం. మన దేశానికి ఇప్పుడున్న ఎన్నికల విధానం సరిపోదని ఆనంద్‌శర్మ నేతృత్వంలోని కమిటీ తమ ప్రశ్నావళిలో పేర్కొన్నది. ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికలను అందుకు ఉదాహరణగా చూపింది. 39 శాతం ఓట్లు మాత్రమే పొందిన పార్టీ 312 సీట్లు సాధించగా.. 22శాతం,21 శాతం పొందిన పార్టీలకు 47, 19 సీట్ల చొప్పున వచ్చాయని తెలిపింది. యూపీ ఎన్నికల గురించి ప్రస్తావించిన కమిటీ తమ ఉదాహణలో పార్టీల పేర్లు మాత్రం పేర్కొనలేదు. యూపీ అసెంబ్లీలో మొత్తం 403 సీట్లుండగా, బీజేపీ ఆ రాష్ట్రంలో అధికారం చేపట్టిన విషయం తెలిసిందే. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 31 శాతం ఓట్లు మాత్రమే పొందిన బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టిన విషయాన్ని ప్రతిపక్షాలు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాయి. ఈ లెక్కన ఎఫ్‌పీటీపీ సరైందని ఎలా చెప్పగలమని ఆ పార్టీలు ప్రశ్నిస్తున్నాయి.

ప్రత్యామ్నాయ ఎన్నికల విధానాన్ని తీసుకురావడం మన దేశంలో సాధ్యమేనా అన్నది పరిశీలించాలని ఎన్నికల కమిషన్‌ను కమిటీ కోరింది. ఎఫ్‌పీటీపీని అనుసరిస్తున్న బ్రిటన్‌సహా ఇతర పెద్ద దేశాలలో దీని అమలు తీరు, ఎదురవుతున్న సవాళ్లను భారత్‌తో పోల్చి చూడాలని కూడా ఎన్నికల కమిషన్‌ను కమిటీ కోరింది. ప్రశ్నావళిలో ఐదు శీర్షికల కింద పార్లమెం టరీ కమిటీ ప్రశ్నలను రూపొందించింది: ఎన్నికల నిధులు, ఎన్నిక విధానాలు, మీడియా/ ఉచిత ఎయిర్ ప్రసారాలు, రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వా మ్యం, ఇతర అంశాలు...మీడియా విభాగంలో పెద్ద సంఖ్యలో టీవీ ఛానళ్లు ఏర్పాటు కావడంపై ప్రస్తావిం చారు. వీటిపై నియంత్రణ అవసరమా.?లేదా..? అన్న ప్రశ్నలు ఉన్నాయి. చాలావరకు టీవీ ఛానళ్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాజకీయ పార్టీల నియంత్రణలోనే నడుస్తున్నట్టు ప్రశ్నావళిలో పేర్కొన్నారు. దాంతో, ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకొని వ్యక్తిత్వంపై బురద చల్లడంలాంటివి జరుగుతున్నట్టుగా అందులో గుర్తు చేశారు. కార్పొరేట్, బడా వ్యాపార సంస్థలు తమ ఆధీనంలోని మీడియాను తమ అనుకూల రాజకీయ పార్టీలు అధికారాన్ని చేపట్టేలా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడం కోసం ఉపయోగించడం, ఆ తర్వాత అధికారాన్ని తమ వ్యాపారాల వృద్ధి కోసం వాడుకోవడం గురించి కూడా అందులో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మీడియా పాత్ర కీలకంగా మారుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా రాబట్టడంలో డబ్బు, మీడియా పాత్రను ఎలా నియంత్రించాలన్న దానిపైనా ప్రశ్నలు అందులో ఉన్నాయి. పార్లమెంటరీ కమిటీ పంపిణీ చేసిన ప్రశ్నావళికి ఇప్పటివరకూ కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ(ఎం), ఎన్సీపీ, సీపీఐ, లోక్‌జనశక్తి పార్టీలు సమాధానాలు పంపినట్టు తెలుస్తోంది. బీజేపీసహా పలు పార్టీలు సమాధానాలు పంపాల్సి ఉన్నది.

ఛత్తీస్‌గఢ్‌లో 'గోరఖ్‌పూర్'

- ఆక్సిజన్ సరఫరా అందకపోవడంతో ముగ్గురు శిశువులు మృతి

రాయ్‌పూర్ : గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో ఆక్సిజన్ అందకపోవడంతో 85 మంది చిన్నారులు మృతి చెందిన ఘటనను మరువకముందే ఛత్తీస్‌గఢ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మారక (బీఎఎం) ఆస్పత్రిలో ఇలాంటి ఘటనే తాజాగా చోటు చేసుకున్నది. శిశువులకు అందించే ఆక్సిజన్ సరఫరా విషయంలో ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ముగ్గురు శిశువులు మృతి చెందినట్టు తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నివేదిక అందజేయాలని సీఎం రమణ్‌సింగ్ ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..బీఎఎం ఆస్పత్రి ప్రసూతి విభాగంలో వెంటిలేటర్లపై ఉన్న పది మంది శిశువుల్లో ముగ్గురు చనిపోయారు. శిశువులకు ఆక్సిజన్ సరఫరా అందకపోవడంతోనే మృతి చెందినట్టు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కాగా, ఈ ఘటన జరిగిన సమయంలో మెడికల్ గ్యాస్ ప్లాంట్ ఆపరేటర్ రవిచంద్ర మద్యం సేవించి ఉన్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు. శిశువుల మృతికి కారణమైన అతన్ని పోలీసులకు అప్పగించామని చెప్పారు. తమ శిశువుల మృతికి ఆస్పత్రి యాజమాన్యం బాధ్యత వహించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. తమ తప్పును కప్పి పుచ్చుకునేందుకే కింది స్థాయి ఉద్యోగిని బాధ్యుడిని చేస్తూ ఆస్పత్రి యాజమాన్యం చేతులు దులుపుకునేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. తమ కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

గుండు గీసి.. చెప్పుల దండేసి ఊరేగించారు



హర్దోయ్ : మైనరుపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి గ్రామస్తులు బుద్ధిచెప్పారు. తొలుత అతడిని చితకబాదిన స్థానికులు.. అనంతరం గుండుగీసి, చెప్పుల దండవేసి ఊరేగించారు. నిందితుడు బల్భద్రా అలియాస్ మస్తానాను ఆ తర్వాత పోలీసులకు అప్పగించారు. ఇంటి ముందు ఆడుకుంటున్న తన కూతురును మాయమాటలు చెప్పి.. తన ఇంటికి తీసుకెళ్ళి లైంగికదాడికి ప్రయత్నించినట్టు బాధితురాలి తల్లి తెలిపింది. బాలిక అరుపులు విన్న పక్కింటివారు... గమనించి అతడిని పట్టుకున్నారని హర్దోయ్ పోలీసు సూపరింటెండెంట్ విపిన్ కుమార్ మిశ్రా చెప్పారు. నిందితుడిని గ్రామస్తులు అప్పగించడంతో అతడిపై కేసు నమోదుచేసి.. అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

అన్నాడీఎంకే ఏకమైంది

- డిప్యూటీ సీఎంగా పన్నీరు ప్రమాణం



చెన్నై : జయలలిత మృతి తర్వాత రెండు వర్గాలుగా చీలిపోయిన అన్నా డీఎంకే ఆరు నెలల వివాదాల అనంతరం సోమవారం నాడు ఏకరూపంతో అవతరించింది. శశికళ మద్దతుతో సీఎం పీఠం ఎక్కిన పళనిస్వామి అదే పదవిలో కొనసాగుతారు. జయలలిత మరణం తర్వాత తాత్కాలిక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన పన్నీర్ సెల్వం ఉప ముఖ్యమంత్రి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ విలీన ప్రక్రియలో జయ మరణానంతరం పార్టీ జనరల్ సెక్రెటరీ పదవి చేపట్టిన శశికళను, జయలలిత ఆకాంక్షలకు భిన్నంగా ఆమె పార్టీలోకి తీసుకువచ్చిన టిటివి దినకరన్‌ను ఇరు పక్షాలు పక్కన పెట్టేశాయి. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు 2011లో జయలలిత వీళ్లిద్దరినీ పార్టీ నుంచి బహిష్కరించినప్పటికీ శశికళను తిరిగి స్వీకరించిన విషయం తెలిసిందే.

తాజా పరిణామాలలో భాగంగా ముఖ్యమంత్రి పళనిస్వామి, పన్నీర్ సెల్వం పార్టీ కేంద్ర కార్యాలయంలో పెద్ద సంఖ్యలో హాజరైన అనుచరుల సమక్షంలో సోమవారం కరచాలనం చేసుకుంటూ విలీనం ప్రక్రియను ముగించారు. విలీనం కోసం పార్టీ నేతృత్వాన్ని అంటే పార్టీ కో-ఆర్డినేటర్‌గా పన్నీర్‌సెల్వం అదనపు బాధ్యతలు స్వీకరిస్తారు. తిరిగి రెండాకుల చిహ్నం రాష్ట్రమంతటా రెపరెపలాడుతుందని పళని స్వామి ఆశాభావం వ్యక్తంచేసారు. అమ్మగా కార్యకర్తలంతా ఆదరించి అభిమానించే జయలలిత ఆకాంక్షలను నెరవేర్చడానికి సమష్టిగా కృషి కొనసాగిస్తామని, తమ పార్టీ అమ్మ ఆశించిన విధంగా వందేండ్లు ప్రజాసేవ చేస్తూనే ఉంటుందని ఆయన అన్నారు. ఇప్పుడు నా హృదయభారం తగ్గిపోయిందని, ఇక మమ్మల్ని ఎవరూ వేరుచేయలేరని పళని అన్నారు.

అమిత్ షా పర్యటన రద్దు

ఈలోగా ఒకటి రెండు రోజుల్లో చెన్నై పర్యటనకు రావల్సిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పర్యటన రద్దయింది. ఇంతకుముందు కూడా ఒకసారి ఆయన పర్యటన షెడ్యూల్ అయినప్పటికీ చివరి క్షణంలో రద్దయింది. విలీనమైన రెండు పార్టీలు బీజేపీకి చేరువ కావాలనే తాపత్రయం ఇప్పటికే వ్యక్తంచేశాయి. ఇప్పుడు సమైక్య అన్నాడీఎంకే పార్టీ కేంద్రంలోని అధికార కూటమి ఎన్డీఏలో చేరటం ఖాయమనే అభిప్రాయం అంతటా వినిపిస్తోంది.

హాస్యగాళ్ల టోపీ : కమల్ హసన్

ఇక రాష్ట్రంలో తాజాగా పరిణామాలపై సినీ నటుడు కమల్ హసన్ తనదైన శైలిలో స్పందిస్తూ ... గతంలో తమిళ ప్రజల నెత్తిన గాంధీ టోపీ, కాశ్మీరీ టోపీ వచ్చాయి. ఇప్పుడు హాస్యగాళ్ల టోపీ (క్లౌన్ టోపీ) వచ్చిందని చురకలంటించారు. చాలా కాలంగా ఆయన పాలక అన్నాడీఎంకే నాయకత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. అంతేకాక, రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన ఆయనకు ఉన్నట్టు ఇప్పటికే చాలాసార్లు సూచనలు వెలువడిన సంగతి తెలిసిందే.

శశికళ రాజభోగంపై ఆధారాలు సమర్పణ

బెంగళూరు: అక్రమాస్తుల కేసులో కర్ణాటలో జైల్లో శిక్ష అనుభవిస్తున్న జయలలిత నెచ్చెలి శశికళకు రాజభోగాలు అందుతున్నాయంటూ ఆరోపణలు చేసిన ఐపీఎస్ అధికారిణి రూప దానికి తగిన ఆధారాలు బయటపెట్టారు. శశికళ అధికారులకు లంచం ఇచ్చి జైల్లో రాజభోగాలు అనుభవిస్తున్నారని రూప గతంలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. రూప అప్పుడు జైళ్ల శాఖ డీఐజీ హోదాలో ఉన్నారు. వివరాలను బయటపెట్టారంటూ రూపపై ఆగ్రహించిన ఉన్నతాధికారులు ఆమెను ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేశారు. అయితే తాజాగా రూప తన ఆరోపణలకు సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీని అవినీతి నిరోధక శాఖ విభాగానికి అందజేశారు. శశికళ, ఆమె బంధువు ఇళవరసి జైలు బయటకి వెళ్లి.. కొద్దిసేపటి తర్వాత లోపలికి వస్తున్న ద శ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఇద్దరూ జైలు దుస్తుల్లో కాకుండా సాధారణ దుస్తుల్లో ఉండటం.. శశికళ వెంట ఓ బ్యాగ్ ఉండటం స్పష్టంగా కనిపిస్తోంది.

జార్ఖండ్‌లో దారుణం...

- వైద్యం అందకపోవడంతో ఏడాది చిన్నారి మృతి
- రూ.50 తక్కువగా ఉండటంతో సీటీ స్కాన్ తీసేందుకు నిరాకరించిన ల్యాబ్ సిబ్బంది

రాంచీ : జార్ఖండ్‌లోని రాజేంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (రిమ్స్) ఆస్పత్రిలోని ల్యాబ్ సిబ్బంది మానవత్వాన్ని మంటగలిపే విధంగా ప్రవర్తించి ఓ చిన్నారి మృతికి కారకులయ్యారు. సకాలంలో వైద్యం అందకపోవడంతో ఏడాది చిన్నారి రిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందింది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...చిన్నారి శ్యామ్‌కు వైద్యసేవలు అందించేందుకు తల్లిదండ్రులు రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారిని పరీక్షించిన వైద్యులు తక్షణమే సీటీ స్కాన్ తీయాలని చెప్పారు. సీటీ స్కాన్‌కు రూ.1350 ఖర్చవుతుందని అన్నారు. ఆస్పత్రిలో ఉన్న ల్యాబ్‌కు వెళ్లాలని సూచించారు. కాగా, రూ.1300 మాత్రమే చెల్లించగలనని చిన్నారి తండ్రి సంతోష్‌కుమార్ ఎంతగా ప్రాధేయపడినా ఆస్పత్రి సిబ్బంది పట్టించుకోలేదు. మిగతా రూ.50 తీసుకొస్తేగానీ పరీక్షలు నిర్వహించమన్నారు. దీంతో, సాయం కోసం సంతోష్‌కుమార్ తన మిత్రునికి ఫోన్ చేశాడు. డబ్బులు తీసుకొచ్చేలేపే చిన్నారి మృతి చెందింది. దీంతో, చిన్నారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆస్పత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్టు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

బొగ్గుగనుల కేసులో సీబీఐ దర్యాప్తు తీరు పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి



న్యూఢిల్లీ: బొగ్గు గనుల కేటాయింపుల్లో అక్రమాలపై దర్యాప్తు పూర్తి చేయనం దుకు సీబీఐ పట్ల సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎప్పటికపుడు దర్యాప్తు పురోగతిపై గుర్తు చేస్తున్నా ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడంలేదని జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. పెండింగ్ కేసులన్నిటిపై స్థాయీ నివేదికలు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. విచారణను ఈ ఏడాది అక్టోబర్ 9కి వాయిదా వేసింది.

నోట్లరద్దు సక్సెస్‌కు ఆధారమేదీ?

న్యూఢిల్లీ: నల్లధనం వెలికితీత ప్రధాన లక్ష్యంగా తీసుకున్న పెద్ద నోట్లరద్దు నిర్ణయం విజయవంతమైందని పంద్రాగస్టు నాడు ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. బ్యాంకులకు ఇప్పటివరకూ చేరని రూ.3 లక్షల కోట్లు నోట్లరద్దు తర్వాత డిపాజిట్ అయ్యాయని వెల్లడించారు. అయితే వీటిలో రూ.1.75 లక్షల కోట్లు నోట్లరద్దు తర్వాత బ్యాంకుల్లో జమ కాగా.. రూ.1.25 లక్షల కోట్ల నల్లధనాన్ని గడిచిన మూడేండ్ల కాలంలో వెలికి తెచ్చినట్టు వివరించారు. 18 లక్షల మంది ప్రజలు ఆదాయానికి మించి ఆస్తులను కల్గి ఉన్నట్టు తేలిందన్నారు. ప్రభుత్వ గణాంకాలను ఆధారంగా చేసుకొని మోడీ ఈలెక్కలు చెప్పారను కుంటే పొరపడినట్టే. ఎందుకంటే.. గతేడాది నవంబర్ 8న పెద్ద నోట్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నటి నుంచి ఇప్పటివరకు బ్యాంకుల్లో ఎంత డబ్బు జమైందన్నది వెల్లడించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిరాకరిస్తున్నది. ఎంత నల్ల ధనం వెలికి వచ్చిందన్నది అటు ఆర్బీఐగానీ, ఇటు కేంద్ర ఆర్థి క మంత్రిత్వశాఖగానీ ఇప్పటికీ అంచనా వేయలేదు.



చెలామణిలో ఉన్న 86శాతం కరెన్సీని ఆకస్మికంగా రద్దు చేస్తూ తీసుకు న్న నిర్ణయం దేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందన్నది వాస్తవం. ఈ విషయాన్ని పలు సర్వేలు బట్టబయలు చేశాయి.

(knpost.com సౌజన్యంతో)

ఆర్టికల్ 35ఎ పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చెయ్యాలి

- కేంద్రానికి సీపీఐ(ఎం) జమ్మూ కమిటీ సూచన

జమ్ము: జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న రాజ్యాంగంలోని 35 ఎ ఆర్టికల్‌ను మార్చేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేసినా అది తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని సీపీఐ(ఎం) జమ్మూ ప్రాంత కమిటీ కార్యదర్శి శ్యాం ప్రసాద్ కేసర్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును కల్పిస్తున్న ఈ అధికరణాన్ని నీరుగార్చేందుకు ఆరెస్సెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని ఆయన ఇటీవల జరిగిన ఒక సమావేశంలో విమర్శించారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న అధికరణాన్ని రద్దు చేసేందుకు అప్పటి భారతీయ జనసంఘ్ ఆందోళనలను నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. వాస్తవానికి జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణాన్ని రాజ్యాంగంలో చేర్చేందుకు 1949 అక్టోబర్ 12న అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన జరిగిన రాజ్యాంగ అసెంబ్లీ సమావేశంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు బలపర్చినప్పటికీ జనసంఘ్ అందుకు విరుద్ధంగా వ్యవహరించిందని ఆయన వివరించారు. 1932లో అప్పటి మహారాజా హరిసింగ్ ఈఅంశాన్ని ఖరారుచేసిన విషయం ఈ సందర్భంగా ప్రస్తావనార్హమ ఉన్నారు. అప్పుడు కాశ్మీర్ ప్రత్యేక రాజ్యంగా కొనసాగిన నేపథ్యంలో బయటి ప్రదేశాలలో ముఖ్యంగా పాటియాలా, లాహోర్ ఆస్థానాలలో విద్యాభ్యాసం చేసిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్న డిమాండ్‌ను జమ్మూకు చెందిన డోగ్రా ప్రతినిధి సభతోపాటు కాశ్మీరీ పండిట్లు వ్యతిరేకించారన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టికల్ 35ఎను తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నాలు రాష్ట్రాన్ని అస్థిరత్వం పాలు చేసేందుకు మతోన్మాద, ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులు పన్నుతున్న కుట్రలో భాగమేనని ఆయన అన్నారు. రాష్ట్రానికి తీవ్రమైన చేటు చేసే ఈ ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ప్రజాస్వామిక శక్తులను ఏకం చేయాల్సిన అవసరం వుందన్నారు. దేశ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ఆర్టికల్35ఎకు అనుకూలంగా సుప్రీంకోర్టులో పటిష్టమైన కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుజరాత్ ఎమ్మెల్యేలతో సోనియా, రాహుల్ భేటీ

న్యూఢిల్లీ : గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం భేటీ అయ్యారు. పార్టీ సిద్ధాంతం, సత్యం కోసం జరుపుతున్న పోరాటాన్ని కొనసాగించాలని, అందుకోసం కలిసి కట్టుగా ఉండాలని శాసన సభ్యులను అధిష్టానం కోరింది. గుజరాత్‌లో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలతో కీలక సమావేశాన్ని నిర్వహించింది. తన నివాసంలో జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ అధ్యక్షత వహించారు. రాహుల్ గాంధీతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, గుజరాత్ ఇన్‌ఛార్జి అశోక్ గెహ్లాట్, పార్టీ కీలక వ్యూహకర్త అహ్మద్ పటేల్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులతో సుహృద్భావ వాతావరణంలో సమావేశం జరిగిందంటూ సమావేశం ముగిసిన తరువాత రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు.

దాదాపు 30 నిముషాలపాటు జరిగిన సమావేశంలో ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో అహ్మద్ పటేల్ గెలుపును ప్రస్తావిస్తూ సత్యం, ప్రజాస్వామ్య విజయానికై పోరాటం సాగించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రాహుల్, సోనియాలు అభినందించారు. ఎమ్మెల్యేలందరూ కలిసికట్టుగా ఉంటూ కాలపరీక్షకు నిలబడి విజయం సాధించాలని వారు కోరారు. కేవలం అధికారం కోసం ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేయడం లేదని, మహాత్మా గాంధీ పుట్టిన గుజరాత్‌లో విలువలను పునరుద్ధరించేందుకు కూడా కాంగ్రెస్ పోటీ చేస్తుందని పార్టీ ప్రతినిధి, గుజరాత్ ఎమ్మెల్యే శక్తిసింగ్ గోహిల్ తెలిపారు.

ఐఏఎస్ భార్య అలా చేస్తుందా..?

జనం మధ్యనే జీవితం..

పాట్నా : బీహార్ సీతామడి జిల్లాను వరద ముంచెత్తింది. అక్కడి జనానికి సేవ చేయటానికి నేతలెవ్వరూ రాలేదు.అధికారులూ అక్కడికి వెళ్లటానికి ససేమిరా అన్నారు.కానీ ఓ మహిళ అక్కడి జనం కోసం చేతిలో పార పట్టారు. కాళ్లకు చెప్పులు లేకుండా బురదనీటికి మార్గం చూపుతూ కష్టపడుతున్నారు వరదలో చిక్కుకున్న బాధితులకు అన్నం సమకూరుస్తున్నారు. అయితే అంతలా కష్టపడుతున్న ఆ మహిళ బ్యాక్ గ్రౌండ్ ఏమిటంటే...

వరదల్లో సర్వం కోల్పోయిన బాధితుల మధ్యకు వచ్చిన మహిళే ఐఏఎస్ అమిత్ జస్వాల్ సతీమణి రీతూ. ఆమె పగలు రాత్రనక వరదబాధితుల సాయం చేస్తున్నారు. సీతామడి జిల్లా పంచాయతీ సింహవాహిని గ్రామం వరదలో చిక్కుకున్నది. రహదారులతో సంబంధాలు తెగిపోయాయి. ప్రభుత్వానికి సహకరించమని విన్నవించినా ఫలితం లేకపోయింది. రీతూ ఈ విషయాన్ని ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.ఎవరో వస్తారని..ఎదురుచూడకుండా స్వయంగా పలుగుపార చేతపట్టారు. జనాన్ని కదిలించారు. నెమ్మదిగా ఆ గ్రామం ఇపుడు కోలుకుంటున్నది.



రీతూకు ఆ గ్రామానికి ఉన్న సంబంధం ఏమిటీ..?

తనకు ఐఏఎస్ అధికారితో పెండ్లి అయినా..ఆ గ్రామాన్ని చూడగానే ఆమెలో కదలికవచ్చింది. ఏదో ఒకటి చేయాలని రీతూ తలచారు.మొట్టమొదటగా కొందరు బాలికలకు చదువుచెప్పే పని మొదలు పెట్టారు .2015లో నర్కటియా గ్రామంలో 12 మంది అమ్మాయిలు మెట్రిక్ పాసయ్యారు. 2016లో సింహవాహిని గ్రామానికి జరిగిన ఎన్నికల్లో రీతూ పోటీచేశారు. 32 మందిని ఓడించి ఆ గ్రామానికి సర్పంచ్ అయ్యారు. ఇప్పుడామె ఆ ప్రాంతానికి ఐడియల్ అయ్యారు. ఏ కష్టమొ చ్చినా నేనున్నానంటూ.. రంగప్రవే శం చేయటంతో..ఆ గ్రామ ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారు. ఆ గ్రామంలో మరుగుదొడ్లు, స్కూలు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో బిజీ అయ్యారు. రీతూ చేస్తున్న సేవలకు ఎన్నో పురస్కారాలు వచ్చాయి.

వీటితో సంతృప్తి చెందక మరిన్ని సేవలతో సింహవాహిని గ్రామ జనం మదిని గెలుచుకుంటున్నారు. తన భర్త ఐఏఎస్ అయినా కూడా గ్రామసేవలో ఆమె తరిస్తున్నారు. ఇలానే ఇతర ఐఏఎస్‌ల సతీమణిలు కూడా కొంగు బిగిస్తే.. పల్లె సీమలు ప్రగతి బాట పడతాయని జనం చర్చించుకుంటున్నారు.

పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ- యంత్రాంగం

కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సును ఏఐజీడీఎస్‌యూ సూచించిన సవరణలతో వెంటనే అమలు చేయాలని, 8గంటల పని కల్పిస్తూ రెగ్యులరైజ్ చేయాలని అఖిలభారత గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వారం రోజులుగా వారు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో తపాలా ఉద్యోగుల దీక్షలకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చందరాజు మద్దతు తెలిపి మాట్లాడారు. ఉద్యోగులకు వచ్చే బెనిఫిట్స్ వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సమ్మెకు సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సబ్‌కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తపాలా ఉద్యోగులు మాట్లాడుతూ.. మూడు గంటల వేతనంతో పది గంటల పని చేస్తున్నామని, ఎనిమిది గంటల పనిని కల్పించి పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ర్యాలీ తీశారు. కరీంనగర్ జిల్లా వేములవాడ సబ్‌పోస్టాఫీస్ కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పోస్టల్ కార్యాలయంలో నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు.

అనంతరం ధర్నాచౌక్ వద్ద పోస్టల్ సేవకుల సంఘం కార్యదర్శి విఠల్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పోస్టల్‌లో పనిచేస్తున్న సిబ్బందికి గ్రాట్యుటీ, అలవెన్సులు అందజేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లాలో పోస్టల్ ఉద్యోగుల ధర్నాకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గంగాధరప్ప మద్దతు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం పోస్టాఫీస్ ఎదురుగా, నల్లగొండ, ఖమ్మంలోనూ దీక్షలు కొనసాగుతున్నాయి.

సమ్మె నోటీస్‌కు స్పందించిన సర్కారు

మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీతో చర్చలు

- 23న మరో దఫా జరుగనున్న చర్చలు



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ఆగస్టు 3న ప్రభుత్వానికి ఇచ్చిన సమ్మె నోటీస్‌కు ప్రభుత్వం స్పందించింది. సమస్యలను పరిష్కరించకపోతే ఆగస్టు 29,30 తేదీల్లో టోకెన్ చేస్తామని సమ్మె నోటీసులో జేఏసీ పేర్కొంది. దీనికి స్పందించిన ప్రభుత్వం సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నేతలతో చర్చలు జరిపింది. ఈ చర్చల్లో మున్సిపల్ పరిపాలన శాఖ స్పెషల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, డీఎంఏ టికె శ్రీదేవి, అడిషనల్ డైరెక్టర్ అనురాధ, అసిస్టెంట్ డైరెక్టర్ త్రిలేష్‌కుమార్ తదితర అధికారులతోపాటు తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నేతలు (సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఎంఎస్, హెచ్ఎంఎస్, ఎఐటీయూటీయూసీ, టీఎన్‌టీయూసీ) పాలడుగు భాస్కర్, కమర్ అలీ, జె వెంకటేష్, కె ఏసురత్నం, పి శ్రీనివాస్‌రావు, కె సూర్యం, ఎంకె బోస్ తదితరులు పాల్గొన్నారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని, సమ్మెను వాయిదా వేయాలని ప్రభుత్వ విజ్ఞప్తి చేసింది. సమ్మె నోటీసులో పేర్కొన్న కార్మికులకు వేతనాల పెంపుదల, బకాయి వేతనాల చెల్లింపులపై స్పష్టమైన ఆదేశాలు ఇస్తే సమ్మె విషయంపై పునరాలోచిస్తామని జేఏసీ నేతలు తెలిపారు. నిర్దిష్టమైన ఆదేశాలకు కొంత గడువు ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. ఈ డిమాండ్లపై ఈ నెల 23న మరో దఫా చర్చలు జరపాలని నిర్ణయించారు.

జీహెచ్ఎంసీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వచ్చినట్టుగానే జిల్లా మున్సిపల్, కార్పొరేషన్లు, నగర పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులకు కూడా వేతనాలు పెంచాలని కోరారు. విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసినట్టుగానే వీరిని కూడా పర్మినెంట్ చేయాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ ఖాతాలను ఖచ్చితంగా నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ చుట్టు ఉన్న కొత్త మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో(బోడుప్పల్, పీర్జాదిగూడ, పెద్దంబర్‌పేట) కార్మికులకు తగ్గించిన వేతనాలను ఎరియర్స్‌తో సహా చెల్లించాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు ప్రాధాన్యత ఇచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులతోపాటు కాంట్రాక్టు కార్మికులందరికీ రక్షణ పరికరాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

బండారం బయటపడుతుందనే...

బహిరంగ చర్చకు రాలేదా?

జూపల్లికి చల్లా వంశీచంద్‌రెడ్డి ప్రశ్న



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన జీవో మార్పులు చేయలేదన్న మంత్రి జూపల్లి కృష్ణారావు...తన బండారం బయటపడుతుందనే భయంతో బహిరంగ చర్చకు రాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. జీవో మార్పులు చేశారని తాను, చేయలేదని జూపల్లి అనడంతో మార్పులు చేసినట్టు నిరూపించేందుకు బహిరంగ చర్చకు రావాలని కోరితే ఆయన తప్పించుకుని పారిపోయారని ఆరోపించారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలోని మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకు ముందుకు జూపల్లి చర్చకు వస్తారని ఆయన గంటసేపు ఎదురు చేశారు. ఆయన రాకపోవడంతో మీడియాతో మాట్లాడుతూ పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుపై జూపల్లి, అబద్దాలు, అవాస్తవాలు చెప్పి ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా ఉండి పాలమూరు తీరని అన్యాయం చేస్తున్న దుర్మార్గుడు, జిల్లాకు ప్రథమ శత్రువు అని చెప్పారు. సాగు, తాగునీటి విషయంలో కల్వకుర్తి నియోజకవర్గానికి అన్యాయం జరుగుతుందని చెబుతుంటే... నాపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారన్నారు.తాను 70 ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిస్తే...కేటీఆర్ 170 ఓట్లతో గెలిచారు కదా? ఆయనను ఏమంటారని టీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి జూపల్లికి వత్తాసు పలుకుతూ కల్వకుర్తికి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. పదవులకు కక్కుర్తిపడి మంత్రి జూపల్లిని ప్రశ్నించడం లేదన్నారు. డిండికి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి నీటి తరలించొద్దంటూ మంత్రి జూపల్లి నేతృత్వంలో జిల్లా ఎమ్మెల్యేలంతా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసి... ఇప్పుడు జీవోలు మార్పులు చేసి కల్వకుర్తికి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నవయుగ కంపెనీ ఎంగిలి మెతుకులకు కక్కుర్తి పడి రాష్ట్ర ప్రభుత్వానికి వెయ్యి కోట్లు నష్టం వస్తున్నా...పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు మొదటి పంపుహౌస్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.

దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు
మోడీపై ఖుర్షీద్ విమర్శ

నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఏఐసీసీ మైనార్టీ విభాగం చైర్మెన్ ఖుర్షీద్ అహ్మద్ సయ్యద్ చెప్పారు. మూడేండ్ల మోడీ పాలనలో ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. రైతులపై దాడులు, గోరక్ష పేరుతో అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రజలను పాలించడం లేదని, ప్రజలను విభజిస్తున్నారని ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.గోరఖ్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోతే కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించ డంలో కేంద్రం విఫలమైందన్నారు. ముస్లిం మహిళల తలాక్ గురించి మాట్లాడుతున్న మోడీ తన భార్య గురించి ఎందుకు మాట్లాడం లేదన్నారు. వారణాసిలో వేలాది మంది వితంతువు మహిళల సంక్షేమంపై ఎందుకు దృష్టి పెట్టడం లేదన్నారు. మోడీ అస్తవ్యస్త పాలన కారణంగా విదేశి పెట్టుబడులు రావడం లేదన్నారు. కాంగ్రెస్ అవినీతికి పాల్పడితే మోడీ, కేసీఆర్ ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మోడీ, కేసీఆర్ తోడుదొంగలని విమర్శించారు. ముస్లింలను మభ్యపెట్టేందుకే కేసీఆర్ 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటున్నారని ఆయన చెప్పారు.

మాజీ మంత్రి సమ్మయ్య మృతి పట్ల టీపీసీసీ సంతాపం

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత బొచ్చు సమ్మయ్య(78) మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య సంతాపం తెలిపారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆయన రాష్ట్రానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. సమ్మయ్య కుటుంబానికి వారు సానుభూతి ప్రకటించారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

ప్యాకేజీల వారీగా ఐదు రోజుల కార్యక్రమం

- భారీ బందోబస్తుకు ప్రభుత్వం ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం నేటి నుంచి ఐదు రోజుల పాటూ ప్రజాభిప్రాయ సేకరణ జరగనున్నది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా కలెక్టర్లు వివిధ ప్రదేశాల్లో ప్రజాభిప్రాయం సేకరించనున్నారు. ప్యాకేజీల వారీగా ఈనెల 22 నుంచి 26 వరకూ ప్రజాభిప్రాయం సేకరించడానికి ఏర్పాట్లు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి, రెవిన్యూ, నీటిపారుదల శాఖలు దీనికోసం ఏర్పాట్లు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూసేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లాల ఎస్పీలను రాష్ట్ర ప్రభుత్వం అదేశించింది. మంగళవారం రామగుండం, నిజామాబాద్, షామీర్‌పేట, నల్లగొండ పట్టణాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది. రెండవ దశలో ఈ నెల 23 న రామగుండం, సంగారెడ్డి, నిజామాబాద్, నల్లగొండ పట్టణాల్లోనూ, మూడవ దశలో ఈ నెల 24 న రామగుండం, సంగారెడ్డి పట్టణాల్లోనూ, నాలుగవ దశలో ఈ నెల 26న వరంగల్, రామగుండం, నిజామాబాద్, సంగారెడ్డి పట్టణాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని అధికారులు తెలిపారు.

త్వరలోనే నూతన మద్యం పాలసీ

ఆబ్కారీ శాఖ సమీక్షలో మంత్రి పద్మారావు



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

నూతన మద్యం పాలసీని త్వరలోనే రూపొందిస్తామని ఆబ్కారీ శాఖ మంత్రి పద్మారావు తెలిపారు. ప్రతిపాదనలు రూపొందించిన వెంటనే సీఎం కేసీఆర్ నివేదిక అందజేస్తామన్నారు. సోమవారం సచివాలయంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఎక్సైజ్ పాలసీ రూపకల్పనకు ముందు ఐఎమ్ఎఫ్ఎల్ లైసెన్సులు కలిగిన వారందరితో సమావేశం నిర్వహించి ముందుగా ముసాయిదా పాలసీ రూపొందించాలని మంత్రి ఎక్సైజ్ ఉన్నతాధికారులకు సూచించారు. గత ఏడాది కంటే భిన్నంగా ఈ ఏడాది ఎక్సైజ్ పాలసీ ఉండేవిధంగా ముసాయిదాను రూపొందించాలన్నారు. కొత్త జిల్లాలు ఏర్పాటైన నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్ని లిక్కర్ షాపులు, బార్‌లను ఏర్పాటు అవసరమవుతాయి? అన్న విషయాలను కూడా పరిగణలోకి నూతన పాలసీని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా డీనోటిఫికేషన్ ఆఫ్ స్టేట్ హైవేస్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హైవే రోడ్ల వెంట ఎన్ని వైన్ షాపులు ఉన్నాయి.. ఇప్పటికీ ఎన్నిటినీ తరలించారు.. మిగిలిన వాటిని ఎప్పటి వరకు తరలిస్తారని మంత్రి అధికారులను ప్రశ్నించారు. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

గుర్తింపు కార్డుల జాప్యంపై ఆగ్రహం

కల్లు గీత కార్మికులకు గుర్తింపు కార్డుల అందజేతలో జరుగుతున్న జాప్యంపై మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న గీత కార్మికులందరినీ గుర్తించి అర్హత గల వారందరికీ సెప్టెంబర్ నెలాఖరు వరకు కార్డులు అందజేయాలని తెలిపారు. అదేవిధంగా చెట్లు యంత్రాల పరిశీలన, నీరా స్టోరేట్, మార్కెటింగ్ విషయాలపై ఆరా తీశారు. గీత కార్మికులు ఈత చెట్లు ఎక్కే యంత్రాలను ఉచితంగా అందజేయాలన్నారు. ప్రమాద వశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, అంగవైక్యలం కలిగిన వారికి కూడా రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలన్నారు, ఈ సమీక్షలో ఆబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్, కమిషనర్ చంద్రవదన్, అడిషనల్ కమిషనర్ రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

దామాషా పద్ధతిలో కృష్ణా జలాలను విడుదల చేయాలి

- జూలకంటి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

దామాషా పద్ధతిలో కృష్ణా జలాలను విడుదల చేయాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, కర్నాటక ప్రభుత్వాలు కృష్ణా నదిపై అడ్డగోలుగా, అక్రమంగా ప్రాజెక్టులు నిర్మిస్తున్నాయని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. దీంతోపాటు ప్రస్తుతమున్న ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచటంతో కింది రాష్ట్రమైన తెలంగాణాకు నీరు విడుదల కావటం లేదని తెలిపారు. ఫలితంగా గత మూడేండ్ల నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టు అడుగంటిపోతున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు నిండుగా ఉన్నప్పటికీ కిందికి నీళ్లను వదలటం లేదని వివరించారు. ఈ నేపథ్యంలో దామాషా పద్ధతిలో కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణాకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు. తద్వారా కేంద్రంపైన, కృష్ణాబోర్డుపైనా ఒత్తిడి తీసుకొచ్చి దామాషా పద్ధతి అమలుకు పూనుకోవాలని జూలకంటి విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

సాంస్కృతిక వైవిధ్యం



భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశపు మౌలిక విధానం. రాజ్యాంగం ఆమోదించిన సూత్రం. పరంపరగా వస్తున్న భారతీయ జీవన విధానంలోని మేలిమి అంశం. అందుకే దేశాన్ని హిందూరాజ్యంగా మార్చే కుట్రల్ని ప్రతిఘటించడం నేటి అవసరం. రామజన్మభూమి వివాదం సర్వోన్నత న్యాయస్థానంలో ఉన్నప్పటికీ రెండు నెలల్లో రామాలయ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని విశ్వహిందూపరిషత్ నాయకుడు ప్రవీణ్ తొగాడియా చెప్పడం అభ్యంతరకరం. ఆలయ నిర్మాణం కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలనడం ఆక్షేపణీయం. ఎప్పటికయినా రామజన్మభూమి స్వాధీనం చేసుకుంటామనడం దుర్మార్గం. రాజ్యాంగ సూత్రాలపై, న్యాయస్థానాలపై కూడా ఈ కాషాయ నేతకు గౌరవం లేదని ఆదివారం హైదరాబాద్‌లో తొగాడియా చేసిన ప్రసంగం చెబుతోంది. దేశంలో సంఘ్ పరివార్ మతోన్మాదుల అసహనం హద్దు మీరిపోతున్నదనడానికి ఈ రెచ్చగొట్టే ప్రసంగమే తార్కాణం.

చారిత్రకంగా పలు సంస్కృతులకు ఆలవాలమైంది ఈ దేశం. కనుకనే భారత ఔన్నత్యాన్ని చాటుతున్న 'భిన్నత్వంలో ఏకత్వమనే' మిశ్రమ సంస్కృతుల పరిరక్షణకు లౌకిక, సామ్యవాద, ప్రజాతంత్ర వాదులందరూ ఇలా ఒక్కతాటిపైకి రావడం అభినందనీయం.

ఈ నేపథ్యంలో ఇటీవల జనతా దళ్ యునైటెడ్ (జేడీయూ) అసమ్మతి నేత, రాజ్యసభ సభ్యులు శరద్ యాదవ్ న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశానికి ప్రాధాన్యత ఉన్నది. ప్రతిపక్ష పార్టీలు, దళిత, గిరిజన, మైనార్టీ తదితర సామాజిక, ప్రజా సంఘాలకు చెందిన నాయకులను ఆహ్వానించారు. 'దేశ మిశ్రమ సంస్కృతిని కాపాడుకుందాం' అన్న ఎజెండా చర్చకు పెట్టారు. చారిత్రకంగా పలు సంస్కృతులకు ఆలవాలమైంది ఈ దేశం. కనుకనే భారత ఔన్నత్యాన్ని చాటుతున్న 'భిన్నత్వంలో ఏకత్వమనే' మిశ్రమ సంస్కృతుల పరిరక్షణకు లౌకిక, సామ్యవాద, ప్రజాతంత్ర వాదులందరూ ఇలా ఒక్కతాటిపైకి రావడం అభినందనీయం.

ఆర్ఎస్ఎస్ తానులో గుడ్డ అయిన బీజేపీ కేంద్రంలో అధికార పీఠ మెక్కినప్పటి నుంచి సంఘ్ పరివార్ రెచ్చిపోతూనే ఉన్నది. మైనార్టీలపైనా, దళితులపైనా, ప్రశ్నించే వారిపైనా, అంధ విశ్వాసాలను వ్యతిరేకించే హేతువాదులపైనా, వామపక్షాల కార్యకర్తలపైనా దాడులతో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. హిందూరాజ్య స్థాపనే అంతిమ లక్ష్యంగా చెప్పుకునే ఆర్ఎస్ఎస్ మతతత్వ అజెండాను అమలు జేసే కుట్రలో భాగంగా తాలిబాన్ తీవ్రవాదులను మించిపోతున్నారు. ఈ దశలో లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామ్యకాముకులంతా ఏకమై పోరాడాల్సిన అవసరమున్నది. ఇరాక్, అఫ్ఘనిస్థాన్, నైజీరియా, పాకిస్థాన్, సిరియా, యెమెన్, థాయిలాండ్ ఇలా ప్రపంచంలో ఏ దేశానుభవం చూసినా ఉగ్రవాదం జడలు విప్పి చేస్తున్న రక్తపాత నృత్యానికి నేపథ్యగీతం మతోన్మాద నియంతృత్వమే. సంఘ్ పరివార్ ఏలుబడిలో మన దేశం కూడా హిందూత్వ మెజార్టీ మతతత్వం రూపంలో ప్రస్తుతం ఇదే పెనుముప్పు ముంగిట నిలవడం ఆందోళన కలిగిస్తోంది.

రాజ్యాంగ ప్రతీకాత్మలుగా చెప్పుకునే సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర సూత్రావళిని కాలరాస్తూ 'దేశభక్తి'కి సంఘ్ కొత్త నిర్వచనాలు చెబుతోంది. 'ఏ' గ్రేడ్ చిత్రాలు ప్రదర్శించే సినిమాహాళ్లలోనూ 'జన గణ మన' ఆలాపన చేస్తే కానీ దేశభక్తి నిరూపించుకోలేనంత దౌర్భాగ్య వాతావరణం రాజ్యమేలుతోంది. యాంత్రీకరించిన వ్యవసాయక్షేత్రాల్లో అన్నదాత ఆత్మహత్యలకు 'ఆవు' మాత్రమే విరుగుడు అంటూ అర్థంలేని 'ప్రకృతి సేద్య' వాదాలతో గో సంరక్షకుల పేరిట బయల్దేరిన గోగూండాలు దారిపొడవునా దారుణ హత్యలు సాగిస్తున్నా 'పశు' పాలకులు నోరు పెగల్చడం లేదు. గోసంరక్షకుల పేరుతో దాడులను ఒప్పుకోం అంటూ చేతులు దులుపుకోవడం మినహా వారి కట్టడికి చేసిన చర్యలు మృగ్యం.

కార్పొరేట్ కనుసన్నల్లో నడిచే మీడియా కూడా మతోన్మాదులు, గోగూండాలు సాగిస్తున్న హింసాత్మక చర్యలను ఖండిస్తోందే తప్ప మతతత్వ ప్రమాదాన్ని కానీ, దానికి కేంద్ర బిందువుగా ఉన్న సంఘ్ పరివార్‌ను కానీ వేలెత్తి చూపే సాహసం చేయడం లేదు. దేశద్రోహం కింద జేఎన్‌యూ విద్యార్థి నేత కన్నయ్య కుమార్ అరెస్టు సమయంలో ప్రసారం చేసిన ట్యాంపరింగ్ వీడియో, కేరళలో 'లవ్ జిహాద్' అంశంపై అల్లుతున్న కట్టుకథలే ఇందుకు నిదర్శనం. సంఘ్ పరివార్ మతతత్వ జాడ్యానికి సహకరించడం ద్వారా ప్రజల మధ్య తంపులు పెట్టి దేశ సంపదను కొల్లగొట్టవచ్చనే ప్రయత్నంలో కార్పొరేట్ సంస్థలున్నాయి. బీజేపీకి కార్పొరేట్ సంస్థల నుంచి అందిన వందల కోట్ల విరాళాలే దీనికి నిదర్శనం. కార్పొరేట్ మీడియా సంస్థలు కూడా బీజేపీ మతతత్వ ఎజెండాకనుగుణంగానే తమ వార్తలను, విశ్లేషణలను, కథనాలను రూపొందిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో మిశ్రమ భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందంటూ శరద్‌యాదవ్ ఆతిథ్య సమావేశంలో సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ఇచ్చిన పిలుపు సందర్భోచితం. ఒకే దేశం, ఒకే భాష, ఒకే సంస్కృతి పేరుతో దేశ ప్రజలందరిపైనా అగ్రవర్ణ హిందూత్వ సంస్కృతిని రుద్దడానికి ప్రయత్నిస్తున్న మతోన్మాద శక్తుల దాడుల నుంచి విశిష్టమైన భారతీయ మిశ్రమ సంస్కృతిని, పరస్పరం ఇచ్చిపుచ్చుకునే స్నేహపూర్వక సామరస్యతా సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బృహత్తర బాధ్యత భారతీయులందరిపైనా ఉన్నది.

మాంద్యం సుడిలో ఆర్థిక వ్యవస్థ



ప్రభాత్ పట్నాయక్

ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రచురించిన ఆర్థిక సర్వే రెండవ సంపుటి భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయినట్టు చెబుతున్నది. 2016–17 సంవత్సరం మొత్తంలో వాస్తవంలో జోడింపబడిన స్థూల విలువ(గ్రోస్ వాల్యూ యాడెడ్–జీవీఏ–స్థూల జాతీయోత్పత్తిలో నికర పరోక్ష పన్నులు కలిసి ఉంటాయి కాబట్టి అది ఉత్పత్తి ధోరణులను వాస్తవంగా ప్రతిబింబించదు. కాబట్టి జీవీఏని చూడటమే సరియైన పద్ధతి) 6.6శాతం. ఇదే విలువ 2015–16లో 7.9శాతంగా ఉన్నది. అంతకంటే ముఖ్యమైన విషయం ఏమంటే 2016–17లో జీవీఏ త్రైమాసిక వృద్ధి రేటు ప్రతి త్రైమాసికంలో క్షీణిస్తూ వచ్చింది. కేవలం 5.6శాతంగావున్న నాలుగవ త్రైమాసిక వృద్ధి రేటు అంతకుముందు ఏడాది 2015–16లోని అదే త్రైమాసికంలో కంటే దాదాపు 3శాతం తక్కువగా ఉన్నది. అంతేకాకుండా ఈ వృద్ధి రేటు కూడా కృత్రిమంగా రెండు కారకాలచేత బలోపేతం చేయబడింది. ఆ రెండు కారకాలు ఏమంటే వాతావరణం అనుకూలించటంవల్ల పంటలు బాగా పండటం, ఏడవ వేతన సంఘం సిఫారసులు అమలు వల్ల ప్రభుత్వ పాలన, రక్షణ రంగాలలో పెరిగిన వ్యయం. ఉదాహరణకు వ్యవసాయ రంగంలో వాస్తవ జీవీఏ వృద్ధి రేటు 2016–17లో 4.9శాతం ఉంటే అంతకు ముందటేడాదిలో అది కేవలం 0.7శాతంగా ఉన్నది. ఇక ప్రభుత్వ, రక్షణ రంగాలలో 2016–17లో వాస్తవ జీవీఏ వృద్ధి రేటు 11.3శాతం ఉండగా అంతకు ముందు ఏడాది అది కేవలం 6.9శాతం ఉన్నది. మనం ఈ రెండు రంగాలను తీసివేసి చూస్తే సర్వేలో చెప్పినట్టు 'అసలైన(కోర్) జీవీఏ' వస్తుంది. 2015–16లోని కోర్ జీవీఏ వృద్ధి రేటైన 9.8శాతంతో పోల్చినప్పుడు 2016–17లో ఈ వృద్ధి రేటు కేవలం 6.2శాతంగా ఉన్నది. అంటే 3.6శాతం వృద్ధి రేటు పతనమైందన్నమాట. ఏడాదంతా వృద్ధి రేటు తక్కువగా ఉండటమే కాకుండా అది క్రమేణా పతనమవుతూ వచ్చింది. చివరి త్రైమాసికానికి వచ్చేసరికి 2015–16తో పోల్చినప్పుడు ఆ మరుసటి ఏడాది 6.8శాతందాకా పతనమైంది. ఇది తిరుగులేని పతనం. అంతేకాకుండా ఈ క్షీణత తప్పకుండా వచ్చే ఏడాది కూడా కొనసాగుతుంది. ఇందుకు మూడు కారణాలున్నాయి. ప్రభుత్వ, రక్షణ రంగాల వ్యయంలో జరిగిన పెరుగుదల ఇక ముందు ఉండదనేది మొదటిది. దీనితో ఆర్థిక వ్యవస్థ రెండు విధాలుగా ప్రభావితమవుతుంది. ఈ రంగంలో వృద్ధి రేటు స్పష్టంగా మందగిస్తుందనేది మొదటిది. అయితే స్పష్టంగా లేని రెండవ కారణం ఈ విధంగా ఉంటుంది. ఒకవేళ ప్రభుత్వం వేతనాలను రూ.100 పెంచిందనుకుందాం. ఇది ప్రత్యక్షంగా ఆ మేరకు ఉత్పత్తి పెరిగినట్టుగా కనిపిస్తుంది. అయితే దీనితో ఆ రూ.100 ఖర్చుచేయబడటంతో డిమాండ్ పెరిగి ఇతర రంగాలలో ఉత్పత్తి పెరగటానికి దారితీస్తుంది. అది జరిగినప్పుడు ఆ రంగాలలో అదనపు ఆదాయం ఆవిర్భవిస్తుంది. అలా చేతికందిన అదనపు ఆదాయాలు కూడా ఖర్చుచేయటంవల్ల మరిన్ని ఆదాయాలు సృష్టించబడతాయి. విషయం అలా కొనసాగుతుంది. అలా జరిగినప్పుడు ఏ రంగాలలోనైతే ఆదాయాలు సృష్టించబడ్డాయో ఆ ఆదాయాలు ఖర్చు చేయబడి మరింతగా ఆదాయాలు పెరగటానికి దారితీస్తుంది. దీనినే పెరిగిన ప్రభుత్వ వ్యయ 'గుణక ప్రభావం' (మల్టిపైయర్ ఎఫెక్ట్) అని అంటారు. ప్రభుత్వ వ్యయం రూ.100 పెరిగిన పర్యవసానంగా 'గుణక ప్రభావం'చేత జీవీఏ గణనీయంగా 300 లేక అంతకుమించి పెరుగుతుంది. 7వ వేతన సంఘం సిఫారసులను ప్రభుత్వం అమలుచేయటంవల్ల జీవీఏ పెరిగిందని సర్వే పేర్కొన్నప్పుడు అది మొత్తం ఆర్థిక వ్యవస్థపై గుణక ప్రభావం గురించి కాకుండా ఈ రంగంలోని జీవీఏ పెరుగుదలను మాత్రమే సూచిస్తున్నది. 2016–17లో 'కోర్' రంగంలో జరిగిన వృద్ధి రేటు కూడా 'కోర్ కాని' ప్రభుత్వ పాలన, రక్షణ రంగాలలో చేసిన ప్రభుత్వ వ్యయంతో బలోపేతమైంది. అది ఈ రంగాలలో జరిగిన జీవీఏలో ప్రతిబింబించింది. వాస్తవం ఇలావున్నప్పటికీ ఒకవేళ 2016–17లో కోర్ జీవీఏ వృద్ధి రేటు కేవలం 6.2శాతం మాత్రమేవుంటే అలా బలోపేతం చేయబడకుండావుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో ఊహించుకోవచ్చు. అయితే ఊహించినట్టుగానే వచ్చే ఏడాది ఇలా బలోపేతం చేయటం కుదరదు గనుక దీని గుణక ప్రభావం ఉండదు. కాబట్టి మొత్తంగా చూసినప్పుడు జీవీఏ పెరుగుదల గణనీయమైన కుదింపునకు గురవుతుంది. పవర్, టెలికమ్యూనికేషన్ రంగాలకు చెందిన అనేక కంపెనీల బ్యాలన్స్ షీట్స్ ప్రతికూలంగా మారటంతో ఈ క్షీణత మరింత వేగవంతం కావటం రెండవ కారకంగా ఉంటుంది. ఇలా ప్రతికూలంగా మారిన బ్యాలన్స్ షీట్స్ ముఖ్యంగా ఇటువంటి కంపెనీలకు పెద్దఎత్తున అప్పులు ఇవ్వటంవలన ఏర్పడిన నిరర్థక ఆస్తులు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులకు ప్రమాదకారిగా మారుతాయి. ఎందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులే ప్రమాదంలో పడుతున్నాయి? అనే ప్రశ్నను అడగవలసిన అవసరం ఉన్నది. 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్'ను అభివృద్ధి చేసే పేరిట ప్రభుత్వం ఈ రంగంలోని కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ రంగ బ్యాంకులచేత పెద్ద ఎత్తున అప్పులు ఇప్పించటంవల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రయివేటు రంగంలోని బ్యాంకులు, విదేశీ బ్యాంకులు ఈ ఉచ్చులోపడకుండా తమతెలివితేటలను ప్రదర్శించాయి. ప్రభుత్వం ఈ బ్యాంకులను బలవంతపెట్టలేకపోయింది. తత్ఫలితంగా ప్రయివేటు రంగ బ్యాంకులు కాకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులు సంక్షోభంలో పడ్డాయి.

> **ఈ దేశాన్ని ఈ దేశ ప్రజల ప్రయోజనం కోసం నడపాలా లేదా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనం కోసం నడపాలా? ఒకవేళ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి తన పెట్టుబడులను ఉపసంహరించుకోదలిస్తే (అది అంత సులువు కాదు) అటువంటి తీవ్ర పరిస్థితులలో పెట్టుబడుల ప్రవాహాలపై నియంత్రణ విధించటం 'ఎల్లవేళలా తప్పకాదు' అని ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య నిధి కూడా అంగీకరిస్తున్నది కదా. అయితే ఇదంతా ఎన్‌డీఏ ప్రభుత్వ వివేకంలో భాగంగా లేదు.**

ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు కొత్తగా అప్పులు ఇవ్వటానికి జంకుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో మాంద్య పరిస్థితులవల్ల కొత్తగా అప్పులు అడిగేవారు కూడా తగ్గిపోయారనుకోండి. అయితే అప్పు కోసం ఉన్న డిమాండ్ కంటే ఇచ్చిన అప్పు తక్కువగా ఉన్నదని సర్వే



తెలియజేస్తున్నది. ఈ పరిస్థితి రాబోయే రోజుల్లో కూడా మారదు. అందుకు భిన్నంగా 2017–18లో ఇది మరింతగా కుంగదీసి ఆర్థికాభివృద్ధిని దెబ్బతీస్తుంది. ప్రభుత్వరంగ బ్యాంకులు వత్తిడికి గురవుతున్నాయనే పేరుతో వాటిని ప్రభుత్వం ప్రయివేటీకరించబూనటం ఒక వింత! పెట్టుబడులు పెట్టిన ప్రయివేటు కంపెనీలకు ప్రభుత్వం వత్తిడిచేసి అప్పులు ఇప్పించి ప్రభుత్వ రంగ బ్యాంకులను సంక్షోభంలో పడేలా చేసింది. ఇప్పుడు అదే ప్రభుత్వం ప్రయివేటు బ్యాంకులు అప్పులు ఇవ్వటంలో తెలివిగా వ్యవహరిస్తాయనేపేరుతో ఈ బ్యాంకులను ప్రయివేటీకరించాలని ప్రయత్నిస్తోంది!

మూడోది, విదేశీ రంగానికి సంబంధించినది. అమెరికా ప్రస్తుతం వడ్డీ రేట్లను పెంచే ఆలోచన చేయటంలేదనేది సుస్పష్టం. ఇలాంటి పరిస్థితులలో ఎక్కువ వడ్డీ రేటుగల భారతదేశంవంటి దేశాలకు విదేశీ ద్రవ్య పెట్టుబడులు వెల్లువెత్తుతాయి. ఇది ఆయా కరెన్సీల మారకపు రేటు పెరగటానికి దారితీస్తుంది. పెరుగుతున్న భారత మారకపు విలువ సమీప భవిష్యత్తులో ఇది తగ్గే అవకాశం లేదు. ఈ మధ్యకాలంలో చైనా తన కరెన్సీ విలువను తగ్గించిన నేపథ్యంలో ఇది జరుగుతున్నది. దీని ప్రభావంవల్ల అసలే అంతంత మాత్రంగావున్న భారతదేశ ఎగుమతుల వృద్ధి రేటు క్షీణించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ అమెరికా నుంచి ఔట్‌సోర్స్ చేయబడుతున్న సేవలకు సంబంధించిన కార్యకలాపాలను నిరోధించాలనే ప్రయత్నం చేస్తున్న ప్రస్తుత తరుణంలో భారత సేవారంగ ఎగుమతులు ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటాయి.

మనం ఈ కారకాలన్నింటినీ జతచేసినప్పుడు 2017–18లో భారత ఆర్థిక వ్యవస్థలో వృద్ధి రేటు గణనీయంగా మందగిస్తుందనేది సుస్పష్టం. 2016–17లో బాగా వాస్తవ జీవీఏని నమోదు చేసిన వ్యవసాయ రంగంలో కూడా క్షీణత ఉంటుంది. క్లుప్తంగా చెప్పాలంటే ఆర్థిక వ్యవస్థ మాద్యంలో పీకలదాకా మునుగుతుంది. అందుబాటులోవున్న సమాచారం ప్రకారం గత రెండేండ్లలో సంఘటిత రంగంలో ఉద్యోగ కల్పన తీవ్ర స్థాయిలో క్షీణించింది. ఈ క్షీణత మరింతగా తీవ్రతరం కాబోతున్నది.

నిజానికి 'విత్త శుద్ధత'(ఫిస్కల్ రెక్టిట్యూడ్) పట్ల సర్వే తన నిబద్ధత చాటింది. వ్యవసాయ రుణాలను రద్దుచేస్తే ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ కుదింపునకు గురవుతుందని, అది మాంద్యం ఏర్పడటానికి గల కారణాలలో ఒకటవుతుందని సర్వే పేర్కొంది. ఈ ప్రక్రియలో రూ.100 వ్యవసాయ రుణాన్ని ప్రభుత్వం తనమీద వేసుకుంటే (రుణమాఫీ అంటే ప్రభుత్వం ఆ రుణాన్ని తనమీద వేసుకోవటమే) అదే స్థాయిలో ప్రభుత్వం తన వ్యయాన్ని వేరే చోట తగ్గించుకోవలసి ఉంటుంది. ఎందుకంటే ఈ ప్రభుత్వం తన ద్రవ్య లోటును నియంత్రించే ఎఫ్ఆర్‌బీఎమ్ నిబంధనలకు కట్టుబడి ఉన్నది. అంటే తాను చేపట్టిన రూ.100 రుణం స్థాయిలో సమిష్టి డిమాండ్ కుదింపునకు గురవుతుంది. డిమాండ్ తగినంతగా లేని ఆర్థిక వ్యవస్థలో ఎఫ్ఆర్‌బీఎమ్ నిబంధనలను ఉల్లంఘించటానికి ఎందుకు వెనుకాడవలసి వస్తుందో సర్వే పేర్కొనలేదు. ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోతున్నప్పుడు, దానికి పరిష్కారంగా ప్రభుత్వ వ్యయాన్ని పెంచవలసి వచ్చినప్పుడు తాను చేసిన పనికిమాలిన చట్టం చట్రంలో ప్రభుత్వం ఎందుకు ఖైదీగా ఉండాలి? ఎఫ్ఆర్‌బీఎమ్ నిబంధనలను బే ఖాతరుచేస్తే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి కోపం వస్తుందనేది నిజం. అయితే ఈ దేశాన్ని ఈ దేశ ప్రజల ప్రయోజనం కోసం నడపాలా లేదా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనం కోసం నడపాలా? ఒకవేళ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి తన పెట్టుబడులను ఉపసంహరించుకోదలిస్తే (అది అంత సులువు కాదు) అటువంటి తీవ్ర పరిస్థితులలో పెట్టుబడుల ప్రవాహాలపై నియంత్రణ విధించటం 'ఎల్లవేళలా తప్పుకాదు' అని ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య నిధి కూడా అంగీకరిస్తున్నది కదా. అయితే ఇదంతా ఎన్‌డీఏ ప్రభుత్వ వివేకంలో భాగంగా లేదు.

అనువాదం: నెల్లూరు నరసింహారావు
సెల్ : 8886396999



పెద్దారపు రమేష్

ప్రభుత్వ కబంధ హస్తాల్లో కౌలు రైతులు

తెలంగాణ రాష్ట్రం వస్తే కౌలు రైతుల పరిస్థితి మెరుగుపడుతుందని ఆశించాం. కానీ పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయింది. 2014లో ఒక్క గుర్తింపు కార్డు ఇవ్వలేదు. 2015లో జీవో 282 ద్వారా గత చట్టాన్ని అమలుకు పూనుకోవాలని ఆదేశించి 4.5 లక్షల గుర్తింపు కార్డులు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నా కేవలం 43,500 కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చారు. అందులో 8వేల మందికి రూ.26 కోట్ల రుణం ఇచ్చి చేతులు దులుపుకుంది. 2016లో నామమాత్రమే. ఈ ఏడాది యింతవరకు ఒక్క కార్డు కూడా జారీ చేయలేదు. మరి బంగారు తెలంగాణ సాధిస్తామని చెపుతున్న కేసీఆర్ ప్రభుత్వం ఉత్పత్తిలో కీలక భూమిక పోషిస్తున్న 14లక్షల మంది కౌలుదారుల సమస్యలను పరిష్కరించకుండా, రైతు ఆత్మహత్యలను ఆపకుండా ఎట్లా సాధ్యం?

పంటలు పండించటంలో కౌలు రైతుల పాత్ర కీలకమని 'నితి అయోగ్' తెలిపింది. భూములపై ఎలాంటి హక్కులు లేని కౌలుదారుల శ్రమను, పండించిన పంటలను కౌలుపేరుతో భూ యజమానులు, అప్పుల పేరుతో వడ్డీ వ్యాపారులు, పంటల అమ్మకం పేరుతో మధ్య దళారులు, సరైన మార్కెట్ సౌకర్యం, కనీస మద్దతు ధర కల్పించకుండా ప్రభుత్వం బహుముఖంగా రైతు వెన్ను విరుస్తున్నారు.

స్వాతంత్ర్యం వచ్చాక కౌలుదారుల హక్కుల కోసం 1950లో రక్షిత కౌలుదారీ చట్టం తీసుకువచ్చినా అమలుకు నోచుకోలేదు. భూస్వాముల వ్యతిరేకత, అధికార పార్టీలో అధికంగా భూస్వాములే వుండటంతో చట్టం తెచ్చినా మూలన పడేశారు. అప్పటి నుంచి కౌలుదారుల పోరాటం కొనసాగుతూనే వుంది. ఈ క్రమంలో 2011లో ఉమ్మడి రాష్ట్రంలో ల్యాండ్ లైసెన్స్‌డ్ కల్టివేటర్స్ ఆక్ట్–2011 తీసుకొచ్చి గత 1950 చట్టంలోని భూమిపై కౌలు దారులకు ఉండే హక్కును, ఇతర కొన్ని సౌకర్యాలను తొలగించారు. ఈ 2011 చట్టం ప్రకారం కౌలుదారులకు గుర్తింపు కార్డులు (లోన్ ఎలిజిబిలిటీ కార్డు) ఇచ్చి ఆ కార్డు పొందిన కౌలు రైతులకు 4 ముఖ్య ప్రయోజనాలు అనగా 1. పంట రుణం, 2. పంటల బీమా 3. పంట నష్ట పరిహారం 4. సబ్సిడీలు, రాయితీలు కల్పించాలి. ఇందుకు రెవిన్యూ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు బాధ్యత వహించాలి. గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులతో దరఖాస్తులు స్వీకరించి గ్రామ రెవెన్యూ అధికారి ఫీల్డ్ ఎంక్వైరీ చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి.

2011 డిసెంబర్‌లో ల్యాండ్ లైసెన్స్‌డ్ కల్టివేటర్స్ ఆక్ట్ వస్తే 2012లో ఉమ్మడి రాష్ట్రంలో 6లక్షల 80వేల మంది కౌలు రైతులు దరఖాస్తు చేస్తే 5లక్షలమందికి గుర్తింపు కార్డులు ఇచ్చి 390 కోట్ల పంటరుణం ఇచ్చారు. 2013లో 4లక్షల 80వేల మంది కౌలు దారులు దరఖాస్తు చేస్తే 3లక్షల 90వేల మందికి కార్డులు ఇచ్చారు. ఇందులో 2 లక్షల 30వేల మందికి రెన్యూవల్ చేశారు. అంతాకలిపి 133 కోట్ల రుణాలు ఇచ్చారు.

2011 భూ అధీకృత రైతుల చట్టం ప్రకారం ప్రతీ ఏడూ మే నెలలోనే అంటే ఖరీఫ్ ప్రారంభానికి ముందే గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి. ఇందుకు రెవిన్యూ శాఖ అకౌంటి బిలిటీగా వుండాలి. కానీ ఇది రాష్ట్రంలో ఎక్కడా జరగటం లేదు. భూ యజమానితో సంబంధం లేకుండా దరఖాస్తులు స్వీకరించాలని చట్టం చెపుతుంటే, రెవెన్యూ అధికారులు భూ యజమాని అభ్యంతరం చెపుతున్నాడని కుంటి సాకులు చెప్తున్నారు.

మరోవైపు 2016 నుంచి కౌలు రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లోనే గుర్తింపు కార్డులు ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించి అసలుకే ఎసరు పెట్టింది. వ్యవసాయం చేసి పంటలు పండించటంలో మెలకువలు తెలిసిన కౌలు రైతులు మెజారిటీగా నిరక్షరాస్యులుగా ఉన్నారు. ఆన్‌లైన్ కేంద్రాలు పట్టణ కేంద్రాలల్లో మాత్రమే ఉంటాయి. ఇలాంటి స్థితిలో కౌలు రైతులు దరఖాస్తులు విపరీతంగా తగ్గాయి. 2016లో అరకొర దరఖాస్తు చేసినా ఇచ్చినవి నామమాత్రమే. ఈ సమస్య పరిష్కారానికి పలు మార్లు ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లిన పాతపద్ధతిలో మ్యానువల్‌గానైనా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరినా ఫలితం శూన్యం. అంటే తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతుల గుర్తింపు కలగానే మిగిలింది. ఈ క్రమంలో మూడేండ్లలో 3043 మంది రైతు ఆత్మహత్యలు జరిగితే అందులో సగానికి పైగా కౌలు రైతులే ఉన్నారు.


యిప్పటికైనా కౌలు రైతులను ఆదుకొనే దిశలో ప్రభుత్వం ఆలోచించాలి. తక్షణమే గుర్తింపు కార్డులు మ్యానవల్‌గానైనా ఇచ్చి, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు, యితర సౌకర్యాలు కల్పించాలి. ప్రభుత్వం ప్రకటించిన రూ.4వేల ఎరువుల రాయితీని కౌలు రైతులకు వర్తింప చేయాలి. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలను గుర్తించి ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. మిగులు భూములను భూమిలేని కౌలు దారులకు పంచాలి. రైతు పండించిన పంటలకు సరైన ధర నిర్ణయించాలి. మార్కెట్ సౌకర్యం కల్పించాలి. అలాగే కౌలు రైతులు సమస్యల పరిష్కారం కోసం ఐక్యతతో ముందుకు సాగాలి, పోరాడాలి సాధించాలి. **సెల్: 8500313310**

డార్జిలింగ్‌లో మమత భాషా చిచ్చు

వేదుల రామకృష్ణ

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఒకప్పుడు డార్జిలింగ్‌ని స్విట్జర్లాండ్ చేస్తానని కలలు కన్నారు. 2010లో అప్పటి వామపక్ష సంఘటన ప్రభుత్వంతో గూర్ఖా ఉద్యమకారులు ఒక అవగాహనకు వచ్చారు. అది బెంగాల్‌లో భాగంగానే ఒక స్వయంపాలనా ప్రాంతం ఏర్పాటు ఆధారంగా ఉంది. కాని మమతా బెనర్జీ వారికి గూర్ఖాల్యాండ్ ఇప్పిస్తానని ఎరవేసి వాడుకున్నారు. అధికారంలోకి వచ్చాక గూర్ఖాల్యాండ్ టెరిటోరియల్ అథారిటీ పేరిట కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఒక త్రైపాక్షిక ఒప్పందం చేసుకుని గూర్ఖాల్యాండ్ అనే మాటైతే ఉంచాను కదా అని వారికి నచ్చజెప్పారు. అప్పటి నుండి గూర్ఖాల్యాండ్ ఉద్యమానికి ఎసరు పెట్టి ఆ ప్రాంతం కూడా బలవంతంగా దఖలు పర్చుకునే ఒత్తిడి రాజకీయాలే నడుపుతున్నారు. ఒప్పందమైన వెంటనే కొండలు నవ్వుతున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. అదే ఆ తరువాత జనాల్లో వ్యాప్తి చెందింది. ఆమె నిర్వాకంవల్ల నేడు డార్జిలింగ్ కొండలు ఇక నవ్వటంలేదు. నిరసన జ్వాలలతో అట్టుడుకుతున్నాయి. కొండ ప్రాంతం సందర్శించి వచ్చి కోల్‌కతాలో నొబాన్నొ (సచివాలయం)లో 14వ అంతస్తు నుండి నీలాకాశం, తెల్ల మేఘాల ఫొటో తీసి ఫేస్‌బుక్‌లో పెట్టగానే భజన పత్రికలు దాన్ని పెద్దగా ప్రచురించాయి. కానీ కొండల్లో వాతావరణం అలాగే ఉందా? కొండల్లో నిప్పు రగిల్చేసి సైన్యం, కేంద్ర బలగాలకు అప్పచెప్పేసి ఆమె విదేశీ పర్యటనకు వెళ్ళిపోయారు. వెళ్ళే ముందు నామ్‌కేవాస్తే ఒక అఖిలపక్ష సమావేశం పిలిచి పోయారు. ఇవన్నీ చూస్తే ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ముఖ్యమంత్రి నిజంగానే కొండల్లో శాంతి కోరుకుంటున్నారా? గూర్ఖా జనముక్తి మోర్చా (జిజేఎం) నాయకుడు బిమల్ గురుంగ్‌తో ఏదేని అవగాహన ఉందా? జూన్ 5న మిరిక్ అనే ఊరులో ఆమె సమావేశమయ్యారు. ఆమె ఉవాచ, "నాల్గవ భాషగా పదో తరగతి వరకు బెంగాలీ నేర్చుకుంటే కొండప్రాంతపు అమ్మాయిలు, అబ్బాయిలకు మంచిదే. వారు కొల్‌కతా, సిలిగుడిలో ఉద్యోగాలు చేస్తే ఉపయోగపడు తుంది." అంటే భారతదేశంలో ఇతర రాష్ట్రాలకు ఉద్యోగరీత్యా వెళితే ఆ రాష్ట్ర భాష నేర్చుకోవాలా?

బిమల్ గురుంగ్‌కు వామపక్ష ప్రభుత్వం మాత్రం వేరే గూర్ఖాల్యాండ్ రాష్ట్రానికి ఒప్పుకోదని తెలుసు. మార్చి 1980లో జ్యోతిబసు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు జీఎన్ఎల్ఎఫ్ నాయకుడు సుభాష్ ఘీషింగ్ ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ గూర్ఖాల్యాండ్ ఎప్పుడూ లేవనెత్తనని ఒప్పుకున్నారు. వామపక్ష ప్రభుత్వం ఉన్నంత కాలం జీఎన్ఎల్ఎఫ్ వేరే రాష్ట్రం డిమాండ్ లేవనెత్త లేదు. అందుకే 34 ఏండ్ల తరువాత గురుంగ్ సహా మోర్చా నాయకత్వం సచివాలయానికి వెళ్ళి మమతా బెనర్జీని శుభాకాంక్షలతో ముంచెత్తారు. ఆ తరువాత కొద్ది రోజులకే మమతా బెనర్జీని గురుంగ్ కొండ ప్రాంత 'తల్లి' అని సంబోధించారు. 2012 జూలై 21న కొల్‌కతాలో ధర్మతలా ప్రాంతంలో జరిగిన తృణమూల్ సాలీనా సభావేదికను అలంకరించి ప్రతినిధిగా మోర్చా అప్పటి నాయకుడు, శాసనసభ్యుడు సర్కా బహదూర్ క్షేత్రి మమతా బెనర్జీ, తృణమూల్‌ని ప్రశంసలతో ముంచేశారు. అప్పుడు బెంగాలీ భాష నేర్చుకుంటే ఉన్న వెసులుబాటు గురించి ఒక్క ముక్క కూడా



మమతా బెనర్జీ మాట్లాడలేదు. ఇంకా చెప్పాలంటే గత ఏడాది కూడా ఆమె నోట ఈ మాట వినపడ లేదు. ఇప్పుడు ఆమెకు డార్జిలింగ్ వెళ్ళే వేళ బెంగాలీ భాష నేర్చుకునే సంగతి గుర్తొచ్చింది. అది కూడా మిరిక్ సభలో వక్కాణించి చెప్పాల్సి వచ్చింది. ఇంత కాలం కొండ ప్రాంతం వారు సిలిగుడి, కొల్‌కతాలో ఉద్యోగాలు చేయలేదా? బెంగాలీ నేర్చుకోకుండానే డార్జిలింగ్ కొండల ప్రజలు మైదాన ప్రాంత ప్రజలతో కలిసి మెలిసి ఎలా ఉన్నారు?

బెంగాలీ భాషకు సంబంధించి ఆమె ప్రకటన ప్రభావం కొండ, మైదాన ప్రాంతంలో ఎలా ఉండగలదో మమతా బెనర్జీకి తెలుసు. డార్జిలింగ్ నేపాలీ భాషవారిని కవ్వించి ఆమె మైదాన ప్రాంత ప్రజలను ప్రభావితం చేయాలను కున్నారు. కానీ ఆమె పాచిక పార లేదు. అది మైదాన ప్రాంతంలో ఆందోళన, పోరాటాల్లో రాటుదేలిన వామపక్ష కార్యకర్తల ఐక్యత, శాంతి – సామరస్యాలు కాపాడుకునే చొరవవల్లే సాధ్యమైంది. కానీ కొండ ప్రాంతంలో వేరే రాష్ట్రం డిమాండ్‌ను మరలా లేవనెత్తటానికి మమతా బెనర్జీ గూర్ఖా జనముక్తి మోర్చాకు అవకాశం కల్పించారు. వేరే రాష్ట్రం సాధించక పోతే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం బెంగాలీ భాషను బలవంతంగా రుద్దేస్తుందని కొండ ప్రాంత ప్రజలకు చెప్పటం సులువౌతుంది.

జూన్ 5న మిరిక్‌లో మమతా సమావేశం తరువాత (12–13 జూన్) తేయాకు కార్మికుల ఐక్య సమ్మె. తేయాకు కార్మికులకు సంఘీభావంగా 12 జూన్ తేయాకు తోటలు ఉన్న నాలుగు జిల్లాల్లో సాధారణ సమ్మె జరిగింది. ఇది తేయాకు తోటల యజమానుల నిర్దాక్షిణ్య దోపిడీకి వ్యతిరేకంగా కొండలు, మైదానం కలిపి నాలుగున్నర లక్షల తేయాకు కార్మికులు ఐక్యంగా చేసిన సమ్మె అది. దానితో తేయాకు తోటలున్న నాలుగు జిల్లాల కష్టజీవుల, సాధారణ ప్రజల ఐక్యత మమతా బెనర్జీకి తలనొప్పిగా మారింది. ఏ తేయాకు తోటల వలయంలోనైతే అస్తిత్వ రాజకీయాలు బలంగా ఉన్నాయో అక్కడ తేయాకు కార్మికుల మధ్య వర్గ చైతన్యం మరలా పొడసూపటంతో మమతా బెనర్జీనే కాదు, బహుళజాతి తేయాకు కంపెనీలకు ఆందోళన కలిగించే విషయంగా మారింది. అందుకే ఈ ఐక్యతకు విఘాతం కలిగించటానికి సరళమైన బెంగాలీ భాష ఎంచుకోవటం జరిగింది.

డార్జిలింగ్ కొండ ప్రాంత ఆర్థిక వ్యవస్థ పర్యాటన తరువాత తేయాకు తోటలపైనే ఆధారపడి ఉంది. మైదాన ప్రాంతంతో కొండ ప్రాంత తేయాకు కార్మికుల ఐక్య ఉద్యమం ద్వారా కొండ ప్రాంతంలో ప్రజాస్వామ్యం తిరిగి రావాలని బిమల్ గురుంగ్ బృందం కోరుకోదు. బిమల్ గురుంగ్‌కి వ్యతిరేకంగా కూడా ప్రజలు గళం విప్పుతున్నారు. కొన్ని నెలల తరువాత జీటీఏ ఎన్నికలు ఉన్నాయి. ఆ ఎన్నికల్లో ప్రజల అసంతృప్తి ప్రతిఫలించదని గట్టిగా చెప్పలేం. కొండ ప్రాంతంలో ప్రజాస్వామ్య వాతావరణం లేనందునే బహుళజాతి తేయాకు కంపెనీలు కార్మికులను నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేసి అవధుల్లేని లాభాలు గడించటానికి అవకాశం పొందాయి. ఇప్పుడు తేయాకు కార్మికుల ఐక్యబద్ధ ఉద్యమం బహుళజాతి కంపెనీలకు కలవర పడటానికి కారణమయింది. అంటే బహుళజాతి కంపెనీల ప్రయోజనం కొరకు మమతా బెనర్జీ బెంగాలీ భాషనే వాడుకున్నారు. కాని తేయాకు కార్మికులు వారి వలలో పడేలా లేరు. ప్రస్తుతం ఐక్య పోరాటమే వారు బతకటానికి ఏకైక మార్గం. ఈ పోరాటంలో గెలుపు వారిదే.




పట్టు మెరుపులు...

నేటి తరం అమ్మాయిలు సింపుల్‌గా, అందంగా, కంఫర్టబుల్‌గా ఉండే దుస్తులనే ఎంపిక చేసుకుంటున్నారు. సందర్భమేదైనా సరే ఆకర్షణీయంగా, సంప్రదాయంగా కనిపించాలనే ఆరాటపడతారు. సన్న అంచుతో ఉండే సిల్క్‌లంగా, పట్టు జాకెట్ లేటెస్టుగా అమ్మాయిల మనసును దోచేస్తున్నది. పార్టీలకు, అకేషన్లకే కాదు ఆఫీసుకు వేసుకున్నా హుందాగా కనిపిస్తారు. అలాంటి అందమైన సిల్క్ స్కర్ట్స్ ఈ వారం మీ కోసం...

మహిళా సమస్యలకు దారిచూపేలా..

పాఠకులను ఆకట్టుకునే పాత్రలతో.. వాస్తవిక సంఘటనలకు కథారూపమిచ్చిన రచయిత డి. కామేశ్వరి. తెలుగుసాహిత్య లోకానికి సుపరిచితమైన ఆమె మూడువందలకు పైగా కథలు రచించారు. వాటిని 11 కథా సంపుటాలుగా తీసుకు వచ్చారు. 21 నవలలు, 30 కవితలు, ట్రావెలాగ్‌లు రచించి సాహిత్యరంగంలో తనకు ప్రత్యేకస్థానం సాధించుకున్నారు. ఆమె రచించిన నవలలు సినిమాలుగా, టెలీఫిల్ములుగా, టీవీ సీరియళ్లుగా వచ్చాయి. 'కొత్తమలుపు' నవల 'న్యాయం కావాలి' సినిమాగా, 'కోరికలే గుర్రాలైతే' నవల అదే పేరుతో సినిమాగా వచ్చాయి. ఆమె కథలలో, నవలలో మహిళల పాత్రలు ఎంతో సమున్నతంగా ఉంటాయి. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకుని వాటికి తన కథల ద్వారా పరిష్కారం చూపించారు.



డి. కామేశ్వరి(ఆగస్టు 22, 1935)

కాకినాడలో జన్మించిన కామేశ్వరి తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో చదువుకున్నారు. 1952లో డి.వి.నరసింహంతో పెండ్లి అయింది. తరువాత భర్త ఉద్యోగరీత్యా ఒరిస్సా వెళ్లారు. ఆంధ్రపత్రికలో తొలిసారి రచయితగా ఆమె పరిచయం అయ్యారు. 1962లో 'వనితలు వస్త్రాలు' అనే వ్యాసం ఆంధ్రపత్రికలో ప్రచురించబడింది. ఈ వ్యాసంతోనే ఆమె తన రచనావ్యాసంగం ప్రారంభించారు.

Women of the day

ఆమె రాసిన తొలికథ 'ఆనందరావు – ఆకాకరకాయలు' కూడా ఆంధ్రపత్రికలోనే ప్రచురించబడింది. కథలు, కవితలతో పాఠకులను అలరిస్తూనే 1968లో నవలలు రాయడం ప్రారంభించారు. ఆమె రాసిన మొదటి నవల 'కొత్తనీరు'. ఆమె రాసిన ఎన్నో కథలు, నవలలు హిందీ, కన్నడ, తమిళభాషలలో అనువాదించబడ్డాయి. వివిధ పత్రికలు, సంస్థలు నిర్వహించే అనేక కథల, నవలల పోటీల్లో ఆమె కథలకు, నవలలకు బహుమతులు వచ్చాయి.

అవార్డులు..

ప్రముఖ సాహిత్య సంస్థల నుంచి ఎన్నో అవార్డులను కామేశ్వరి అందుకున్నారు. గృహలక్ష్మి స్వర్ణకంకణం, సుశీల నారాయణ రెడ్డి అవార్డు, గోపిచంద్ అవార్డు, మాలతీచందూర్ అవార్డు, హ్యూస్టన్ వంగూరి లైఫ్‌టైమ్ అవార్డులతో పాటు తెలుగు యూనివర్సిటీ నుంచి మూడుసార్లు పురస్కారాలను అందుకున్నారామె. ❄

ముడతలు మాయం...

చర్మం ముడతలు పడుతోందా? ఖరీదైన క్రీమ్‌లు, లేజర్ ట్రీట్‌మెంట్లు అవసరం లేదు. సమస్య మొదట్లో ఉంటే గనుక ఈ పూతలు ప్రయత్నించి చూడండి. వీటితో ఆ సమస్య అదుపులో ఉండటంతోపాటూ చర్మం కూడా తాజాగా మారుతుంది.

- గుడ్డు తెల్లసొనలో కొద్దిగా నిమ్మరసం, చెంచా తేనె కలపాలి. దీన్ని ముఖం, మెడకు పూతలా పట్టించి, ఇరవై నిమిషాల తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేయాలి. గుడ్డులోని ప్రొటీన్లు చర్మం బిగుతుగా మారేలా చేస్తే.. నిమ్మరసం కొలాజిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. ఇక తేనె చర్మానికి తేమనందిస్తుంది. మొత్తంగా ముఖం ఆరోగ్యంగా కనిపిస్తుంది. దీన్ని రెండురోజులకోసారి వేసుకోవచ్చు.
- ఎనిమిది బాదం గింజలు తీసుకుని ముందురోజు రాత్రే నానబెట్టుకోవాలి. మర్నాడు పచ్చిపాలు పోసుకుంటూ మెత్తని ముద్దలా చేసుకోవాలి. దీన్ని ముఖానికి పూతలా వేసి అరగంట తరవాత చల్లని నీళ్లతో కడిగేయాలి. ఇలా వారంలో రెండుమూడుసార్లు చేస్తుంటే ముడతలు పెరగకుండా ఉంటాయి. బాదంలో 'విటమిన్ ఈ' తోపాటూ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ పోషకాలు చర్మాన్ని బిగుతుగా మారుస్తాయి. ఇక, పచ్చిపాలు చర్మానికి తేమనందిస్తాయి. నల్లమచ్చలున్నా తగ్గుతాయి.
- బాగా మగ్గిన అరటిపండును తీసుకుని గుజ్జులా చేసుకోవాలి. అందులో పెద్ద చెంచా పెరుగూ, కొద్దిగా తేనె వేసుకుని కలపాలి. దీన్ని కొద్దిగా వేడిచేసి ఆ తరవాత ముఖం, మెడకూ పూతలా వేసుకోవాలి. ఇరవై నిమిషాల తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేయాలి. అరటిపండులో ఉండే పోషకాలు కొలాజిన్ ఉత్పత్తికి తోడ్పడతాయి. అలాగే ముడతల్నీ నివారిస్తాయి. తేనె, పెరుగు చర్మానికి తేమతోపాటూ తాజాదనాన్ని అందిస్తాయి. ❄



బ్రేక్‌ఫాస్ట్‌తో భేషుగ్గా...



మీ నడుము చుట్టూ ఉన్న కొవ్వు ని కరిగించాలనుకుంటున్నారా? అయితే మీరు ఉదయమే తీసుకునే ఆహారం పెంచాలి. ఉదయంపూట... మిగతా రోజులో తీసుకునే ఆహారం కంటే ఎక్కువగా తీసుకోగలిగితే మీ శరీర బరువుని తగ్గించుకోవచ్చు అంటున్నారు పరిశోధకులు. ఒక అధ్యయనం ప్రకారం మూడు సార్లు కంటే ఎక్కువగా ఆహారం తీసుకునేవారు, రాత్రిపూట భోజనం అధికంగా తీసుకునేవాళ్లలో అధిక బరువును గుర్తించారు.

బరువు నియంత్రించాలంటే... పొదున్నే అల్పాహారం తీసుకోవాలి. మధ్యాహ్నం భోజనం కూడా మంచిగా చేయాలి. రాత్రిపూట భోజనం చేయకుండా పండ్లు తిన్నా సరిపోతుంది. చిరు తిండ్లకు దూరంగా ఉండటం ప్రధానం. రాత్రిపూట భోజనం చేయకుండా 18 గంటల పాటు ఉపవాసం ఉండటం అనే ఈ చర్య బరువు నిర్వహణ వ్యూహంలో ఒక భాగం అని చెబుతున్నారు కాలిఫోర్నియా లోని ఒక విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు.

ఈ అధ్యయనంలో పాల్గొన్న వ్యక్తుల భోజనం తీసుకునే క్రమం ఎలా ఉన్నా, సగటున వారి యొక్క వయస్సు 60 సంవత్సరాలు చేరే వరకు ప్రతి సంవత్సరం వారి బరువు పెరుగుతూనే ఉంది. 60 యేళ్ల దాటిన తర్వాత వాళ్ళ బరువు సంవత్సర సంవత్సరానికి తగ్గిపోతోంది అని గుర్తించారు. 60 యేళ్ళ కంటే తక్కువ వయస్సు ఉన్న వ్యక్తులు ఉదయమే తీసుకునే ఆహారం వల్ల బరువు పెరిగే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని గుర్తించారు. కాబట్టి ఉదయమే బ్రేక్‌ఫాస్ట్‌ను అస్సలు మిస్ చేయకండి! ❄

ఇట్ల చేద్దాం

పప్పు, పాలు.. ఏదైనా ఉడికించేటప్పుడు పొంగకుండా ఉండాలంటే... చెక్క గరిటను వండే పాత్రపై అడ్డంగా పెట్టాలి.



పరిమితికి మించి వాడేస్తే...

- సరైన దిండు లేకపోతే మంచి నిద్రను కోల్పోతారు. కొన్ని సార్లు మెడ నొప్పులు కూడా వస్తాయి, కాబట్టి దిండుని ప్రతి రెండు సంవత్సరాలకి మార్చాలి.
- ఇంట్లో లేదా ఇంటి వద్ద ధరించే చెప్పులకు అధికం శాతంలో బ్యాక్టీరియా ఉంటుంది. కాబట్టి, వీటిని రెగ్యులర్ గా వాష్ చేసినా సరే ప్రతి ఆరు నెలలకి వీటిని మార్చాలి.
- తడిగా ఉన్న టవల్స్ మీద బ్యాక్టీరియా త్వరగా చేరుతుంది. కాబట్టి, టవల్స్ ను వీలైనంత త్వరగా ఆరబెట్టాలి. అలాగే ఒక టవల్ ని సంవత్సరం కన్నా ఎక్కువ వాడకూడదు.
- మనం రోజూ వాడే టూత్‌బ్రష్‌లు కనీసం మూడు నెలకొకసారి మార్చాలని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు .
- లోదుస్తులు సంవత్సరానికొకసారైనా మార్చాల్సిందే..
- రెగ్యులర్‌గా వాడే జాగింగ్ షూస్‌ని ఒక సంవత్సరం కన్నా ఎక్కువ వాడకూడదు. వాటిలో ఉన్న కుషనింగ్ తగ్గిపోచ,, తుంది. కాబట్టి, జాయింట్ పెయిన్స్ వస్తాయి.
- హ్యాండ్ సానిటైజర్ బాటిల్ ను ఒకసారి తెరిచిన తర్వాత మూడు నెలలకన్నా ఎక్కువ పనిచేయదు. దాని పవర్ తగ్గిపోతుంది.
- పెర్‌ఫ్యూమ్ బాటిల్స్ ఓపెన్ చేసిన తర్వాత కేవలం ఒకటి లేదా రెండు సంవత్సరాలు మాత్రమే పనిచేస్తాయి. ❄

పాఠాలు చెప్పేందుకు పాలమ్ముతూ...

జీవితం అంటే సుఖాలు, సంతోషాలు ఉంటాయి. కష్టాలు, కన్నీళ్లు ఉంటాయి. కొందరికి కొన్ని ముందుగానే ఎదురవుతాయి. కొందరికి అసలు ఎదురు కావు. కొందరైతే ఎప్పుడూ కష్టాల సుడిగుండంలోనే ఉంటారు. అయినా వారిలో చాలా తక్కువ మంది మాత్రమే కష్టాలను ఎదుర్కొని ముందుకు సాగుతారు. ఇప్పుడు మేం చెప్పబోయే యువతి కూడా సరిగ్గా ఇదే కోవకు చెందుతుంది. రోజూ కష్టాలతో సావాసం చేస్తూనే తను అనుకున్న లక్ష్యం దిశగా విజయవంతంగా ముందుకు సాగుతోంది.

ఆ యువతి పేరు నీతు శర్మ. వయస్సు 19 సంవత్సరాలు. నీతుది పేద కుటుంబం. ఐదుగురు అక్కాచెల్లెళ్లు. ఆరోవాడు తమ్ముడు. తండ్రి సంపాదించే అరకొర డబ్బుతోనే వారు సంసారం నెట్టుకొచ్చేవారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి వారిది. ఇక ఆమె చదువెలా సాగుతుంది. అందుకే ఆమె 8వ తరగతిలో ఉండగా తండ్రి చెప్పాడు, చదువు మానేయమని. దీంతో నీతు షాక్‌కు గురైంది. ఎట్టి పరిస్థితిలోనూ చదువుకోవాల్సిందేనని, చదువంటే తనకు ఎంతో ఇష్టమని, దయ చేసి చదువు మాన్పించవద్దని తండ్రిని వేడుకుంది. అయినా అతను ఏం చేస్తాడు, అసలే పూట పూటకు కష్టపడాల్సిన పరిస్థితి వారిది. దీంతో తండ్రి బాధను ఆమె అర్థం చేసుకుంది. తన చదువు భారాన్ని తండ్రిపై పెట్టవద్దని, తన చదువుకయ్యే డబ్బును తానే సంపాదించాలనుకుంది. అలాగే ముందుకు సాగింది.

తాను ఉంటున్న ఇంటికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇండ్లకు రోజూ నీతు పాలను సరఫరా చేసే పని వెదుక్కుంది. నిత్యం ఉదయాన్నే వేకువ జామున 4 గంటలకు లేవడం, పాలను తీసుకెళ్లి కాలి నడకన 5 కిలోమీటర్ల వరకు నడిచి పాలను పోయడం, వెనక్కి వచ్చి తయారై స్కూల్‌కు వెళ్లడం. ఇదీ ఆమె దిన చర్య. అలా ఆమె తాను సంపాదించే డబ్బుతోనే చదువుకోడం మొదలు పెట్టింది. 10వ తరగతి, ఇంటర్ పూర్తి చేసింది. సిటీలో పాలు పోశాక....



వింతగా చూశారు...

"అనుకోవాలే కానీ అమ్మాయిలు చేయలేనిదంటూ ఏమీ లేదు. నేను మొదట బండి నడపటడం మొదలుపెట్టినప్పుడు ఊర్లో అందరూ నన్ను వింతగా చూసేవారు. మా నాన్నే అందుకు అంగీకరించలేదు. 'అమ్మాయిలు అలా రోడ్ల మీద తిరగకూడదు' అనేవాడు. కానీ నేను మానేయలేదు. రాధ, సుష్మక్కల పెండ్లి అయ్యేంతవరకూ నేను ఆపేది లేదని కచ్చితంగా చెప్పేశాను. టీచర్ అవ్వడమే నా లక్ష్యం" అని చెబుతున్న నీతు ఈ తరం అమ్మాయిలకు ఆదర్శం.

బంధువుల ఇంటికి వెళ్లి అక్కడ బండి పార్క్ చేసి బట్టలు మార్చుకుని... రెండుగంటల పాటు కంప్యూటర్ క్లాసులకు వెళ్లేది. ఆ సమయంలో అక్క సుష్మ బంధువుల ఇంటిలోనే ఉండేది. నీతు క్లాసునుంచి తిరిగి వచ్చాక ఇద్దరూ కలిసి ఒంటిగంటకల్లా ఇంటికి చేరుకునేవారు. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు ఇద్దరు కలిసి సిటీకి పాలు తీసుకెళ్లి... రాత్రి ఏడున్నర గంటలకు తిరిగి ఇంటకి వస్తారు. నీతు అక్క సుష్మ సంస్కృతంలో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఊర్లోనే గ్రాసరీ స్టోర్ ఏర్పాటు చేసింది. అందులో నీతు మూడవ అక్క రాధ కూర్చుంటుంది. నాలుగో అక్క సుష్మ మాత్రం నీతుకు సహాయంగా పనిచేస్తోంది. ఇద్దరు అక్కాచెల్లెళ్లు కలిసి రోజుకు 90 లీటర్ల పాలు అమ్ముతారు. అన్ని ఖర్చులూ పోను నెలకు రూ.12వేల వరకు సంపాదిస్తున్నారు. ప్రస్తుతం బీఏ సెకండియర్ చదువుతోంది నీతు. బీఏ పూర్తయితే ఉద్యోగంలో చేరి తన కాళ్లపై తాను నిలబడతానని అంటోంది నీతు. ❄



ఎగువ ప్రాంతాల్లోని వర్షాలకు గోదావరి ఉరకలేస్తోంది. ధవళేశ్వరం బ్యారేజి వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో బ్యారేజికి చెందిన 175 గేట్లను 0.50 మీటర్ల మేర ఎత్తి, మూడు లక్షల క్యూసెకుల చొప్పున నీటిని సముద్రంలోకి వదులుతున్నారు.

భూ కబ్జాదారులను తరిమేయండి

- పేదలకు అండగా ఉంటాం: అక్కెంగుండ్ల కబ్జాభూముల పరిశీలనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మధు



కడప జిల్లా సావిశెట్టిపల్లె సభలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు

కాశినాయన: భూ కబ్జాదారులను తరిమేయాలని, భూమిలేని పేదలు ఆ ఆక్రమిత భూములను సాగు చేసుకోవాలని, అందుకు సిపిఎం అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు పేదలకు భరోసా ఇచ్చారు. సోమవారం కడప జిల్లా కాశినాయన అక్కెంగుండ్లలో ఘరానా వ్యక్తులు ఆక్రమించిన భూములను పరిశీలించారు. పేదలు, దళితులతో మాట్లాడి వివరాలను సేకరించారు. అనంతరం సావిశెట్టిపల్లెలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. భూమిని సాగుచేసుకొంటూ ఉద్యమం చేస్తుంటే సీపీఐ(ఎం) వెన్నంటి ఉంటుందని, భూమికి పట్టాలు సాధిద్దామని పేదలకు భరోసా ఇచ్చారు. బయటవారు వచ్చి ఇక్కడ బినామీ పట్టాలు పొంది భూములు దున్నుతుంటే రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన భూ కబ్జాదారులైన కొందరు ఘరానా వ్యక్తులకు వందలాది ఎకరాలను ప్రభుత్వం ఏ పద్దతిన, ఏ ప్రాతిపదికన కట్టబెట్టిందో పూర్తి స్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. దొంగ పట్టాలు ఇవ్వడంలో ఈ ప్రాంతంలోని కొంత మంది స్వార్థ రాజకీయ నాయకుల మద్దతు రెవెన్యూ అధికారులకు ఉందని, అందువల్లే వీరు భూ కబ్జాదారులకు బినామీ పట్టాలిచ్చారని విమర్శించారు. భూమి లేని పేదలందరూ ఐక్యమత్యంతో భూ కబ్జాదారుల చేతిలోని ప్రభుత్వ భూమిని దుక్కి దున్ని సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మన్యంలో జ్వరాలు

తాంగులగుడలో మంచం పట్టిన 24 మంది గిరిజనులు

అరకు: విశాఖ జిల్లా అరకు మండలంలోని సిఎం చంద్రబాబు దత్తత పంచాయతీ పరిధిలోని పెదలబుడు తాంగులగుడ గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ గ్రామంలో జ్వరాలతో 24 మంది మంచం పట్టారు. ఒకే కుటుంబానికి చెందిన బురిడి జిన్ను (28), బురిడి సద్దు (60), పొర్తిమ (30), లక్ష్మి (8), కృష్ణ (5), సుశీల (4) జ్వరాలతో బాధపడుతున్నారు. అలాగే తాంగుల మొద్దు (60), రొయిల (57), సహదేవ్ (25), జమున (50), మొత్తి (30), లింగ (59), సుమిత్ర (28), దాలిమ్మ, మొత్తి, కిల్లో చంద్రమ్మ, తాంగుల భారతి, పరమేశ్వరి, టి.పద్మ, బురిడి సుశాంత్, లలిత, తాంగుల జానకి, పాంగి లక్ష్మి, గుత్తి తదితరులు కూడా వారం రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. ఈ గ్రామంలో కుళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ బురద నీరు వస్తోంది. ఆ నీరు తాగలేక ఊట గెడ్డ నీటిని తెచ్చుకొని తాగుతున్నారు. దీనికి తోడు డ్రెయినేజీలు లేవు. మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంటుంది. దీంతో స్థానికులు జ్వరాల బారిన పడ్డారు.



జ్వరాలతో బాధపడుతున్న ఒకే కుటుంబానికి చెందిన గిరిజనులు

వారం రోజులుగా గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నా వైద్య సిబ్బంది గ్రామాన్ని సందర్శించలేదు. రోగులు కూడా వైద్యసేవల నిమిత్తం ఆస్పత్రికి పోలేదు. తక్షణమే అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి టి.హరి డిమాండ్ చేశారు.

ప్రచార పర్వం ముగిసింది

- నంద్యాలలో చివరి ప్రయత్నాల జోరు
- రేపే పోలింగ్

నంద్యాల: నంద్యాలలో ప్రచార పర్వం ముగిసింది. హోరెత్తించిన మైకులు మూగబోయాయి. నేతల హడావిడి తగ్గింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బయట ప్రాంతాల నుండి వచ్చిన నేతలు నంద్యాల వీడారు. 13 రోజుల పాటు నంద్యాలలోనే మకాం వేసి విస్తృతంగా ప్రచారం చేసిన వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సోమవారం సాయంత్రం గాంధీ చౌక్‌లో నిర్వహించిన చివరి ప్రచార సభలో పాల్గొని నంద్యాల నుండి హైదరా బాద్‌కు బయలుదేరారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుండి నంద్యాలలోనే బసచేసిన పలువురు అధికార పార్టీ నేతలు, డజనుమందికిపైగా రాష్ట్ర మంత్రులు కూడా సొంత జిల్లాలకు ప్రయాణమైనారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆదివారం నాడే ప్రచారాన్ని ముగించిన విషయం తెలిసిందే. అయితే, టీడీపీ నేతలు కర్నూలు జిల్లాను విడిచి వెళ్లలేదని వైసీపీ ఆరోపించింది. ప్రచార సమయం ముగిసిన తరు వాత కూడా భూమా అఖిలప్రియ ఓట్లు అభ్యర్థించారని పేర్కొంది. ఈ విషయాలను ఆ పార్టీ ఎన్నికల సంఘం దృష్టికి తీసుకుపోయినట్లు సమాచారం. ప్రచార పర్వం ముగియడంతో రెండు పార్టీల నేతలు చివరి ప్రయత్నాల్లో మునిగిపోయారు. అధికారికంగా ప్రచారం ముగిసినప్పటికీ అనధికారికంగా నియోజకవర్గం అంతా కొనసాగుతూనే ఉంది. ౦ండు పార్టీలకు చెందిన స్థానిక నేతలు, కార్యకర్తలు ఓటర్లను కలుసుకుంటున్నారు. పోటాపోటీగా నగదు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెండు పార్టీలు ప్రత్యర్థి పార్టీ శ్రేణుల కదలికలపై పెద్ద ఎత్తున నిఘా ఉంచాయి. కొందరు కార్య కర్తలను ఈ పనిమీదే ఉంచాయి. దీంతో నియోజక వర్గమంతా ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

బరిలో 15మంది

భూమా నాగిరెడ్డి మృతితో ఖాళీ అయిన నంద్యాల అసెంబ్లీ నియోజికవర్గం పరిధిలో మొత్తం 15మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అధికార పార్టీ తెలుగుదేశం నుంచి భూమా బ్రహ్మానందారెడ్డి పోటీలో ఉన్నారు. ప్రతిపక్ష వైకాపానుంచి శిల్పా మోహన్‌రెడ్డి బరిలో ఉన్నారు. వీరిద్దరు మధ్య నువ్వానేనా అన్న రీతిలో పోటీ జరుగుతున్నా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం అబ్దుల్‌ఖాదర్ కూడా పెద్ద ఎత్తున నంద్యాలలో ప్రచారాన్ని నిర్వహించడంతో కాంగ్రెస్ అభ్యర్థి పోల్ అయ్యే ఓట్లు ఎవ్వరికి నష్టం చేకూరుస్తాయనేది చర్చానీయాంశంగా మారింది

ఉదయం ఏడు గంటల నుండే పోలింగ్

ఉప ఎన్నికల పోలింగ్ ఉదయం ఏడు గంటలనుంచి సాయంత్రం ఆరుగంటల వరకు జరిగేలా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.సత్యనారాయణ వెల్లడించారు.

'నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు'



హైదరాబాద్ : నంద్యాల ఉప ఎన్నికను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని మొత్తం 16 తెలుగు న్యూస్ ఛానళ్లపై నిఘా ఉంచామని చెప్పారు. ఎన్నికల్ని ప్రభావితం చేసే విధంగా కానీ, ఓటర్లను ప్రలోభపెట్టే విధంగాకానీ ఎలాంటి ప్రీ-పోల్ సర్వేలను ప్రసారం చేయకూడదని అన్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రసాద్ మృతి



హైదరాబాద్ : రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, టీటీడీ మాజీ ఇఒ ప్రత్తి వెంకట రామకృష్ణ ప్రసాద్ (77) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. గుండెపోటు రావడంతో శనివారం రాత్రి ఆయనను కేర్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు ఎంత ప్రయత్నించినా, ఫలితం లేక సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. పంచాగం ప్రకారం సోమవారం, క్యాలెండర్ ప్రకారం మంగళవారం ఆయన 78వ పుట్టినరోజు కావడం గమనార్హం. ఆయనకు భార్య గోపిక, కుమారుడు సంజయ్, కూతురు మాధవి ఉన్నారు. 1941 ఆగస్టు 22న గుంటూరు జిల్లా సిరిపురంలో జన్మించారు. తొలుత ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. విశాఖ పోర్ట్ ఛైర్మన్‌గా కూడా వ్యవహరించారు. 1978-82 మధ్య టీటీడీ ఇఒగా బాధ్యతలు నిర్వహించారు. పివి నర్సింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో సలహాదారుగా పని చేశారు. మానవ వనరుల సంస్థ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహించారు. పదవీ విరమణ అనంతరం 'అసలేం జరిగింది' అనే పుస్తకం రాశారు. ప్రసాద్ అంత్యక్రియలు హైదరాబాద్‌లోని పంజాగుట్ట శ్మశానవాటికలో సోమవారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సలహాదారు పరకాల ప్రభాకర్ శ్మశానవాటికకు వచ్చి నివాళులర్పించారు. ప్రసాద్ మృతి పట్ల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, తెలంగాణ సీఎం కెసీఆర్, వైసీపీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు.

విశ్రాంత ఐఎఎస్ అధికారి ప్రసాద్ మృతి పట్ల రఘువీరారెడ్డి సంతాపం

విశ్రాంత ఐఎఎస్ అధికారి పివిఆర్‌కె ప్రసాద్ మృతిపట్ల పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ మేరకు పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పివిఆర్‌కె ప్రసాద్ మృతిపట్ల మరో ప్రకటనలో కాంగ్రెస్ నాయకుడు మదాస్ గంగాధర్, సూర్యనాయక్ సంతాపం తెలిపారు.

పారిశుధ్య కార్మిక కుటుంబాలను ఖాళీ చేయించే యత్నాలు విరమించాలి

- ప్రభుత్వానికి చిరంజీవి లేఖ

అమరావతి : తిరుపతి నగరం 18వ వార్డులోని పారిశుధ్య కార్మికుల కుటుంబాలను ఖాళీ చేయించాలనే ప్రభుత్వ ప్రయత్నాలు విరమించుకోవాలని రాజ్యసభ ఎంపీ, ప్రముఖ సినీనటుడు చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. అక్కడ 70 ఏండ్లు గా నివాసముంటున్న ప్రజల్ని ఖాళీ చేయించటం సరికాదని ఆయన పేర్కొన్నారు. తిరుపతి నగరం మధ్యలో ఈ కాలనీ ఉండటం ప్రభుత్వం సహించలేక పోతోందా అని లేఖలో ప్రశ్నించారు. ఇది పూర్తిగా వివక్ష పూరితమని, ప్రజలందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబుతున్నా, దానికి విరుద్ధంగా ప్రభుత్వం బల ప్రయోగంతో బలహీనులైన పారిశుధ్య కార్మిక కుటుంబాలను, యానాది కుటుంబాలను తరలించాలని చూడటం గర్హనీయమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, తిరుపతి కార్పొరేషన్ తమ ప్రయత్నాలను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానికులను ఖాళీ చేయించి ప్రైవేటు వ్యక్తులకు ఆ స్థలాన్ని అప్పగించడానికి తిరుపతి కార్పొరేషన్ చేస్తున్న ప్రయత్నాలు అమానవీయమని వ్యాఖ్యానించారు. తాను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని ఆయన ఈ లేఖలో పేర్కొన్నారు. పారిశుధ్య కాలనీని రోల్ మోడల్ కాలనీగా అభివృద్ధి పరచి అక్కడి కుటుంబాల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించాలని ఆయన కోరారు. నిరుపేదలైన ఆ కుటుంబాల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని కవల చిన్నారులు మృతి

నవతెలంగాణ-కామారెడ్డి రూరల్

అప్పుడప్పుడే బుడిబుడి అడుగులేస్తున్న ఇద్దరు కవలలను మృత్యువు రైలు రూపంలో కబలించింది. ఈ ఘటన సోమవారం కామారెడ్డి జిల్లా నర్సన్నపల్లి గ్రామంలో తీరని విషాదాన్ని నింపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సందని చంద్రం, భాను దంపతులు వ్యవసాయ కూలీలు. ఇల్లు రైలు పట్టాలకు దగ్గరలో ఉంది. వారికి కవల పిల్లలు విఘ్నేష్(3), విద్వేష్(3). సోమవారం చంద్రం వ్యవసాయ పనికి వెళ్లగా.. తల్లి భాను ఇంటి పనుల్లో మునిగిపోయింది. సాయంత్రం చిన్నారులిద్దరూ తమ కొట్టంలో ఆడుకుంటూ రైల్వే పట్టాలపైకి పోయారు. అదే సమయంలో సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ పిల్లలను ఢీకొట్టింది. అప్పటివరకూ ఆడుతూ కన్పించిన చిన్నారులు.. క్షణాల్లో మాంసం ముద్దల్లా మారడంతో గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. చిన్నారులు రైలు పట్టాలపైకి పోవడాన్ని దూరం నుంచి గమనించిన స్థానికులు పరుగున అక్కడకెళ్లేసరికే క్షణాల్లో ప్రమాదం జరిగిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పిల్లల మతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. ఇద్దరు పిల్లలను పోగొట్టుకున్న తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల శిక్షణను ఒకేసారి ప్రారంభించండి : శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు శిక్షణను ఒకేసారి ప్రారంభించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీహెచ్ లక్ష్మారెడ్డిని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల జేఏసీ నాయకులతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ శిక్షణకు సామగ్రిని సమకూర్చిన తర్వాత రాష్ట్ర మంతా ఒకేసారి ప్రారంభించాలని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత వారికి సర్టిఫికెట్, గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారు. గ్రామీణ వైద్యులకు నిర్ణయించిన నిబంధనలను పున:సమీక్షించి సడలించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ వ్యవస్థ మొత్తాన్ని అదే దృష్టితో చూడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ జేఏసీ నాయకులు రౌతు కనకయ్య, జూపల్లి రాజేందర్, వెంకట్‌రెడ్డి, అశోక్, బాల బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

కోడ్‌ఆఫ్ డిసిప్లైన్ మార్చకుండా సింగరేణిలో ఎన్నికలా..? : జీఎల్‌బీకేఎస్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సింగరేణిలో కోడ్ ఆఫ్ డిసిప్లైన్ మార్చకుండా ఎన్నికలు నిర్వహించడం అప్రజాస్వామికమని గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం(జీఎల్‌బీకేఎస్) విమర్శించింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్రఅధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకటేశ్వరరావు, ఐ కృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల కాలంలోనే కోడ్ ఆఫ్ డిసిప్లైన్‌పై ఐదుసార్లు సమావేశాలు జరిగాయని, దీన్ని మార్చాలని ఒకటి,రెండు సంఘాలు మినహా అన్ని సంఘాలూ అభిప్రాయపడ్డాయని గుర్తుచేశారు. ఎన్నికల కాలపరిమితి రెండేండ్లు ఉండాలనీ, అన్ని సంఘాలకూ గేట్‌మీ టింగ్‌లు పెట్టుకునే హక్కు, కరపత్రాలు పంచుకునే హక్కు, సభ్యత్వం చేయించే హక్కు కలిగి ఉండాలని రాతపూర్వకంగా తెలియజేసినట్టు చెప్పారు. అయినా అదేదీ పట్టించుకోకుండా యాజమాన్యం ఎన్నికల తేదీని ప్రకటించడం సరికాదని తెలిపారు. కార్మికులకు 30శాతం తగ్గకుండా బోనస్ ప్రకటించాలని కోరారు.

జాతీయ అల్పసంఖ్యాక వర్గాల విద్యా పర్యవేక్షక కమిటీ సభ్యులుగా రాంనేని

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రుద్రారం గ్రామానికి చెందిన రాంనేని శ్రీకాంత్ జాతీయ అల్పసంఖ్యాక వర్గాల విద్యా పర్యవేక్షక కమిటీ సభ్యులుగా నియమించబడ్డారు. ఈ మేరకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఛైర్మెన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో నాలుగు రాష్ట్రాల విద్యా శాఖ మంత్రులు, నాలుగు రాష్ట్రాల విద్యా కార్యదర్శులు, లోకసభ, రాజ్యసభ ఛైర్మెన్లు నామినేట్ చేసే వ్యక్తులు, తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ పదవి కాలం మూడేండ్ల పాటు కొనసాగుతుందని, మైనారిటీ విద్యా సంస్థల లక్ష్యాలు సరిగ్గా అమలయ్యే విధంగా, నిజమైన మైనారిటీలకే అభివృద్ధి ఫలాలు అందే విధంగా చూస్తానని ఈ సందర్భంగా రాంనేని శ్రీకాంత్ తెలిపారు.

అప్పు చెల్లించాలని రైతులకు బ్యాంకు నోటీసులు

- రుణమాఫీ కాలేదంటున్న అధికారులు
- బ్యాంకు ఎదుట రైతుల నిరసన
- లోపాలను సవరించి ప్రభుత్వానికి నివేదిక : కలెక్టర్

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ కాలేదు.. అప్పు కట్టాలంటూ బ్యాంకు అధికారులు నోటీసులు పంపడంతో రైతులు బ్యాంకు ఎదుట ఆందోళన చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం అక్కారం, తిగుల్ గ్రామ రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని అధికారులు నోటీసులు పంపారు. దాంతో సోమవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఏపీజీవీబీ బ్యాంకు ఎదుట సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ ఆధ్వర్యంలో 150 మంది రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల నోట్లో మట్టి కొట్టిందన్నారు. అక్కారం గ్రామం, జగదేవపూర్ మండలం తీగుల్‌లో 570 మంది రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. అయితే, గతంలో ప్రజ్ఞాపూర్ ఏపీజీవీబీ బ్యాంకులో రుణమాఫీ అయిందని, రైతులకు మళ్లీ రుణాలిచ్చారని తెలిపారు. కానీ, రెండు రోజుల కిందట రుణమాఫీ కాలేదని, ఇరు గ్రామాల రైతులకు బ్యాంకు అధికారులు నోటీసులు పంపడంతో ఆందోళన చెందుతున్నారని చెప్పారు. రైతులకు 15 రోజుల్లో రుణమాఫీ చేయకుంటే ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. రైతుల ఆందోళన విషయాన్ని తెలుసుకుని జిల్లా వ్యవసాయాధికారి శ్రావణ్ కుమార్, ఎస్ఐలు కమలాకర్, ప్రసాద్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. 15 రోజుల్లో రుణమాఫీ జరిగే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వ్యవసాయాధికారి హామీనిచ్చారు. అనంతరం గజ్వేల్ ఆర్డీఓ కార్యాలయానికి కలెక్టర్ వెంకట్‌రామిరెడ్డి వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లి ఆయనను కలిసి తమ సమస్యను విన్నవించారు. రుణమాఫీ చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ.. ఆన్‌లైన్‌లో ఉన్న లోపాలు, అవకతవకలను పరిశీలించి పదిరోజుల్లో రుణమాఫీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు జంగం నాగరాజు, సీపీఐ నాయకులు బట్టు దయానంద్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు వంటేరు ప్రతాప్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంక్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

సాదాబైనామాకు ఏడాది

- కొలిక్కిరాని క్రమబద్ధీకరణ ప్రక్రియ
- సమీక్షలతోనే సరి..ఆందోళనలో దరఖాస్తుదారులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడలానే ఉంది. ఒక అడుగు ముందుకు..రెండడుగులు వెనక్కు అన్న చందంగా తయారైంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం, క్షేత్రస్థాయి అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సమీక్షలతోనే సరిపెడుతున్నది. ఏకంగా ముఖ్యమంత్రే పదే పదే చెబుతున్నా, ఈ ప్రక్రియ కొలిక్కి రావడం లేదు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు సైతం చురుగ్గా కదలడం లేదు. శాశ్వత ప్రధాన భూపరిపాలన కమిషనర్ (సీసీఎల్ఏ) లేకపోవడం సమస్య పెండింగ్‌లో ఉండటానికి ప్రధాన కారణం. గ్రామీణ ప్రాంతాల్లో తెల్లకాగితాలపై వ్యవసాయ భూముల కొనుగోలు ఒప్పందం(సాదాబైనామా)లను క్రమ బద్ధీకరించేందుకు ప్రభుత్వం గత ఏడాది జూన్ మూడున ప్రత్యేకంగా ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావించిన రైతులు అనూహ్యంగా స్పందించారు. లక్షల్లో దరఖాస్తులు పెట్టుకున్నారు. సాదాబైనామాల క్రమబద్ధీకరణ నిమిత్తం అన్ని జిల్లాల నుంచి దాదాపు 11 లక్షలకుపైగా దరఖాస్తులు రెవెన్యూ శాఖకు అందాయి. వరంగల్ జిల్లాలో అత్యధికంగా 3.03 లక్షల దరఖాస్తులు రాగా, అత్యల్పంగా హైదరాబాద్‌లో 12 మాత్రమే వచ్చాయి. కరీంనగర్‌లో 2.47 లక్షలు, ఖమ్మంలో 2.17 లక్షలు, నల్లగొండలో 1.34 లక్షలు వచ్చాయి. అయితే, సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా, అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఈ ప్రక్రియ ఇంతవరకూ కొలిక్కి రాలేదు. దాదాపు 14 నెలలుగా దరఖాస్తులు పరిష్కారం కాకుండా పెండింగ్‌లోనే ఉన్నాయి. లక్షలాది దరఖాస్తులు రెవెన్యూ శాఖలో మూలుగుతున్నా, ఇంతవరకూ ఒక్క దరఖాస్తును కూడా క్రమబద్ధీకరించిన దాఖలాల్లేవు. హరితహారం, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు తదితర పనులతోపాటు పలు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించిన నేపథ్యంలో సాదాబైనామాలను పట్టించుకునే తీరికలేదని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇక తహసీల్దార్లను కదిలిస్తే క్రమబద్ధీకరణ కోసం ప్రధాన భూపరిపాలన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం అధికారులు రూపొందించిన సాఫ్ట్‌వేర్ లోపభూయిష్టంగా ఉందని, సాంకేతిక సమస్యలే తాజా క్రమబద్ధీకరణలో జాప్యానికి కారణమని అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయిలో ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించాల్సిన ఉన్నతాధికారులు, ఆ పనిచేయకుండా కేవలం కిందిస్థాయి అధికారులకు లక్ష్యాలను నిర్దేశించి తమ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. ఒకవేళ నోటీసులిచ్చి విచారణ పూర్తిచేశాక ప్రొసీడింగ్స్ జారీకి కావాల్సిన సాఫ్ట్‌వేర్‌ను సీసీఎల్ఏ అధికారులు ఇప్పటికీ అందుబాటులోకి తేలేదని తహసీల్దార్లు చెబుతున్నారు. ఆయా స్థాయిల్లో అధికారులు ఒకరిపై మరోకరు ఆరోపణలు, విమర్శలు చేసుకుంటున్నారు. చివరికి ఇటు ప్రభుత్వం, అటు దరఖాస్తుదారులు ఆశించిన ప్రయోజనం ఏ మాత్రం నెరవేరని పరిస్థితి నెలకొంది. సాదాబైనామాల క్రమబద్ధీకరణ ద్వారా తమ భూములపై పూర్తిహక్కులు సంక్రమిస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతున్నది. దీంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. సీసీఎల్ఏగా రేమండ్ పీటర్ ఉన్నప్పుడు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ తరువాత మరో శాశ్వత అధికారి రాకపోవడం, ఇన్‌చార్జిల పరిపాలన సాగుతుండటంతో సమస్య కొలిక్కి రావడం లేదు. కిందిస్థాయిలో అధికారులు, సిబ్బంది కొరత కూడా వేధిస్తున్నదని సమాచారం. ఇదిలావుండగా సాదాబైనా మాలపై ప్రజాసంఘాలు సైతం నుంచి సైతం నిరసన వ్యక్తమవుతున్నది. సంవత్స రం దాటినా దరఖాస్తులను పెట్టడం సరికాదని అంటున్నాయి. సాదాబైనా మాలపై ఆదేశాలిచ్చిన సర్కారు సైతం 'తాంబూలాలిచ్చాం..తన్నుకుచావండి' అనే రీతిలో వ్యవహరిస్తుండటం గమనార్హం.

పాత జిల్లాలవారీగా దరఖాస్తుల వివరాలు..	
జిల్లా	సంఖ్య
వరంగల్	3,03,902
కరీంనగర్	2,47,535
ఖమ్మం	2,01,762
నల్లగొండ	1,34,844
నిజామాబాద్	89, 719
మెదక్	61, 306
ఆదిలాబాద్	46, 607
మహబూబ్‌నగర్	28, 248
రంగారెడ్డి	5, 261
హైదరాబాద్	12
మొత్తం	11,19,196

ఇంకా పెండింగ్‌లోనే: కోదండరామ్, టీజేఏసీ ఛైర్మన్

సాదాబైనామాల దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. రెవెన్యూ శాఖ, బ్యాంకులు, బీమా సంస్థలు, వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం సమన్వయం చేసుకోవాలి. ఈ సమస్య పరిష్కారం అయితే రైతులకు కొంతమేర ప్రయోజనం కలుగుతుంది.

రుణ అర్హత కోల్పోతున్నారు
గోపాల్‌రావు, రిటైర్డ్ ఐఏఎస్

రైతులకు ధృవపత్రాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరిస్తే లాభం కలుగుతుంది. పత్రాలు లేక కేవలం 40 శాతం మందికి మాత్రమే రుణ కార్డులు ఇచ్చారు. అందులోనూ 10 శాతం మంది రైతులకు బ్యాంకులు, ఇతర సహకార సంస్థలు అప్పులిచ్చాయి. సర్కారు మరింత చొరవ చూపాలి.

యాజమాన్య హక్కులు ప్రశ్నార్థకం
సారంపల్లి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుఅఖిల భారత కిసాన్ సభ

సాదాబైనామాలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాది దాటి పోయింది. క్రమబద్ధీకరణ, మ్యుటేషన్ పెద్ద సమస్యగా ఉంది. రైతులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సులభంగా చేయాల్సిన పనులను సైతం తీవ్ర ఆలస్యం చేస్తున్నారు. అధికారిక పత్రాలు లేకపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. రుణాలు, ఇతరత్రా పనుల్లో సమస్యలను ఎదుర్కొంటు న్నారు. అంతేగాక యాజమాన్య హక్కులు ప్రశ్నార్థక మవుతున్నాయి.

27న ఆర్టీసీ కార్మికసంఘ్ రాష్ట్ర మహాసభ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ కార్మికసంఘ్ (బీఎమ్ఎస్ అనుబంధం) రాష్ట్ర ద్వితీయ మహాసభను ఈనెల 27న నల్గొండలో నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పి రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలో దాదాపు 250 మంది ప్రతినిధులు పాల్గొంటారని, ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల హక్కులు తదితర అంశాలపై చర్చలు జరుగుతాయని వివరించారు. బీఎమ్ఎస్ జాతీయ కార్యదర్శి రాజ్‌బిహారీ శర్మ ఈ సమావేశాల్లో ప్రారంభోపన్యాసం చేస్తారని చెప్పారు.

విద్యుత్‌సంస్థల ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా నారాయణ నాయక్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ విద్యుత్ సంస్థల ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పి నారాయణ నాయక్ ఎన్నికైనట్టు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఈ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా ఎమ్ రాంజీ, ప్రధాన కార్యదర్శిగా టి శంకర్, ఫైనాన్స్ సెక్రటరీగా కె విజయకుమార్‌తోపాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని తెలిపారు.

నేడు ఆర్టీసీఈయూ ఆధ్వర్యంలో దీక్షలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారంనాడు రాష్ట్రంలోని అన్ని డిపోల వద్ద సామూహిక నిరాహార దీక్షల్ని నిర్వహిస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి ఓప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1నుంచి రావల్సిన పేస్కేల్‌ను అమలు చేయాలని, జాప్యం చేసినందున 30 శాతం ఐఆర్ ఇవ్వాలని, కార్మికులపై పనిభారాలు తగ్గించాలని, ఆర్టీసీలో మూసివేతలు ఆపాలని, ప్రయివేటు బస్సుల అక్రమ రవాణాను అరికట్టాలనే పలు డిమాండ్లతో ఈ దీక్షలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

'కేంద్ర కనీస వేతనాల్ని అమలు చేయండి'

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసంఘటితరంగంలోని కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కేంద్రప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు లేఖ రాసారు. 2009 తర్వాత ఇప్పటి వరకు రాష్ట్రంలో కనీస వేతనాల సవరణ జరగలేదని, దీనికోసం వేసిన రెండు కమిటీలు ప్రభుత్వానికి సిఫారసులు అందచేసినా, ఇప్పటి వరకు అమల్లోకి రాలేదని తెలిపారు. వేతన షెడ్యూల్ అమలు కాకపోవడం వల్ల కార్మికులు నెలకు రూ.5వేల నుంచి రూ.12వేల వరకు నష్టపోతున్నారని, అందువల్ల తక్షణం పెరిగిన వేతనాల్ని వారికి చెల్లించాలని ఆ లేఖలో కోరారు.

'కేసీఆర్‌కు అవార్డు ఇచ్చింది ప్రభుత్వసంస్థ కాదు'

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు అవార్డును ప్రకటించింది ప్రభుత్వరంగ సంస్థ కాదని బీజేపీ జాతీయ నాయకులు నల్లు ఇంద్రసేనారెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మంత్రులు కేంద్రప్రభుత్వం అవార్డు ఇచ్చినట్టు అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారని, కొన్ని వ్యాపార సంస్థలు తమ లావాదేవీల కోసం వ్యాపార వ్యూహంలో భాగంగా లాబీయింగ్ చేసుకోవడానికే ఈ అవార్డును ప్రకటించాయని విమర్శించారు. సోమవారంనాడిక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు కమిషన్ ఏర్పాటు ఏమైందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్యల్ని గుర్తించడానికి ప్రభుత్వం 16 షరతులు విధించిందని, రైతు సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదికేశారని విమర్శించారు.

జేఎన్టీయూహెచ్ రీకౌంటింగ్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీటెక్, బీ ఫార్మసీ కోర్సుల రీకౌంటింగ్, రీవ్యాల్యుయేషన్ ఫలితాలను జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్) సోమవారం విడుదల చేసింది. వివరాలు సంబంధిత ప్రిన్సిపాల్స్ వెబ్ పోర్టల్‌లో పొందుపరిచామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యు యేషన్ వి కామాక్షి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. బీటెక్, బీ ఫార్మసీ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 24వ తేదీ నుం చి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.



సైనిక విన్యాసాలను నిరసిస్తూ ద. కొరియాలో ప్రదర్శన

అమెరికా-ద.కొరియా సైనిక విన్యాసాలు

- అగ్నికి ఆజ్యం పోశాయని రష్యా, చైనాలు ఆగ్రహం
- ఇదంతా..తమపై దురాక్రమణ కోసమే : ఉ.కొరియా

సియోల్ : తమ సంయుక్త సైనిక విన్యాసాలతో అమెరికా-దక్షిణ కొరియాలు పరిస్థితిని మరింత దిగజారుస్తున్నాయి. తమ చర్యల ద్వారా కొరియా ద్వీపకల్పంలో అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. చర్చలే మార్గమం, ఉత్తర కొరియా రెచ్చగొట్టే చర్యలు మానాలి...అని చెప్పే అమెరికా, ద.కొరియాలు మరోవైపు ఆయుధ ప్రదర్శనతో, సైనిక విన్యాసాలతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను మరింత పెంచడానికి ప్రయత్నిస్తున్నాయి. ఉ.కొరియాను లక్ష్యంగా చేసుకొని ద.కొరియా, అమెరికా తాజాగా సంయుక్త సైనిక విన్యాసాల్ని ప్రారంభించాయి. ఇదంతా కేవలం తమ దేశాన్ని దురాక్రమణ చేయడానికి కాకపోతే మరేంటి ? అని ప్యాంగ్యాంగ్ నాయకత్వం ప్రశ్నించింది. అమెరికా, ద.కొరియా చర్యల్ని రష్యా, చైనాలు కూడా తీవ్రంగా ఖండించాయి. సంయుక్త సైనిక విన్యాసాలు ఇక్కడి పరిస్థితుల్ని మరింత ఉద్రిక్తతగా మార్చాయని రష్యా, చైనాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ సంయుక్త సైనిక విన్యాసాలను వ్యతిరేకిస్తూ సోమవారంనాడు ద.కొరియాలోని పలు నగరాల్లో నిరసన ప్రదర్శనలు కూడా జరిగాయి.

సంయుక్త సైనిక విన్యాసాల్లో అమెరికాకు చెందిన 17 వేల సైనిక బలగాలు, ద.కొరియాకు చెందిన 50 వేల సైనిక బలగాలు పాల్గొన్నాయి. పదిరోజులపాటు ఈ సంయుక్త సైనిక విన్యాసాలు జరపనున్నారు. దీనిగురించి ఉ.కొరియా అధికార పత్రిక 'రోడాంగ్ సిన్‌మన్' ఎడిటోరియల్ కథనం రాసింది. సంయుక్త సైనిక విన్యాసాల ద్వారా అమెరికా, ద.కొరియాలు ఎలాంటి సంకేతాలు పంపాలనుకుంటున్నారు ? అని ఎడిటోరియల్ కథనం ప్రశ్నించింది. ఇలాంటి చర్యల వల్ల పరిస్థితులు అణు యుద్ధానికి దారి తీయెచ్చునన్న ఆందోళన వ్యక్తం చేసింది.

అమెరికా 'ఆఫ్ఘాన్ వ్యూహం'లో భారత్‌కు పాత్ర !

రక్షణ మంత్రి జిమ్ మ్యాటిస్ వెల్లడి

- ఆఫ్ఘాన్‌లో అనుసరించాల్సిన విధానంపై కసరత్తు పూర్తిచేసిన ట్రంప్



వాషింగ్టన్: ఆఫ్ఘనిస్తాన్ విషయంలో అనుసరించనున్న సరికొత్త వ్యూహాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు ప్రకటించనున్నారు. కొత్త విధానంలో భారత్‌ను సైతం భాగస్వామిని చేయాలని శ్వేతసౌతం భావిస్తున్నట్టు ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం జాతిని ఉద్దేశించి ట్రంప్ చేయనున్న ప్రసంగంపై ఆసక్తి నెలకొంది. బరాక్ ఒబామా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన 100 రోజుల్లోనే ఆఫ్ఘనిస్థాన్ విధానాన్ని ప్రకటించగా, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా కూడా ట్రంప్ ఆ పని చేయకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

దీంతో ఆఫ్ఘనిస్తాన్ అంశంపై దృష్టి సారించిన ట్రంప్ ప్రభుత్వం, యుద్ధం ప్రారంభమైన 16 ఏండ్ల తర్వాత ఆ దేశ విషయంలో అనుసరించాల్సిన వ్యూహంపై విస్తృత కసరత్తు చేసింది. గత శుక్రవారం జాతీయ భద్రతా బృందంతో ట్రంప్ సుదీర్ఘ చర్చలు జరిపారు. జాతీయ భద్రతా సలహాదారు మెక్‌మాస్టర్, విదేశాంగ మంత్రి టిల్లర్‌సన్, రక్షణమంత్రి జిమ్ మ్యాటిస్, మిలటరీ ఉన్నతాధికారులు మొదలైనవారంతా ఆఫ్ఘన్ వ్యూహ రూపకల్పనలో పాల్గొన్నారు. వ్యూహంపై చర్చలు ముగిసాక...తమ ముందు అనేక నిర్ణయాలు ఉన్నాయని ట్రంప్ ట్విట్టర్‌లో సందేశం పంపారు.

ఒబామా విధానం ప్రధానంగా ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్‌లపై కేంద్రీకృతం కాగా ఈసారి ట్రంప్ భారత్‌ను సైతం కీలక పాత్రధారిని చేయనున్నారని వార్తలు వెలువడ్డాయి. కొత్తవ్యూహం ఆఫ్ఘనిస్తాన్‌కు మాత్రమే పరిమితం కాదని, దక్షిణాసియా విధానంగా ఉంటుందని అమెరికా రక్షణ మంత్రి జిమ్ మ్యాటిస్ వ్యాఖ్యానించడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చుతోంది. ముందస్తు అభిప్రాయాలతో కాకుండా, విషయాన్ని సమగ్రంగా చర్చించామని, తుది నిర్ణయాన్ని అధ్యక్షుడు ట్రంప్ ప్రజలకు తెలియజేస్తాడని మ్యాటిస్ అన్నారు. ఈ అంశంపై అమెరికా మీడియా కథనాలు ఇలా ఉన్నాయి...అఫ్ఘాన్‌లో అమెరికా సైనిక బలగాల కమాండర్ ఇన్ చీఫ్ జాన్ నికోలస్ అఫ్ఘనిస్తాన్‌కు మరిన్ని బలగాలను పంపాలన్న ప్రతిపాదనను ట్రంప్ ముందు ఉంచారు. దీనిని రక్షణ మంత్రి మ్యాటిస్ బలపర్చారు. అదనంగా 3 నుంచి 5 వేల సైనిక బలగాలను అఫ్ఘాన్‌కు పంపాలని నికోలస్ కోరారు.

మధ్య ఆసియాకు ఇది చాలా కీలకమైన అంశమని, ఈ ప్రాంతంలో అమెరికా తన ఆధిపత్యం కొనసాగడానికి ఇది దోహదం చేస్తుందని నికోలస్ తెలిపారట.

యుద్ధనౌకను ఢీకొట్టిన ఇంధన నౌక..

వాషింగ్టన్: అమెరికాకు చెందిన యుఎస్‌ఎస్ జాన్ ఎస్.మెకైన్ ఓడను సోమవారం ఉదయం ఓ ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమెరికాకు చెందిన పది మంది నావికాదళ అధికారులు సముద్రంలో గల్లంతుకాగా మరో ఐదు మంది గాయపడినట్టు అధికారులు వెల్లడించారు. సోమవారం ఉదయం 5.24గంటల ప్రాంతంలో సింగపూర్‌కు సమీపంలో మలక్కా వద్ద ఆల్‌నిక్ ఎమ్‌సీ ఆయిల్ ట్యాంకర్.. మెకైన్ ఓడను ఢీకొట్టింది. దీంతో ఓడలో ఉన్న 10మంది నావికాదళ అధికారులు సముద్రంలో గల్లంతు కావడంతో వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు నావికాదళాధికారి అడమ్ జాన్ రిచర్డ్‌సన్ తెలిపారు. సింగపూర్ అధికారుల సాయంతో హెలికాప్టర్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు. ఇలాంటి దుర్ఘటన చోటు చేసుకోవడం ఎంతో బాధాకరమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. రెండు నెలల కాలంలో ఇలాంటి ప్రమాదం చోటు చోటు చేసుకోవడం ఇది రెండో సారి. గతంలో దక్షిణ జపాన్‌లో జరిగిన ప్రమాదంలో సుమారు ఏడుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే.



ఫుక్సింగ్..బుల్లెట్‌లా దూసుకెళ్తుంది..

సిద్ధం చేసిన చైనా

- గంటకు 350 కిమీ. ప్రయాణం

బీజింగ్: ప్రపంచంలో అత్యంత వేగవంతమైన బుల్లెట్ రైలు సెప్టెంబరు 21న చైనాలో ప్రారంభం కానుంది. బీజింగ్, షాంఘై నగరాల మధ్య ప్రయాణాన్ని మరో గంట తగ్గించేందుకు వీలుగా దీని సగటు స్పీడు పెంచింది. గంటకు 350 నుంచి 400 కిలోమీటర్ల గరిష్ట వేగంతో నడిచే రైళ్లను చైనా రైల్వే కార్పొరేషన్ నడపనుంది. ఈ వివరాలను చైనా రైల్వే కార్పొరేషన్ అధికారులు సోమవారం వెల్లడించారు.

ఈ రైలుకు ఫుక్సింగ్ అనే పేరు పెట్టారు. షాంఘై, బీజింగ్ నగరాల మధ్య 1,318 కిలోమీటర్ల దూరాన్ని ఈ రైలు కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే పూర్తిచేస్తుంది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య నడుస్తున్న రైళ్ల వేగం గంటకు సగటు వేగం 300 కిలోమీటర్లు. ఈ కొత్త రైళ్లు ప్రస్తుతం ఉన్న వాటి కంటే గంటకు 50 కిలోమీటర్లు అధిక వేగంతో నడుస్తాయి. అసాధారణ, అత్యవసర పరిస్థితుల్లో ఈ రైళ్లు తమంటత తామే వేగాన్ని నియంత్రించుకుని నిలిచిపోతాయి.

ఇవి రోజుకు ఏడుసార్లు ప్రయాణిస్తాయి. కొత్తగా ప్రారంభించే ఫుక్సింగ్ రైళ్ల గరిష్ఠ వేగం 400 కిలోమీటర్లు. షాంఘై, బీజింగ్ నగరాల మధ్య నడుస్తోన్న పాత రైళ్ల ద్వారా 6 గంటల్లో చేరుకుంటున్నారు.

హైస్పీడ్ రైళ్లను 2008లో లాంఛనంగా ప్రారంభించిన చైనా వీటి కోసం దేశవ్యాప్తంగా మూడు మార్గాలను నిర్మించింది. చైనా వ్యాప్తంగా రైళ్లను గంటకు 250 నుంచి 300 కిలోమీటర్ల వేగంతో హైస్పీడ్ రైళ్లను 2011 నుంచి నడుపుతోంది. సుమారు 22 వేల కిలోమీటర్ల విస్తీర్ణంతో ప్రపంచంలో అతిపెద్ద హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌ను చైనా కలిగి ఉంది. ఇది ప్రపంచ హైస్పీడ్ రైల్వే వ్యవస్థలో 60 శాతం. అలాగే 1/ 3 వంతు రైళ్లను 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యంతో రూపొందించినట్టు చైనా అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్ హీ హౌవూ తెలిపింది.

అమెరికాలో కనువిందు చేసిన సూర్య గ్రహణం

వాషింగ్టన్: నింగిలో అద్భుతం ఆవిష్కృతమైంది. సుమారు 100 ఏండ్ల తర్వాత అమెరికాలో సోమవారం సంపూర్ణ సూర్య గ్రహణం సంభవించింది. ఈ ఖగోళ అద్భుతాన్ని నాసా ప్రత్యక్ష ప్రసారం చేసింది. గ్రహణం కారణంగా యూఎస్‌లోని 14 రాష్ట్రాల మీదుగా 70.కి.మీ వెడల్పు ప్రాంతం చీకటిమయం అయ్యింది. దక్షిణ కరోలినాలో గ్రహణం ముగిసింది. 14 రాష్ట్రాల్లో సంపూర్ణ సూర్య గ్రహణం ఏర్పడింది. ఇతర రాష్ట్రాల్లోనూ పాక్షిక గ్రహణ దృశ్యాలను జనం ఆసక్తిగా తిలకించారు. కాగా పలు కంపెనీలు తమ ఉద్యోగులకు సెలవులు ప్రకటించాయి. గ్రహణం నేపథ్యంలో పలు హెూటళ్లలో ప్రత్యేక వంటకాలతో పర్యాటకులను రద్దీగా కనిపించాయి.

'ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయులపై వివక్ష వద్దు'

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయులపై ఉన్నతాధికారుల వివక్షను నిరసిస్తూ ఉపాధ్యాయులు విద్యాశాఖ డైరెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి కిషన్‌నాయక్, కైలాసం మాట్లాడుతూ...చిన్నకారణాలతో ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తున్నారని, తిరిగి తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. క్యాడర్‌తో సంబంధం లేకుండా ప్రతి ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయునికి ఉన్నత విద్య చదువుకునేందుకు వేతనం కూడిన సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయాలనీ, గిరిజన సంక్షేమ శాఖలోని ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్‌రూల్స్ వర్తింపజేయాలని కోరారు. ఈ ధర్నాకు టీటీఎఫ్ నాయకులు రఘునందన్ తదితరులు మద్దతు ప్రకటించారు.

సామూహిక సెలవుకు జీటీఏ మద్దతు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఎస్ విధానం రద్దు కోసం సెప్టెంబర్ 1న జరిగే సామూహిక సెలవుకు ప్రభుత్వ ఉపా ధ్యాయ సంఘం(జీటీఏ) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సోమవారం జీటీఏ రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి ఎం.వీరాచారి ఒకప్రకటన విడుదల చేశా రు. సీపీఎస్‌లో జమ అయిన మొత్తాన్ని వెంటనే జీపీఎఫ్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు.

రుణ విమోచన కమిషన్‌ను ఏర్పాటు చేయండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతు కూలీల కోసం రుణ విమోచన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన చట్టం 2016లోని సెక్షన్ 3(1) ప్రకారం కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడాన్ని మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వాజ్యాన్ని సోమవారం బెంచ్ విచారించింది.

టీఆర్ఎస్‌ది గ్రాఫిక్స్ సర్కారు : రావుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం గ్రాఫిక్స్ సర్కారుగా మారిపోయిందని తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపిం చారు. ఉహా చిత్రాలు, గ్రాఫిక్స్, ప్రచారాలు, ప్రకట నలతో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వాన్ని పీఆర్‌వోలు నడిపిస్తున్నా రని విమర్శించారు. రోజుకో కొత్త పథకం, దానికి సంబంధించి ఉహా చిత్రాలను విడుదల చేయడం పరిపాటిగా మారిందని తెలిపారు. మత్స్య పరిశ్రమ ను రూ. 20 వేల కోట్ల పెంచుతామని చెప్పడం పట్ల ఆశ్చర్యం వ్యక్తంచేశారు. సర్కారు పెంచుతున్న చేపలు, మొక్కలను లెక్కపెట్టడం అంటే ఆకాశంలోని నక్షత్రాలను గణించడమేనని ఎద్దేవా చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి సమగ్ర భూసర్వే అన్నారని, రాష్ట్రంలోని 10,850 రెవెన్యూ గ్రామాలను సర్వే చేస్తామంటున్నారని గుర్తు చేశారు. ఇది కూడా ప్రజల దృష్టి మళ్లించడానికేనని వివరించారు. గతంలో కర్ఫ్యూ వాతావర ణాన్ని సృష్టించి సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) చేశారన్నారు. ఆ సర్వేను ఒక ప్రహసనంగా మార్చేశారని అభిప్రాయపడ్డారు. ల్యాప్‌టాప్‌ల్లో సమగ్ర సమాచారం ఉందని గతంలో సర్కారు చెప్పిందని, అది ఏమైందని ప్రశ్నించారు. ఎస్‌కేఎస్ ప్రభుత్వానికి ఏవిధంగా ఉపయోగపడిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటిదాకా ఎందుకు ఆ సర్వే వివరాలను బయటపెట్టలేదని ప్రశ్నించారు. కేసీఆర్ సర్కారు స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. వెంటనే రూ. 15 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం నిధులు, విధులు ఇవ్వాలని సూచించారు. కేరళ మోడల్ ఎక్కడికిపో యిందని అడిగారు. బీరాలు పలికిన కేటీఆర్ శాఖ మార్చుకుని వెళ్లిపోయారని చెప్పారు. లాల్‌బహదూర్ శాస్త్రీ ఇచ్చిన జైజవాన్, జై కిసాన్ అనే నినాదంలో జై జవాన్ తీసేసి జై కేసీఆర్, జై కిసాన్ అంటూ ప్రభుత్వ ప్రకటనలు జారీచేస్తున్నారని విమర్శించారు. ముఖ్య మంత్రికి ఐసీఎఫ్ఏ అవార్డు ఇప్పించడంలో విజయ వంతమైన వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీని వాసరెడ్డి జన్మ దన్యమైందని వ్యాఖ్యానించారు. ఈ విలేకర్ల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అజ్మీరా రాజునాయక్ పాల్గొన్నారు.

లోక్‌సత్తా అనుబంధ సంఘాల అధ్యక్షుల ఎంపిక

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణరాష్ట్ర లోక్‌సత్తాకు అనుబంధ సంఘాల అధ్యక్షులను ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాండురంగారావు ప్రకటిం చారు. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళాసత్తా అధ్యక్షులుగా గజానని, యువసత్తా అధ్య క్షులుగా శివరామకృష్ణ, విద్యార్థిసత్తా అధ్యక్షులు రాజీవ్, కార్మిక సత్తా అధ్యక్షులు కొండల్‌రెడ్డి, సమతాసత్తా అధ్యక్షులుగా గోపాల్ తదితరులను ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు.

'ఓపెన్' పరీక్షల తత్కాల్ గడువు పెంపు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో అక్టోబర్‌లో జరిగే ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షల తత్కాల్ ఫీజు గడువు ఈనెల 26వరకు పొడగించినట్టు సొసైటీ డైరెక్ట ర్ బాలయ్య తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. ఎస్ఎస్‌సీకి రూ.500, ఇంటర్మీడి యేట్‌కు రూ.వెయ్యి చొప్పున తత్కాల్ ఫీజు ఉంటుందని చెప్పారు.

'సర్వీస్ నిబంధనలపై ప్రతిపాదనలివ్వండి'

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సమగ్రమైన సర్వీస్ నిబంధనలు రూపొందించేందుకు వీలుగా సత్వరమే ప్రతిపాదనలు ఇవ్వాలని పాఠశాల విద్య కమిషనర్ జి కిషన్ ఉపాధ్యాయ సంఘాలను కోరారు. సోమవారం డీఎస్ఈ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల (యూఎస్‌పీసీ, టీటీజేఏసీ, జాక్టో)తో ఆయన వేర్వేరుగా సమావేశమయ్యారు. గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ సర్వీస్‌రూల్స్ ఏ విధంగా ఉండాలి? నియామకాలు, పదోన్నతులు, విద్యార్హతలు తదితర అంశాలపై న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా సర్వీస్‌రూల్స్ రూపొందించేందుకు సహకరించాలని కిషన్ కోరారు.

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలపై నేడు కడియం సమీక్ష

రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియలో భాగంగా మూడోవిడత సీట్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. సీట్లు రాని విద్యార్థులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించింది. డిగ్రీ విద్యార్థుల ఇబ్బందులపై ఇటీవల పత్రికల్లో పలు కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించిన ఉప ముఖ్య మంత్రి కడియం శ్రీహరి మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)పై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు.

నవచిత్రం


హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్ కోసం..



బాలకృష్ణ, నయనతార

నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 102వ చిత్ర షూటింగ్ ఇటీవల అంగరంగ వైభవంగా ఆర్ఎఫ్‌సీలో ప్రారంభమైన విషయం విదితమే. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లిమిటెడ్ పతాకంపై సి.కళ్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలకృష్ణ సరసన నయనతార నటిస్తున్న విషయం విదితమే. సోమవారం నుంచి ఆమె ఈ చిత్ర షూటింగ్‌లో భాగమయ్యారు. ఆ విశేషాలను నిర్మాత సి.కళ్యాణ్ తెలియజేస్తూ, 'ఇటీవల ఘనంగా ప్రారంభోత్సవం జరుపుకున్న ఈ చిత్ర షూటింగ్‌లో సోమవారం నుంచి నయనతార పాల్గొంటున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ప్రస్తుతం ఆర్ఎఫ్‌సీలో జరుగుతోంది. 'సింహా', 'శ్రీరామరాజ్యం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్స్ అనంతరం బాలకృష్ణ, నయనతార జంటగా నటిస్తున్న చిత్రమిది. ఆ సినిమాల స్థాయిలోనే ఈ చిత్రంలోనూ వారిద్దరి కెమిస్ట్రీ సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేయనుంది. బాలకృష్ణ కెరీర్‌లోనే ఇది మరో సంచలన చిత్రమవుతుంది' అని అన్నారు. బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్, అశుతోష్ రాణా, మురళీమోహన్, ప్రభాకర్, శివపార్వతి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సి.రాంప్రసాద్, సంగీతం: చిరంతన్ భట్.

హలో! అంటున్న అఖిల్



'హలో!' ఫస్ట్‌లుక్

'అఖిల్' సినిమా అనంతరం అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న నూతన చిత్రానికి 'హలో!' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా సోమవారం చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. విక్రమ్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, మనం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున నిర్మిస్తున్నారు. డిసెంబర్ 22న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

కలెక్షన్ల వర్షంలో ఆనందో బ్రహ్మ



తాప్సీ

తాప్సీ, శ్రీనివాస్‌రెడ్డి, వెన్నెలకిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్, రాజీవ్ కనకాల ప్రధాన పాత్రధారులుగా మహి వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్, శశిదేవి రెడ్డి నిర్మించిన 'ఆనందో బ్రహ్మ' చిత్రం ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్ తెచ్చుకుంటోంది. ఈ చిత్రం గురించి చిత్ర బృందం మాట్లాడుతూ, 'ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచి సూపర్ పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. విడుదలైన అన్ని సిటీస్‌లో 60శాతానికిపైగా కలెక్షన్లను సాధించింది. మొదటి వారాంతంలో 4.5కోట్ల డొమెస్టిక్ గ్రాస్ వసూలు చేసింది. ఓవర్సీస్‌లోనే దాదాపు 2.25కోట్లు కలెక్ట్ చేయడం విశేషం. సోమవారం కూడా కలెక్షన్లు బాగున్నాయి. సినిమాను కొన్న డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్స్‌కు లాభాల పంట పడుతుంది. వారంతా హ్యాపీగా ఉన్నారు. అన్ని వర్గాల్ని మెప్పించే విధంగా దర్శకుడు మహి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆయన కథ, కథనం, తాప్సీ, శ్రీనివాస్‌రెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్ వంటి వారి కామెడీ టైమింగ్, ఎమోషనల్ సీన్స్ ప్రేక్షకులను మెప్పించాయి. ముఖ్యంగా రెండవ భాగంలో వచ్చే కామెడీ సీన్స్‌కి ఈ మధ్య కాలంలో అంతగా నవ్వలేదని, అటు ఇండస్ట్రీ సెలబ్రిటీస్, ప్రేక్షకులు సైతం చెబుతున్నారంటే సినిమాకు వస్తున్న స్పందన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు 40 నిమిషాలపాటు సీట్లలో కూర్చొని చూడటం లేదు, హిలేరియస్‌గా నవ్వుతున్నారు. ఈ చిత్రం ఇంకా పెద్ద రేంజ్‌లో విజయం సాధిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఓ చిన్న చిత్రం విజయం సాధిస్తే ఇండస్ట్రీ అందరి సపోర్ట్ ఉంటుందని ఈ చిత్రం మరోసారి నిరూపించింది. 'భలే మంచి రోజు' తర్వాత నిర్మాతలు విజయ్, శశిదేవి రెడ్డి మరో విజయాన్ని అందుకున్నారు. 'ఈ చిత్రం సాధిస్తున్న విజయం చూస్తుంటే నాకూ ఇటువంటి కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలను నిర్మించాలనే స్ఫూర్తి కలుగుతోంది' అని దిల్ రాజు ఇటీవల ఈచిత్ర సక్సెస్ మీట్‌లో చెప్పడం మాకెంతో ధైర్యాన్నిచ్చింది. మా చిత్రం భారీ చిత్రాలు చేసే నిర్మాతలకు సైతం కాన్సెప్ట్ ఓరియెంటెడ్ చిత్రాలు చేయాలనే ఆలోచన కలిగిస్తుందన్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ విజయం స్ఫూర్తితో మరిన్ని మంచి చిత్రాలను నిర్మిస్తాం' అని తెలిపింది.

ఆ భయంతోనే కథ రాశా..



కమల్‌హాసన్

'మా ఇంట్లో పనిచేస్తున్న వాళ్ళు డబ్బు కోసం నా కూతురిని కిడ్నాప్ చేయబోయారు. ఆ సంఘటనే 'మహానది' చిత్రానికి కథ అయ్యింది' అని అంటున్నారు కమల్ హాసన్. ఇటీవల ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో కమల్ ఈ విషయాన్ని వెల్లడించారు. కమల్ నటించిన 'మహానది' చిత్రం 1994లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఓ కొత్తకథతో 'మహానది' చిత్రాన్ని కమల్ తెరకెక్కించాలనుకున్నారట. చాలా రోజులుగా కథ కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ అనుకున్న కథ తట్టలేదట. ఇదే సమయంలో తన కూతుర్ని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన ఘటననే 'మహానది' చిత్రానికి కథగా ఎంచుకున్నారట. ఆ విశేషాలను కమల్ తెలియజేస్తూ, 'మహానది సినిమాకు కథ ఎందుకు రాయాల్సి వచ్చిందన్న విషయాన్ని ఇప్పటి వరకు ఎవరితోనూ చెప్పలేదు. ఇప్పుడు నేను ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకోగలుగుతున్నానో అలా పెద్ద వారైనా నా కూతుళ్లు కూడా అర్థం చేసుకుంటారని ఆశిస్తూ ఈ విషయాన్ని చెబుతున్నా. ఓసారి మా ఇంట్లో పనిచేస్తున్నవాళ్ళు నా కుమార్తెను డబ్బు కోసం కిడ్నాప్ చేయబోయారు. వారి మోసం గురించి తెలిసి నా కూతుర్ని కాపాడుకోగలిగాను. అప్పుడు నాకు వారిని చంపేయాలన్నంత కోపం వచ్చింది. కానీ ఆ సమయంలో ఆవేశం కంటే ఆలోచన ముఖ్యమనిపించింది. ఈ టైమ్‌లోనే 'మహానది'కి రాయాలనుకున్న కథను ఆలస్యం చేస్తూ వచ్చాను. ఎప్పుడైతే నా కూతురి విషయంలో నాకు భయం కలిగిందో ఆ భయంతోనే 'మహానది' సినిమాకు కథ రాయడం మొదలుపెట్టా. బహుశా నా కుమార్తె విషయంలో నాకున్న భయమే నాతో ఈ కథ రాయించిందనుకుంటా' అని చెప్పారు. కమల్ ప్రస్తుతం 'శభాష్ నాయుడు' సినిమాతోపాటు తమిళ బిగ్‌బాస్ షోకు హోస్ట్‌గా చేస్తున్నారు.



ఐశ్వర్య రాయ్

నయా చిత్రానికి గ్రీన్‌సిగ్నల్..!

'జజ్బా' చిత్రంతో హీరోయిన్‌గా రీఎంట్రీ ఇచ్చిన ఐశ్వర్యరాయ్ 'సరబ్‌జిత్', 'ఏ దిల్ హై ముష్కిల్' చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. 'ఏ దిల్ హై ముష్కిల్' చిత్రం ఆశించిన స్థాయిలో ఫలితం రాబట్టలేకపోవడంతో తదుపరి సినిమాల విషయంలో ఐష్ ఆచితూచి వ్యవహరిస్తోంది. అందుకే ఏడాది కాలంగా మరే సినిమాకు పచ్చజెండా ఊపలేదు. భర్త అభిషేక్ బచ్చన్‌తో కలిసి ఓ సినిమాలో నటించబోతున్నట్టు, అలాగే అనిల్‌కపూర్‌తో కలిసి ఓ సినిమా చేయబోతున్నట్టు సోషల్ మీడియాలో హల్‌చల్ అయినప్పటికీ అవి తెర రూపం దాల్చలేదు. ఇదిలా ఉంటే, తాజాగా మాధవన్‌తో కలిసి ఐష్ ఓ చిత్రంలో నటించబోతుందనే న్యూస్ ప్రస్తుతం మీడియాలో హాట్‌న్యూస్ అయ్యింది. రాకేష్ ఓం ప్రకాష్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫన్నీ ఖాన్' చిత్రంలో ఐష్ నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని సమాచారం. ఇందులో ఐష్‌కి జోడీగా మాధవన్ నటిస్తారని తెలుస్తోంది. అంతేకాదు బాలీవుడ్ సీనియర్ నటుడు అనీల్ కపూర్ కూడా మరో కీలక పాత్ర పోషిస్తారట. గతంలో ఐష్ నటించిన 'గురు' చిత్రంలో మాధవన్ ఓ ముఖ్య పాత్ర పోషించిన విషయం విదితమే.

ప్రేమికులు చూడాల్సిన చిత్రం..

శ్రీకరణ్, అమృత, ప్రీతి ప్రధాన పాత్రధారులుగా నంది వెంకట్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీకరణ్ ప్రొడక్షన్స్ పతాకంపై గొంటి శ్రీకాంత్ నిర్మిస్తున్న చిత్రం 'బెస్ట్ లవర్స్'. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ, 'ప్రేమకు సరికొత్త నిర్వచనం తెలిపే చిత్రమిది. దర్శకుడు నంది వెంకట్ సినిమాను చాలా బాగా తెరకెక్కించారు. ప్రతి ప్రేమికుడు, ప్రేమికురాలు చూడాల్సిన చిత్రమిది. వీరితోపాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు కావాల్సిన అంశాలన్ని ఈ చిత్రంలో ఉన్నాయి. ఈ సినిమాకు సాయికిరణ్ అందించిన మ్యూజిక్ బాగా కుదిరింది. ఇటీవల విడుదలైన పాటలు మంచి స్పందన రాబట్టుకుంటున్నాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని సెన్సార్ కార్యక్రమాలకు సిద్ధంగా ఉంది. సెన్సార్ పూర్తి చేసి, త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం' అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: డి.యాదగిరి, సంగీతం: జి.సాయి కిరణ్.



'బెస్ట్ లవర్స్' చిత్రంలో శ్రీకరణ్, ప్రీతి

విలేజ్ లవ్‌స్టోరీ నేపథ్యంలో..



తేజ, హరి, బెక్కెం వేణుగోపాల్

'చూడాలని ఉంది', 'ఇంద్ర', 'యువరాజు' వంటి చిత్రాల్లో బాలనటుడిగా నటించిన తేజ ఇప్పుడు హీరోగా మారబోతున్నారు. హరి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్(గోపి) ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమా గురించి నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ, 'దాదాపు 50కిపైగా సినిమాల్లో బాలనటుడిగా తెరపై కనువిందు చేసిన ఘనత మాస్టర్ తేజ సొంతం. ఆయన్ని ఇప్పుడు హీరోగా పరిచయం చేయబోతున్నాం. ప్రముఖ నిర్మాత శ్యామ్ ప్రసాద్‌రెడ్డి సంస్థలో దర్శకత్వ విభాగంలో దాదాపు ఎనిమిదేండ్లు పనిచేసిన హరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కథ అద్భుతంగా కుదిరింది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే యూత్‌ఫుల్ లవ్ స్టోరీ ఇది. కుటుంబ సమేతంగా చూసేలా సినిమా ఉంటుంది. సెప్టెంబర్ 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ఉంటుంది. 'ఉయ్యాల జంపాల', 'స్వామిరారా' చిత్రాలకు స్వరాలు సమకూర్చిన సంగీత దర్శకుడు సన్నీ ఎం.ఆర్ ఈ చిత్రానికి బాణీలు అందిస్తున్నారు. ఇతర ఆర్టిస్టులు, టెక్నీషియన్ల వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం' అని అన్నారు.

జీర్ణించుకోలేకపోతున్నారు



రాధికా ఆప్టే

'హీరోయిన్లలో కూడా సూపర్‌స్టార్స్ ఉన్నారు. కానీ కొంతమంది వారిని సూపర్‌స్టార్లుగా అంగీకరించలేకపోతున్నారు' అని అంటోంది రాధికా అప్టే. బాలీవుడ్‌తోపాటు చిత్ర పరిశ్రమలో హీరో, హీరోయిన్ల మధ్య అసమానతల విషయంలో ఇటీవల బాగా చర్చ జరుగుతోంది. హీరోయిన్ల రెమ్యూనరేషన్‌తోపాటు సూపర్ స్టార్ హోదాపై రాధికా ఆప్టే మాట్లాడుతూ, 'చిత్ర పరిశ్రమలో హీరో,హీరోయిన్ల విషయంలో చాలా అసమానతలున్నాయి. ప్రస్తుతం ఉన్న నటీనటులందరూ నాకు స్నేహితులే. అందులో హీరోలు కూడా ఉన్నారు. వీరిలో చాలామంది నాకంటే మూడు రెట్లు ఎక్కువ పారితోషికం తీసుకునే వాళ్ళున్నారు. ఈ సమస్య ఒక్క చిత్ర పరిశ్రమలోనే కాదు సమాజంలో కూడా ఉంది. బాలీవుడ్‌లో చాలా మంది మేల్ సూపర్ స్టార్స్ ఉన్నారు. మహిళా యాక్టర్స్‌లో కొంత మంది మాత్రమే ఆ స్టేటస్‌ను అనుభవిస్తున్నారు. ప్రియాంక చోప్రా, దీపికా పదుకొనె వంటి వారు పెద్ద హీరోల చిత్రాల్లో నటిస్తున్నారు. దీంతో వీళ్ళని ఫీమేల్ సూపర్‌స్టార్స్‌గా చెప్పుకోడాన్ని కూడా కొంతమంది జీర్ణించుకోలేకపోతున్నారు. హీరోయిన్లను ప్రేక్షకులు సూపర్‌స్టార్లుగా అంగీకరిస్తే ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ల మధ్య అసమానతల విషయంలో చాలా మార్పు వస్తుంది. మహిళా సూపర్‌స్టార్స్ అని గొప్పగా చెప్పుకునే రోజు త్వరలోనే వస్తుందని ఆశిస్తున్నాను' అని తెలిపింది. రాధికా ప్రస్తుతం 'ఉలా', 'ది ఫీల్డ్', 'బాంబేరియా', 'ఆశ్రమ్', 'ప్యాడ్‌మ్యాన్'తోపాటు భవేష్ జోషి చిత్రంలో నటిస్తోంది.

మై కౌన్ హూ?



అమీర్ ఖాన్

అమీర్ ఖాన్ హీరోగా అద్వైత్ చందన్ దర్శకత్వంలో బాలీవుడ్‌లో సీక్రెట్ సూపర్‌స్టార్' అనే చిత్రం రూపొందుతోంది. ఇందులో జైరా వాసిం అనే బాలనటి కీలక పాత్రధారిణిగా కనిపించనుంది. తాజాగా సినిమాలోని తొలి పాటను విడుదల చేశారు. 'మై కౌన్ హూ..' (నేను ఎవరినీ..) అంటూ సాగే పాట ఆకట్టుకుంటుంది. గాయని అవ్వాలన్న ఓ బాలిక కల ఎలా నెరవేరింది?, తాగుబోతు తండ్రి నుంచి తన తల్లిని కాపాడుకుని తన ఆశయాన్ని ఎలా నెరవేర్చుకుందన్న ఇతివృత్తంతో ఈ చిత్రం రూపొందుతోంది. గాయని అవ్వాలనుకున్న అమ్మాయి పాత్రలో జైరా వాసిం నటించింది. తను పాట పాడటం తండ్రికి ఇష్టం లేకపోవడంతో జైరా వాసిం బుర్ఖా వేసుకుని పాట పాడి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయాలనుకుంటుంది. తన పేరు మాత్రం వెల్లడించకుండా గాయనిగా తన గాత్రాన్ని అందరికీ పరిచయం చేయాలనుకుంటుంది. అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ చిత్రాన్ని అమీర్ ఖాన్ నిర్మిస్తున్నారు. అక్టోబర్ 19న ఈ చిత్రం విడుదల ముందుకు రానుంది.

మనుషులు మారకపోతే..

ప్రస్తుతం దాదాపు 9 చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న రాజ్‌కుమార్ రావ్ నటిస్తున్న చిత్రాల్లో ఒకటి 'న్యూటన్'. మనదేశంలో జరిగే ఎన్నికల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. భారత్‌లో ఎన్నికలు నిర్వహించడం ఎంత శ్రమతో కూడుకుని ఉంటుందనేది తాజాగా విడుదల చేసిన టీజర్‌లో చూపించారు. 'దేశంలో జరిగే ఎన్నికలకు అయ్యే ఖర్చు రూ.30వేల కోట్లు. 84కోట్ల ఓటర్లు, 90లక్షల పోలింగ్ బూత్‌లున్నాయి. నేటికి ఎన్నికల విషయంలో భారతదేశం కొత్త రికార్డులు సృష్టిస్తోంది. పార్లమెంట్‌కు వెళ్లే గూండాలు ఉండొచ్చు. కానీ అలాంటి గూండాలను మనం ఎన్నికల్లో తలదూర్చనివ్వకూడదు. మనుషులు మారకపోతే దేశం మారదు' అంటూ టీజర్‌లో ఉన్న డైలాగ్‌లు ఆకట్టుకుంటున్నాయి. ఎన్నికల ప్రక్రియను సాఫీగా నిర్వహించాలనుకునే ఓ ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో రాజ్‌కుమార్‌రావ్ నటిస్తున్నారు. అమిత్ వి.మసుర్‌కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఇటీవల బెర్లిన్‌లో జరిగిన 67వ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. త్వరలో ఉత్తర అమెరికాలో జరగబోయే ట్రిబెకా ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ప్రదర్శించనున్నారు. సెప్టెంబర్ 22న ఈ సినిమా విడుదల కానుంది.



'న్యూటన్'లో రాజ్‌కుమార్‌రావ్

కలిసి మాట్లాడుకోండి

ఇద్దరు సీఎంలకు ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి

- అభివృద్ధి అంటే ఆకలి, అవినీతి లేని దేశాన్ని నిర్మించడమే..: పౌర సన్మాన సభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- రాజ్‌భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘనసన్మానం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల సీఎంలు ఒకరికొకరు సహకరించుకొని ముందుకు సాగాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. అభివృద్ధి ఫలాలు చిట్టచివర వ్యక్తికి అందితేనే రాష్ట్రం ఏర్పాటైన లక్ష్యం నెరవేరుతుంది. రాష్ట్రం విడిపోయింది ఏ ఒక్కరి కోసం కాదు.. అభివద్ధి కోసం మాత్రమేనని తెలిపారు. రాష్ట్రాలు విడిపోయినా ప్రపంచం దష్టిలో తెలుగువారంతా ఒక్కటేనని, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సహకరించుకుని అభివద్ధిలో పోటీపడాలని ఆయన ఆకాంక్షించారు. తెలుగు ప్రజలు కలిసుండాలని, రెండు రాష్ట్రాలూ అభివృద్ధి చెందాలన్నారు. అభిప్రాయభేదాలు ఉన్నా.. వాటిని కూర్చోని సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఇంగ్లీషుపై ప్రేమతో తెలుగు భాషను మరవద్దన్నారు. మన కట్టు, బొట్టు, మన సంస్కృతి, భాషను రక్షించుకోవాలన్నారు. అందుకోసం ఉద్యోగం రావాలంటే తెలుగు తప్పనిసరిగా చదివి ఉండాలన్న నిబంధన పెట్టాలని కోరారు. తెలంగాణతో పాటు ఏపీ అభివృద్ధికి ఏ చర్యలు ఉపయుక్తమో అందుకు తన వంతు సహకరిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుకు ఘనంగా పౌరసన్మానం జరిగింది. వెంకయ్యకు సీఎం కేసీఆర్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు గవర్నర్ నరసింహన్, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి సన్మానించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆశీర్వచనాలు పలికి.. వెంకయ్యను ఆశీర్వదించారు. రాజ్‌భవన్ లో జరిగిన ఈ వేడుకకు కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ, శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, మండలి చైర్మెన్ స్వామిగౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హైదరాబాద్ మేయర్, డిప్యూటీ మేయర్, మాజీ గవర్నర్ రోశయ్య, పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం వెంకయ్యానాయుడు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తనకు పౌరసన్మానం చేయడం గొప్పగా ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు చెప్పారు. తాను పుట్టింది నెల్లూరు.. చదివింది విశాఖలో.. రాజకీయంగా పెరిగింది.. ఒదిగింది.. ఎదిగింది మాత్రం హైదరాబాద్‌లో నేనన్నారు. హైదరాబాద్‌ను ఒక మినీ భారత్ అనడంలో అతిశయోక్తి లేదన్నారు. ప్రపంచ పటంలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. హైదరాబాద్ అంటే ఉత్తరాది వాళ్లకి దక్షిణాది.. దక్షిణాది వాళ్లకి ఉత్తరాది అని తెలిపారు. హైదరాబాద్ బిర్యానీ, హలీంకు ప్రత్యేకత ఉందన్నారు. తాను భాషా ప్రియుడిని, మంచి భోజనప్రియుడిని అని కూడా చెప్పారు. హైదరాబాద్ అన్నా.. తెలంగాణ అన్నా తనకెంతో ఇష్టమన్నారు. 'స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు అయింది. స్వరాజ్యం వస్తే.. సమస్యలు పరిష్కారం అవుతాయని పోరాటం చేశాం. స్వరాజ్యం వచ్చింది కానీ సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదు. స్వరాజ్యాన్ని సురాజ్యం చేయాలి. రామరాజ్యంగా తీర్చిదిద్దాలి. రామరాజ్యం అంటే ఆకలి లేని, అవినీతి, అక్రమాలకు తావులేని దేశాన్ని నిర్మించడమేనన్నారు. సురాజ్యం కోసం ప్రజాప్రతినిధులు తమ కర్తవ్యాలను నిర్వర్తించాలి.' అని చెప్పారు.

పౌర సన్మానంలో జనం లేరు మీడియాకు కోట్ల రూపాయల యాడ్స్

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు నిర్వహించిన పౌరసన్మానంలో జనం లేకపోవడం గమనార్హం. సామాన్యులు కన్నెత్తి చూడలేని రాజ్‌భవన్‌లో ప్రభుత్వం ఈ సన్మానం చేపట్టడం ఎవరికి ఉప యోగమని పలువురు అభిప్రాయపడ్డారు. లౌకికదేశమని చెబుతూ వేదపండితుల మంత్రోచ్ఛరాలతో సన్మానించడం పట్ల వ్యతిరేకత వ్యక్తమైంది. సన్మానం పేరుతో మీడియాకు యాడ్స్, హైదరాబాద్‌లో హోర్డింగ్‌ల రూపంలో కోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నించారు. ఇదెల పౌరసన్మానం అవుతుంది అని ఆశ్చర్యపోతున్నారు. పాలకపక్షానికి ప్రజల పట్ల విధేయత ఉండాలి తప్ప ఈ సన్మానాలు, అట్టహాసాలు, ఆలింగనాలు, ప్రశంసలు అవసరమా అని అన్న భావన చాలామందిలో వ్యక్తమైంది. పౌరసన్మానం వెనుక రాజకీయం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు తెలిపారు.

వెంకయ్య, నరసింహన్, కేసీఆర్ ఒకరినొకరు పొగడ్తలు

పౌరసన్మానంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ ముగ్గురూ ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకున్నారు. కేసీఆర్ మాట్లాడుతూ వెంకయ్య అద్భుతమైన వ్యక్తి అని చెబుతూనే కొన్ని పద్యాలు వినిపించారు. గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ వెంకయ్య దేశానికి చాలా సేవలు చేయాల్సి ఉందంటూనే 'మీరు కూడా నాలాగానే వెజిటేరియన్ తినాలి' నవ్వులతో ముంచెత్తారు. చివర్లో వెంకయ్యానాయుడు మాట్లాడుతూ కేసీఆర్ ఉపన్యాసం షడ్రపోపేత భోజనంలా ఉంటుందని కొనియాడారు. ఆయన మాట్లాడే తీరు తనకు బాగా నచ్చుతుందన్నారు. అట్ల మాట్లాడితేనే ప్రజలకు మనం మాట్లాడేది అర్థమవుతుందన్నారు. అయితే తాను చెప్పడం వల్లే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని అనడం చర్చనీయాంశమైంది. మొత్తం కార్యక్రమం ఉపన్యాసం, భాష, ఆహారం, పొగడ్తలతోనే సాగడం గమనార్హం. అయితే ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీలను పిలిచినట్లు చెప్పినా తమకు ఆహ్వానం అందలేదని టీడీపీ నేతలు రమణ తెలిపారు. కేవలం టీఆర్ఎస్, బీజేపీ నేతలు మాత్రమే హాజరయ్యారు.

దేశానికి వెంకయ్య సేవలు అవసరం : గవర్నర్

వెంకయ్యనాయుడు సేవలు దేశప్రజలందరికీ అవసరమని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. వెంకయ్యను ఘనంగా సన్మానించుకోవడం తెలుగు వారందరికీ ఈ రోజు శుభదినమని తెలిపారు. తెలుగు వ్యక్తి ఉపరాష్ట్రపతి అవడంపై గర్వపడుతున్నానని చెప్పారు.

తెలంగాణ గర్వించదగ్గ విషయం : దత్తాత్రేయ

వెంకయ్యనాయుడుకు ప్రభుత్వం పౌరసన్మానం చేయడం తెలంగాణ ప్రజలు గర్వించదగ్గ విషయమని కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ చెప్పారు. అనుక్షణం సమాజాభివ ద్ధికి పాటు పడిన వ్యక్తి వెంకయ్య అని కొనియాడారు.

వెంకయ్య అద్భుతమైన వక్త : సీఎం కేసీఆర్

ఉపరాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకయ్యానాయుడుకు సన్మానం చేయడం తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వానికి దక్కడం సంతోషంగా ఉందని సీఎం కేసీఆర్ తెలిపారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తెలుగు వారికి, తెలుగు భాషకు గౌరవం దక్కిందని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు తెలుగు వ్యక్తి ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. భారతదేశంలోనే వెంకయ్య అద్భుతమైన వక్త అని కొనియాడారు. తన మాటలతో వెంకయ్య అందరిని అబ్బురపరుస్తారు. ఉపన్యాసాన్ని పండించడంలో వెంకయ్య దిట్ట అని ప్రశంసించారు. వ్యంగ్యం, హాస్యం, రౌద్రం అన్నీ కలిస్తేనే పరిపూర్ణమైన ఉపన్యాసం అని... ఇవన్నీ వెంకయ్య ఉపన్యాసంలో కనిపి స్తాయన్నారు. వెంకయ్య సాధారణమైన వ్యక్తి. సామాన్య కార్యకర్త నుంచి ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందన్నారు. ఇవాళ బేగంపేటలో వెంకయ్య తమను ఆప్యాయంగా పలుకరించడం సంతోషాన్నిచ్చిందన్నారు.

బేగంపేటలో ఘనస్వాగతం

బేగంపేట విమా నాశ్రయంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రులు, నగర మేయర్ ఘనంగా స్వాగతం పలికారు.

మధ్యాహ్న భోజనం అమలుతీరుపై వివరణ ఇవ్వండి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఏవిధంగా అమలు చేస్తున్నారో తెలియజేయాలని కేంద్రంతోపాటు రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ పథకం నిర్వహణలో పరిశుభ్రతకు సంబంధించి తీసుకుంటున్న జాగ్రత్తల గురించి సుప్రీంకోర్టు ప్రశ్నించింది. విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. 2013లో బీహార్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో కలుషితమైన ఆహారాన్ని తీసుకొని 23మంది చిన్నారులు మృతి చెందిన ఘటనపై ఓ స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారిస్తున్నది. అటువంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశించింది.

కులదురహంకార హత్యల నిరోధానికి సలహాలివ్వండి

కుల దురహంకార హత్యల నిరోధానికి సలహాలివ్వాల్సిందిగా స్వచ్ఛంద సంస్థలను సుప్రీంకోర్టు కోరింది. ఈ కేసు విచారణలో కోర్టు సహాయకుడిగా వ్యవహరిస్తున్న న్యాయవాది రాజురామచంద్రన్‌ను కూడా రెండు వారాల్లో సూచనలు ఇవ్వాల్సిందిగా సుప్రీంకోర్టు కోరింది. సూచనలు ఇచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలకు నాలుగు వారాల సమయమిచ్చింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. కులాంతర వివాహాలకు సిద్ధపడుతున్న యువకులపై గ్రామ పెద్దలు పంచాయతీలు నిర్వహించి శిక్షలు విధిస్తున్న ఘటనలపై ఎన్జీవోలు వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారిస్తున్నది.

నేరెళ్ల ఘటనపై నేడు హైకోర్టులో విచారణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిరిసిల్ల జిల్లా నేరెళ, రామచంద్రాపురం, జిల్లెల్ల గ్రామాల ఘటనపై మంగళవారం హైకోర్టులో విచారణ జరగనుంది. ఆయా గ్రామాల్లోని దళితులను పోలీసులు చిత్రహింసలకు గురిచేయడంపై హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి, తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షుడు బి చంద్రకుమార్ రాసిన లేఖను హైకోర్టు సోమవారం ప్రజాహిత వ్యాజ్యంగా స్వీకరించింది. పోలీసులు కావాలనే ఎనిమిది మంది దళితులను చిత్రహింసలకు గురిచేసి వారి హక్కులను కాలరాశారని లేఖలో పేర్కొన్నారు. కరీంనగర్ జైలులో ఉన్న బాధితుల సాక్ష్యాల్ని నమోదు చేయాలని తెలిపారు. వారికి ప్రమాణాలతో కూడిన వైద్యసాయం అందించాలని పేర్కొన్నారు. ఒక్కో బాధితుడికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం తెలంగాణ ప్రభుత్వం అందించాలని కోరారు. ఈ పిల్‌పై తాత్కాలిక న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారణ చేపట్టనుంది.

సిరిసిల్ల ఎస్పీ స్థాన చలనం వెనుక..!

(మొదటిపేజీ తరువాయి)



తీసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు దళితులు తీవ్రంగా గాయపడటం తో వామపక్ష పార్టీలతో పాటు కాంగ్రెస్, ఇతర దళిత సంఘాలు పెద్ద పెట్టున ఆందోళనకు దిగాయి. ముఖ్యంగా లాఠీచార్జికి కారకులుగా ఆరోపిస్తు జిల్లా ఎస్పీ ని బదిలీ చేయాలని డిమాండ్ చేశాయి. అయితే దీనిపై విచారణ జరిపించి చర్య తీసుకుంటామని మంత్రి కేటీఆర్ ప్రకటించిన రెండు రోజులకే వరంగల్ రేంజ్ డీఐజీ రవివర్మ ఇచ్చిన నివేదిక మేరకు సిరిసిల్ల సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ను సస్పెండ్ చేసినట్టు రీజియన్ ఐజీ వై.నాగిరెడ్డి తర్వాత ప్రకటించారు. అయితే లాఠీచార్జికి ఆదేశించింది ఎస్పీ విశ్వజిత్‌అని ఆయనను వదిలేసి కింది స్థాయి అధికారిపై చర్య తీసుకోవడమేమిటనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా విశ్వజిత్ స్థానచలనం జరిగినట్టుగా పోలీసు వర్గాల నుంచి వినిపిస్తోంది. అయితే పోలీసు ఉన్నతాధికారులు మాత్రం విశ్వజిత్ వెళ్తున్నది లడాఖ్ స్వింగ్ ట్రాక్ కార్యక్రమానికని చెబుతున్నారు. లడఖ్ ప్రాంతంపై 1962 లో చైనా దురాక్రమణ జరిపిందని ఆ సంధర్భంగా జరిగిన యద్ధాన్ని నేపథ్యంగా చేసుకుని ప్రతి సంవత్సరం లడఖ్ స్వింగ్ ట్రాక్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నదని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి కొందరు పోలీసు అధికారులను ఎంపిక చేసి లడఖ్ స్వింగ్ ట్రాక్ కార్యక్రమానికి పంపించడం జరుగుతుం దన్నారు. నెల రోజుల పాటు ఇందులో వారు పాల్గొంటారని,, ఆ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి ఎస్పీ విశ్వజిత్ తో పాటు రిజర్వు విభాగానికి చెందిన డీఎస్పీ రమణారెడ్డిని కూడా పంపిస్తున్నామని తెలిపారు. అయితే ఎస్పీని బదిలీ చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు తలొగ్గినట్టుగా గాక లడఖ్ కార్యక్రమం సాకుతో ఆయనకు స్థానచలనం జరిగిందనే అనుమానాలు పోలీసు వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. తనను సస్పెండ్ చేయలేదని, అధికారికంగానే లడఖ్‌కు పోతున్నానని తెలిపారు. మీడియాలో తనపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా కరీంనగర్ సీపీ కమలహసన్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

అక్టోబర్ 5న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో


సింగరేణి కాలరీస్‌లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు నగారా మోగింది. అక్టోబర్ 5వ తేదీ ఎన్నికల్ని నిర్వహిస్తున్నట్టు కేంద్ర కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్, రిటర్నింగ్ అధికారి కెకెహెచ్‌ఎమ్ శ్యాంసుందర్ ప్రకటించారు. సోమవారంనాడిక్కడి సింగరేణి భవన్‌లో 16 కార్మికసంఘాలతో ఆయన సమావేశమయ్యారు. కార్మికశాఖ ప్రాంతీయ కమిషనర్ ఎస్ రామన్, సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ ప్లానింగ్) జె పవిత్రన్ కుమార్, జనరల్ మేనేజర్ (పర్సనల్) ఏ ఆనందరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఎన్ అనిల్‌కుమార్, కవితానాయుడు తదితరులు పాల్గొన్నారు. గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి రెండు సంవత్సరాలా లేక నాలుగేండ్లా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయు) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్ నాగరాజగోపాల్ కోరారు. అలాగే డిపెండెంట్ ఉద్యోగాలపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికాలంగా కోడ్ ఆఫ్ డిసిప్లిన్‌ను సవరిస్తామని చెప్తూవచ్చారని, దీనికోసం కేంద్ర కార్మిక శాఖ, యాజమాన్యం పలు సమావేశాలు కూడా నిర్వహించిన విషయాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అయితే దీనిపై కేంద్ర కార్మిక శాఖ అధికారులు స్పందించలేదు. కోడ్‌ఆఫ్ డిసిప్లిన్‌లో ఎలాంటి మార్పులు లేవని, ఎన్నికలు పూర్తయ్యాక గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి రెండేండ్లా...నాలుగేండ్లా అనే దానిపై చీఫ్ లేబర్ కమిషనర్ స్పష్టత ఇస్తారని సమాధానం చెప్పారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయం ఇక్కడ అప్రస్తుతని అధికారులు వ్యాఖ్యానించారు. ఎలాంటి స్పష్టమైన వివరణ లేకుండా అధికారులు చేసిన కామెంట్లను నిరసిస్తూ సీఐటీయు నాయకులు సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. మిగిలిన కార్మిక సంఘాలు ఎన్నికలు నిర్వహించాల్సిందేనని స్పష్టంచేశాయి. దాంతో ఎన్నికల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఆగస్టు 1వ తేదీ వరకు ఆన్‌రోల్‌లో ఉన్న ఉద్యోగులతో కూడిన తాత్కాలిక ఓటర్ల జాబితాగా పరిగణిస్తామని, 2017 అక్టోబర్ 5వ తేదీ నాటికి ఆన్‌రోల్‌లో ఉన్న ఉద్యోగులు మాత్రమే ఓటు వేయడానికి అర్హులని అధికారులు తెలిపారు.

ఇదీ షెడ్యూల్

కార్మిక సంఘాలకు ఓటర్ల జాబితా అందజేత	- ఆగస్టు 30
జాబితాపై అభ్యంతరాల స్వీకరణ వరకు	- సెప్టెంబర్ 6
అభ్యంతరాలపై నిర్ణయం	- సెప్టెంబర్ 7
తుది ఓటర్ల జాబితా ప్రకటన	- సెప్టెంబర్ 13
నామినేషన్లు స్వీకరణ	- సెప్టెంబర్ 14
నామినేషన్ల తుది గడువు	- సెప్టెంబర్ 16
నామినేషన్ల ఉపసంహరణ	- సెప్టెంబర్ 19
నామినేషన్ల పరిశీలన	- సెప్టెంబర్ 20 (మధ్యాహ్నం 2గంటల వరకు)
గుర్తుల కేటాయింపు	- సెప్టెంబర్ 20 (మధ్యాహ్నం 2నుంచి 5గంటల లోపు)
పోలింగ్	- అక్టోబర్ 5
ఫలితాలు	- అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం 7 గంటలకు

మాజీ మంత్రి సమ్మయ్య కన్నుమూత

- నేడు పరకాలలో అంత్యక్రియలు



సమ్మయ్య (ఫైల్)

నవతెలంగాణ-పరకాల

మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొచ్చు సమ్మయ్య(78) సోమవారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధప డుతున్న ఆయన వారం రోజున కిందట హైదరా బాద్‌లోని నివాసంలో బాత్రూంలో జారిపడ్డారు. తలకు గాయం కావడంతో కుటుంబసభ్యులు నిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతిచెందారు. వరంగల్ రూరల్ జిల్లా పరకాల పట్టణానికి చెందిన బొచ్చు సమ్మయ్య కాకతీయ మెడికల్ కళాశాలలో క్లర్కుగా పనిచేశారు. 1978లో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లో ప్రవేశించారు. 1978లో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం అయిన పరకాల నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి జనతా పార్టీ అభ్యర్థి మారపెల్లి ఎలీయాపై గెలుపొందారు. 1983లో బీజేపీ అభ్యర్థి ఒంటేరు జైపాల్‌పై గెలుపొందారు. 1985, 1989, 1994లో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 1978, 1980లో ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, 1980-82లో ముఖ్యమంత్రి టి.అంజయ్య మంత్రివర్గంలో మత్స్య, పట్టు పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన సమ్మయ్య మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, మాజీ ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, అంజయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నెదురుమల్లి జనార్దన్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యునిగా, కాకతీయ యూనివర్సిటీ సెనేట్ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన కాంగ్రెస్ పార్టీ క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు స్వస్థలం పరకాలలో అంత్యక్రియలు జరు గనున్నాయి. మాజీ మంత్రి సమ్మయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మాజీ చీఫ్‌విప్ గండ్ర వెంకటరమణారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనుగాల వెంకటరా మిరెడ్డి, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

సీఎం సంతాపం

వరంగల్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి సమ్మయ్య మృతి పట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖరావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సమ్మయ్య అంతక్రియలను పోలీస్ లాంఛనాలతో తుది వీడ్కోలు పలకాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను ఆదేశించారు. సమ్మయ్య మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి సంతాపం తెలిపారు.

వివక్షపై హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు

- సమగ్ర విచారణకు కలెక్టర్‌కు ఆదేశిస్తానన్న చైర్మెన్

నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలో జాతీయ పతాకాన్ని ఎగురవేయకుండా సర్పంచ్ జ్యోతిని అడ్డుకున్న ఘటనకు సంబంధించి మానవహక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ)లో ఫిర్యాదు అందింది. 'జాతీయజెండా సాక్షిగా వివక్ష' అనే కథనం సోమవారం నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన విషయం తెలిసిందే. దాంతో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి సంఘాల రాష్ట్ర నాయకులు మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ సుబ్రహ్మణ్యంను కలిసి ఫిర్యాదు చేశారు. దళిత సర్పంచ్‌కు అవమానం కలిగించిన ఉపసర్పంచ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని విన్నవించారు. విద్యార్థిసంఘాల నాయకులతో చర్చించిన చైర్మన్ ఈ ఘటనకు సంబంధించి ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను విచారణకు ఆదేశిస్తానని హామీ ఇచ్చారని విద్యార్థి సంఘాల నాయకులు వెల్లడించారు. జస్టిస్ సుబ్రహ్మణ్యంను కలిసిన వారిలో తెలంగాణ దళిత విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారాయణ, డెమొక్రటిక్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భద్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరుణాంక్, తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌కోటా, సమీర్, అంబేద్కర్ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు కృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు రెహమాన్, దళిత్ బహుజన్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ దర్శన్, మైనారిటీ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు హబీబ్, దళిత్, మైనారిటీ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నరేష్ తదితరులున్నారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలు 15కు వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చేనెల 10వ తేదీన జరగాల్సిన డిపార్ట్‌మెంటల్ రాతపరీక్షలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వాయిదా వేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల 10న జరగాల్సిన డిపార్ట్‌మెంటల్ రాతపరీక్షలను వచ్చేనెల 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. వచ్చేనెల 10న ఇతర రాతపరీక్షలు నిర్వహిస్తుండడంతో వాయిదా వేశామని పేర్కొన్నారు. గురుకుల విద్యాలయాలకు చెందిన పోస్టులకు వచ్చేనెల 10న రాతపరీక్షలున్నాయని తెలిపారు. ఇతర వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రయివేటీకరణపై బ్యాంకు ఉద్యోగుల సమరశంఖం

నేడు దేశవ్యాప్త సమ్మె

- తెలుగు రాష్ట్రాల్లో 80 వేల మంది ఆందోళనబాట
- హైదరాబాద్‌లో కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో నిరసన ప్రదర్శన
- జయప్రదానికి యూఎఫ్‌బీయూ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇవి దేశ ప్రజానీకానికి వ్యతిరే కమైన, వారికి నష్టదాయకమైన సంస్కరణలని తెలి పింది. దేశంలోని ప్రభుత్వ బ్యాంకులన్నింటినీ స్వదేశీ, విదేశీ బహుళజాతి కంపెనీలకు అప్పగించే కుట్రలో భాగంగానే ఇలాంటి సంస్కరణలకు తెరలేపుతున్నారని విమర్శించింది. కేంద్ర ప్రభు త్వం తీసుకుంటున్న ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా మంగళవారం దేశవ్యాప్తంగా ఉన్న పది లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు ఒకరోజు సమ్మె నిర్వహిస్తున్నారని యూఎఫ్‌బీయు కన్వీనర్ వివిఎస్ఆర్ శర్మ చెప్పారు. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 80 వేల మంది ఉద్యోగులు తమ తమ బ్యాంకుల వద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహిస్తారని వివరించారు. మొత్తం ఐదు వేల బ్రాంచీల వద్ద జరిగే ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యూఎఫ్‌బీయులో భాగస్వాములుగా ఉన్న ఇతర యూనియన్ల ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. ఏఐబీఈఏ, ఏఐబీవోసీ, ఎన్సీబీఈ, ఏఐబీవోఏ, బెఫి, ఐఎన్‌బీఈఎఫ్, ఐఎన్‌బీవోసీ, ఎన్‌వోబీడబ్ల్యూ, ఎన్‌వోబీవో కలిసి యూఎఫ్‌బీయుగా ఏర్పడ్డాయని తెలిపారు. ఈ నేపథ్యంలో యూఎఫ్‌బీయు ఆధ్వర్యంలో సంఘటితంగా మంగళవారం సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ ప్రమోషన్ల కోసమో, జీతభత్యాల పెరుగుదల కోసమో ఈ సమ్మెను నిర్వహించటం లేదని చెప్పారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్మును కాపాడేందుకు, వాటిని పెట్టుబడిదారులు, కార్పొరేట్‌శక్తుల పరం చేసేందుకు జరుగుతున్న యత్నాలను తిప్పికొట్టేందుకే ఈ సమ్మెను నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ ప్రజానీకంలో దాదాపు 80 శాతం మంది రూ.75 లక్షల కోట్లను ప్రభుత్వరంగంలోని బ్యాంకుల్లో పొదుపు చేసుకున్నారని వివరించారు. ప్రభుత్వ బ్యాంకులపై వారికున్న భరోసా, నమ్మకం, విశ్వాసమే దీనికి కారణమని అన్నారు. సంస్కరణల పేరుతో బ్యాంకులను ప్రయివేటీకరించటం ద్వారా ఈ సొమ్మును బడాబాబులకు అప్పగించేందుకు ఎన్డీయే ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్‌శక్తులు రుణాలను తీసుకుని ఎగ్గొడితే సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. గతంలో ఇదే పద్ధతిలో గ్లోబల్ ట్రస్టు బ్యాంకు ఖాతాదారులకు కుచ్చుటోపీ పెట్టిందని గుర్తుచేశారు. విలేకరుల సమావేశంలో సుబ్రమణ్యం, హర్షవర్ధన్ (ఏఐబీవోసీ), రాధాకృష్ణన్ (ఎన్సీబీఈ), గిరి (ఏఐబీవోఏ), శ్రీనివాస్ (బెఫి) తదితరులు పాల్గొన్నారు.

యూఎఫ్‌బీయూ వ్యతిరేకిస్తున్న అంశాలు..

- ప్రజా వ్యతిరేకమైన బ్యాంకింగ్ సంస్కరణలు
- కార్పొరేట్ సంస్థల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏలు)ను రద్దు చేయటం
- వివిధ సేవలపై బ్యాంకు చార్జీలను విపరీతంగా పెంచటం

డిమాండ్లు...

- ఎన్‌పీఏలు, ఇతర రుణాలన్నింటినీ వసూలు చేసేందుకు వీలుగా బ్యాంకుల్లో ప్రమాణాలను మెరుగుపరచాలి
- ఎఫ్ఆర్‌డీఐ బిల్లు ప్రతిపాదనలను విరమించుకోవాలి
- బ్యాంకు బోర్డు బ్యూరోను ఎత్తేయాలి
- బ్యాంకుల్లో చాలినంత సిబ్బందిని, ఉద్యోగులను నియమించాలి
- ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించిన ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలి.

డెంగ్యూతో మహిళ మృతి

నవతెలంగాణ-టేకుమట్ల

డెంగ్యూ జ్వరంతో మహిళ చనిపోయింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... వెలిశాలకు చెందిన దొమకొండ నిర్మల (35) వారం నుంచి జ్వరంతో బాధపడుతూ స్థానికంగా చికిత్స పొందింది. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగ్యూ అని నిర్ధారించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి భర్త పదేండ్ల కిందనే చనిపోయాడు. నిర్మలకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరు మరణించడంతో వారు అనాథలయ్యారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కాంగ్రెస్ మండలాధ్యక్షులు రెడ్డి మల్లారెడ్డి, సర్పంచ్ నజ్రీన్‌పరివీన్ కమురోద్దీన్‌లు కోరారు. అంత్యక్రియల కోసం సర్పంచ్ నజ్రీన్ పరివీన్ కమురోద్దిన్ 1500 రూపాయలు అందజేశారు.


నవంబర్‌లో పార్లమెంట్ మహాపడావ్

ప్రభుత్వ సంస్థల నిర్వీర్యం బాటలో ఎన్‌డీఏ సర్కారు

- ఏటా కోటి ఉద్యోగాలు ఉత్తమాటే
- సింగరేణిలో వారసత్వం పేరుతో రాష్ట్ర సర్కారు మోసం
- కార్మికుల, సామాజిక సమస్యలపై ఐక్య పోరాటాలు: సెంట్రల్ పబ్లిక్ సెక్టార్స్ రాష్ట్ర కన్వీనర్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.నర్సింహారెడ్డి
- సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభ ప్రారంభం



జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న ఎస్ నర్సింహారెడ్డి

నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రభుత్వం రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, ప్రభుత్వం రంగ సంస్థల పరిరక్షణ కోసం నవంబర్ 9, 10, 11 తేదీల్లో దేశవ్యాప్తంగా లక్షలాది మందితో తలపెట్టే పార్లమెంట్ మహాపడావ్ కార్యక్రమానికి తరలిరావాలని సెంట్రల్ పబ్లిక్ సెక్టార్స్ రాష్ట్ర కన్వీనర్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండల కేంద్రంలోని పర్సాసత్యనారాణ నగర్(సెంటినరికాలనీ కమ్యూనిటీహాల్)లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎస్‌సీఈయూ-సీఐటీయూ అనుబంధం) రాష్ట్రమహాసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలుత సీఐటీయూ జెండాను ఎస్‌సీఈయూ గౌరవాధ్యక్షులు రాజారావు అవిష్కరించారు. పర్సాసత్యనారాయణ చిత్రపటానికి సీఐటీయూ రాష్ట్ర నాయకులు, ప్రతినిధులు నివాళులు అర్పించారు. అనంతరం ఎస్.నర్సింహారెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో ప్రజలను చీల్చే కుట్రను ఎన్‌డీఏ సర్కారు చేస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తోందని వాపోయారు. పరిశ్రమల్లో కార్మికులు యజమాన్యాల గుప్పిట్లో ఉండే విధంగా చట్టాలను మారుస్తోందన్నారు. ఇప్పటివరకు సంస్కరణల పేరుతో దేశంలోని 33 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించిందన్నారు. దేశంలో 244 సంస్థలు ఉత్పత్తిలో ఉన్నాయని, 76 కొత్త సంస్థలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని తెలిపారు. 320 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలుండగా, 230 పరిశ్రమలను మూసివేసే కుట్ర చేస్తోందన్నారు. ఇప్పటికే ప్రపంచంలో రెండుసార్లు ఆర్థిక సంక్షోభాలు వచ్చాయని, వాటి ప్రభావం మన దేశంపై లేదని తెలిపారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు మంచి లాభాల్లో ఉండటమే ఇందుకు కారణమన్నారు. ఏడాదికి కోటి మందికి ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ సర్కారు మూడేండ్లలో ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదని, పైగా రెండు కోట్ల మంది నిరుద్యోగులు పెరిగారని చెప్పారు. ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పిన టీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చిందన్నారు. వారసత్వ ఉద్యోగాలు ఇస్తామని ఆశజూపి సింగరేణిలో కార్మికుల ఓట్లతో టీఆర్ఎస్ లబ్దిపొందిందన్నారు. ఇప్పుడు వారినే మోసం చేసిందని, దీని కారణంగానే గతేడాది నుంచి సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకుండా జాప్యం చేసిందని వివరించారు. భవిష్యత్ పోరాటాలపై ఈ మహాసభల్లో చర్చించి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు, ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షులు రాజారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింగారావు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, రాష్ట్ర నాయకులు రామగిరి రామస్వామి, కె.రాజయ్య, పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▼ 266	నిఫ్టీ ▼ 83	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు
31,258	9,754	64.14	రూ. 29,443	రూ. 42,600	హైదరాబాద్ 320, ఒక్కగుడ్డుకు 3.80, వరంగల్ 322, విజయవాడ 320, చెన్నై 355, ముంబయి 365

రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు రద్దు

ముంబయి : భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) తన ఖాతాదారులకు ముందస్తు దీపావళి ఆఫర్‌ను ప్రకటించింది. వ్యక్తిగత, కార్లు, పసిడి తదితర రుణాలపై ప్రాసెసింగ్ ఫీజులో రాయితీ కల్పిస్తోన్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే గృహ రుణాలపై కూడా ప్రాసెసింగ్ ఫీజును తీసుకోవడం లేదు. రాబోయే పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రుణగ్రహీతలను ఆకర్షించడానికి ఎస్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. డిసెంబర్ 2017 ముగింపు వరకు కార్ల రుణాలపై పూర్తిగా ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. కాగా అక్టోబర్ 31 వరకు బంగారం రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును 50 శాతం మేర తగ్గించింది. ఎక్స్‌ప్రెస్ క్రెడిట్, వ్యక్తిగత రుణాలపై సెప్టెంబర్ 30 వరకు ప్రాసెసింగ్ ఫీజులో సగం తగ్గిస్తోన్నట్టు వెల్లడించింది. కాగా ఇప్పటివరకు బ్యాంక్ రుణం మొత్తంపై 0.5శాతం, కారు లోన్లపై 2 శాతం, ఎక్స్‌ప్రెస్ క్రెడిట్‌పై 0.5 శాతం, ద్విచక్ర వాహనాల అప్పులపై 1.5 శాతం, పసిడి రుణాలపై 0.51శాతం ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేస్తోంది. దీనికి అదనంగా జీఎస్టీ కూడా వసూలు చేస్తోంది. కాగా జూన్ 2017 త్రైమాసికం ముగింపు నాటికి ఎస్‌బీఐ రిటైల్ రుణాలు 13.31 శాతం పెరిగి రూ.4,90,005 కోట్లకు చేరాయి.

జీఎస్టీతో కంపెనీల లాభాలకు ఎసరు

ముంబయి: వస్తుసేవల పన్ను(జీఎస్టీ) రాక మునుపే సంస్థలకు చెందిన వస్తువు నిల్వలు ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడడంతో వాటి లాభాలకు గండిపడినట్టయ్యింది. జీఎస్టీ కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల నికర లాభం 15.7శాతం క్షీణించి రూ.87,475 కోట్లకు పడిపోయినట్టు ప్రముఖ క్రెడిట్ ఏజెన్సీ కేర్ రేటింగ్స్ విశ్లేషించింది. గతేడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కార్పొరేట్ నికర లాభాలు రూ.1.04 లక్షలుగా నమోదు అయ్యాయి. దాదాపు 2,108 కంపెనీలను అధ్యయనం చేసిన అనంతరం కేర్ రేటింగ్స్ రిపోర్టును ప్రకటించింది. కాగా 2017 జూన్‌తో ముగిసిన మాసంలో కంపెనీల నికర అమ్మకాలు 9.5శాతం నుంచి 8.7శాతానికి దిగజారినట్టు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అన్ని కంపెనీలపై జీఎస్టీ ప్రభావం పడిందని పేర్కొంది.

ఇన్ఫోసిస్‌ను ఆదుకోని బైబ్యాక్ ఆఫర్

- సెన్సెక్స్ 266 పాయింట్ల క్షీణత



ముంబయి: ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఆఫర్ స్టాక్ మార్కెట్లలో మదుపరులను మెప్పించలేకపోయింది. వరసగా రెండో సెషన్‌లోను స్టాక్ మార్కెట్లో కంపెనీ సూచీ పతనమైంది. ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా రాజీనామాతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న సూచీ సోమవారం తాజాగా మరో 5.6 శాతం పతనమయ్యింది. ఈ ప్రతికూలత దేశీయ స్టాక్ మార్కెట్లపైనా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం బీఎస్ఇ సెన్సెక్స్ 265.83 పాయింట్లు కోల్పోయి 31,258.85 పాయింట్లకు పడిపోయింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 83.05 పాయింట్లు నష్టపోయి 9,754.35 వద్ద ముగిసింది.దీంతో మార్కెట్లు వరుసగా రెండో రోజూ భారీ నష్టాలను చవి చూసినట్టయ్యింది.

విశ్వాసం సన్నగిల్లుతోంది..!

దేశ ఆర్థికంపై భారతీయుల మాట

- ఉపాధి, జీవన ప్రమాణాలపై అనిశ్చితి

మాస్టర్‌కార్డ్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశం అభివృద్ధి చెందుతోందని సర్కారు ప్రకటనలు చేస్తున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ ఏడాది జూలైతో ముగిసిన మొదటి అర్ధ భాగంలో భారత ఆర్థిక వ్యవస్థపై వినియోగదారుల విశ్వాసం భారీగా పడిపోయిందని మాస్టర్‌కార్డ్ సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. అంతకు ముందు జులై-డిసెంబరు మధ్య కాలంతో పోలిస్తే వినియోగదారుల విశ్వాసం ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో బాగా దెబ్బతిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశంలో జీవన ప్రమాణాలు బాగా ప్రభావితమైనట్టుగా పేర్కొంది. మాస్టర్ కార్డ్ సంస్థ సోమవారం 'కన్జ్యూమర్ కాన్ఫిడెన్స్ సూచీ' వివరాలను వెల్లడించింది. ఈ నివేదికలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని 19 దేశాలలో మొత్తం 11 దేశాలలో వినియోగదారుల విశ్వాసం నిలకడగా ఉందని సంస్థ పేర్కొంది. భారత్‌లో వినియోగదారుల విశ్వాసం సన్నగిల్లుతున్నప్పటికీ ఆశావాద విభాగంలోని నిలిచి ఉందని పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్- జూన్ మధ్య కాలంలో 18 నుంచి 64 ఏండ్ల మధ్య వయస్కులైన దాదాపు 9,153 మంది నుంచి ఆర్థిక వ్యవస్థల పట్ల అభిప్రాయ సేకరణ జరిపిన అనంతరం మాస్టర్‌కార్డ్ ఈ నివేదికను విడుదల చేసింది. ఆర్థిక వ్యవస్థ, ఉపాధి అవకాశాలు, నిరంతర ఆదాయ అవకాశాలు, స్టాక్ మార్కెట్లు, జీవన ప్రమాణాలలో పరిణామాలను గురించి ఆయా దేశాల్లో ప్రజలు అభిప్రాయాలను మాస్టర్‌కార్డ్ సమీకరించి ఈ నివేదికను తయారు చేసింది. భారత్ విషయానికి వస్తే నివేదికకు ప్రామాణికంగా తీసుకున్న అయిదు అంశాల్లోనూ ప్రజల విశ్వాసం సన్నగిల్లుతూ కనిపించడం విశేషం. ప్రధానంగా ఆర్థిక వ్యవస్థ (-11.0 పాయింట్లు), జీవన ప్రమాణాలు (-11.6 పాయింట్లు) విభాగంలో ప్రజల్లో భారీగా విశ్వాస లోపం కనిపించింది. అయిదు విభాగాల్లో మేటి ప్రదర్శనను కనబరిచిన చైనా ర్యాకింగ్‌లో భారత్ కంటే మెరుగైన స్థానంలో నిలవడం విశేషం. ప్రధానంగా ఉపాధి అవకాశాల రంగంలో అత్యధికంగా (12.1%) వృద్ధి కనిపించింది. దక్షిణ-కొరియా, సింగపూర్, మలేషియాలలో కూడా వినియోగదారుల విశ్వాసం పెరగడం గమనార్హం. స్టాక్ మార్కెట్లలో మెరుగైన వృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగవుతుండడంతో దాదాపు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వినియోగదారుల విశ్వాసం పెరగడం కనిపించిందని పేర్కొంది.

దేశంలో ఉద్యోగాలపై బెంగతో సడలుతున్న నమ్మకం: నీల్సన్

న్యూఢిల్లీ: దేశంలో ఉపాధి రంగంపై నీలి నీడలు కమ్ముకున్న నేపథ్యంలో ప్రజలు ఖర్చుల విషయంలో చాలా అప్రమత్తంగా వ్యవహరిస్తు న్నారు. దేశంలో ఉపాధి అవకాశాలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడం, ఉద్యోగ భద్రతకు సంబంధించిన ఆందోళనల నేపథ్యంలో ప్రజల్లో ఖర్చు చేసేందుకు వెనకాడుతున్నారని మార్కెట్ అద్యయన సంస్థ నీల్సన్ విశ్లేషించింది. ఫలితంగా దేశంలో వినియోగదారుల విశ్వాసం తగ్గుతూ వస్తోందని పేర్కొంది. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో భారత్‌లోని వినియోగదారుల విశ్వాస సూచీ 128 పాయింట్లుగాఉ పడిపోయింది. అంతకు ముందు త్రైమాసికంలో (2016 చివరి త్రైమాసికంలో) ఇది 136 పాయింట్ల వద్ద నిలిచింది. ఈ ఏడాది మే 20 నుంచి జూన్ 10వ తేదీ మధ్య కాలంలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైనట్టుగా నీల్సన్ వివరించింది. భారత్‌లాంటి ప్రధాన మార్కెట్లో విశ్వాసం సడలడం కంపెనీల ఉత్పత్తిపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.


అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే..

- సిక్కా రాజీనామాపై విరుచుకుపడ్డ పాయ్

బెంగళూరు: ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్‌లో నెలకొన్న సంక్షోభం రోజుకో మలుపు తిరుగుతోంది. సంస్థ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తిని కారణంగానే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని సిక్కా వర్గం ఆరోపించడాన్ని ఇన్ఫీ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ ఆక్షేపించారు. మెరుగైన ప్రతిభ కనబరచలేకపోయిన విశాల్ సిక్కా తన అసమర్థతను కప్పిపుచ్చుకొనేందుకే మూర్తిని పావులా వాడుకున్నాడంటూ ఆయన తీవ్ర విమర్శలు చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైన సిక్కా వాస్తవానికి ఫిబ్రవరి నుంచే ఇన్ఫీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకొని అదను కోసం చూస్తున్నట్టుగా ఆరోపించారు. ఇందుకు సాకుగా మూర్తిని వాడుకొని.. ఆయనను అప్రతిష్ఠపాలు చేయాలని చూస్తున్నాడని అన్నారు. సిక్కా రాజీనామా ఇన్ఫోసిస్‌ను సంక్షోభంలోకి నెట్టిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాలనాపరమైన కారణాల దృష్ట్యానే సిక్కాను తిరిగి వైస్ చైర్మెన్‌గా నియమించడాన్ని ఆయన సమర్థిస్తూనే దీంతో ఇన్ఫీలో కొంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.

అసలు కారణం రవి వెంకటేశేనా...!

విశాల్ సిక్కా రాజీనామా వ్యవహారంలో కొత్త కోణాలు బయటకు వస్తున్నాయి. ఇప్పటి వరకు వ్యవస్థాపకులతో విభేదాల కారణంగానే సిక్కా వైదొలగినట్టు ప్రచారంలో ఉంది. సిక్కా రాజీనామా లేఖ కూడా దీనినే పరోక్షంగా ధ్రువీకరించింది. దీనికి ఇప్పుడు మరో కారణం కూడా ఉన్నట్టుగా తాజాగా తెలుస్తోంది. కంపెనీ వ్యూహాలను సమర్థంగా అమల్లో తెచ్చేందుకు గాను సీఈవోకు సహాయ పడేందుకు కో-చైర్మెన్‌గా రవి వెంకటేశన్ నియామకంపై సిక్కాకు అభ్యంతరాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్ 15 తేదీన కో-చైర్మెన్‌గా రవి వెంకటేశన్ పేరును ఇన్ఫోసిస్ ప్రకటించింది. దీంతో వెంటనే విశాల్ సిక్కా కొందరు సీనియర్ ఎగ్జిక్యూటీవ్‌ల వద్ద తన అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు సమాచారం.



పాయ్

ఒకనొక దశలో తాను రాజీనామా చేస్తానని కూడా చెప్పారట. రవి వెంకటేశన్‌తో కలిసి బోర్డులో పనిచేయడం కష్టమని ఆయన అభిప్రాయపడ్డారని సమాచారం. కంపెనీ కార్యకలాపాల్లో కో-చైర్మెన్ వెంకటేశన్ జోక్యం అంతకంతకు పెరిగిపోవడం.. తరచూ ప్రశ్నిస్తుండటం, సలహాలు ఇస్తుండటంతో సిక్కా అహం దెబ్బతిందని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. మరోపక్క వెంకటేశన్ బయట మీడియాకు ఇంటర్వ్యూల్లోనూ ప్రాధాన్యం తగ్గించి మాట్లాడుతున్నారని సిక్కా భావించారట.

బీఎస్ఈ నుంచి 200 కంపెనీలు ఔట్!

- రేపటి నుంచి అమలులోకి నిషేధం

ముంబయి: దేశంలో డొల్ల కంపెనీల పని పట్టే క్రమంలో భాగంగా సర్కారు నియంత్రణ చర్యలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా 'బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ' (బీఎస్ఈ) రేపటి (23వ తేది) నుంచి 200 కంపెనీలను ట్రేడింగ్ నుంచి పక్కకు తప్పించనుంది. అనుమానిత కంపెనీలుగా ఉన్న ఈ సంస్థల ట్రేడింగ్‌ను దశాబ్దం పాటు నిలిపివేయడంతో పాటు సంస్థ ప్రమోటర్లు కూడా పదేండ్ల పాటు ట్రేడింగ్‌లో పాల్గొనకుండా నిషేధించనుంది. అనుమానాస్పదంగా గుర్తించిన 117 కంపెనీలతో పాటు లిక్విడేషన్‌లో ఉన్న 28 కంపెనీలను, డీలిస్టింగ్ కమిటీ ప్రతిపాదించిన మరో 55 సంస్థలను కలుపుకొని మొత్తంగా 200 సంస్థల స్టాక్స్‌ను బుధవారం నుంచి బీఎస్ఈ ట్రేడింగ్ నుంచి నిషేధించనున్నారు. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆదేశాల మేరకు ఎక్స్ఛేంజీలు నియమించిన స్వతంత్ర మూల్యాంకనకర్త సూచించిన ధర మేరకు ట్రేడింగ్ జాబితా నుంచి తొలగించిన సంస్థ ప్రమోటర్లు వాటాదారుల నుంచి షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

రాజ్‌నాథ్‌సింగ్‌తో ప్రతినిధి బృందం భేటీ

- ధర్నాచౌక్‌పై తగు ఆదేశాలు జారీ చేయాలని విన్నపం



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ధర్నాచౌక్ పునరుద్ధరణ అంశాన్ని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు 'ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీ' నివేదించింది. జంతర్‌మంతర్ ధర్నా సమయంలో సీపీఐ ఎంపీ డీ రాజా నేతృత్వంలోని 12 మంది సభ్యుల ప్రతినిధి బృందం రాజ్‌నాథ్‌సింగ్‌ను నార్త్‌బ్లాక్‌లో కలిసింది. ఇందుకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేసింది. కోర్టుల్లో కేసులను సాకుగా చూపుతూ ప్రజాస్వామిక హక్కును రాష్ట్ర సీఎం నిరాకరిస్తున్నారని వివరించారు. కోర్టులు సైతం ఈ అంశంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం లేదని తెలిపారు. కాగా కేంద్ర ప్రభుత్వంగా ఈ విజ్ఞాపన పత్రాన్ని రాష్ట్ర సర్కారుకు పంపిస్తామని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. అయితే కేవలం విజ్ఞాపన పత్రాన్ని పంపడమే కాకుండా కేంద్ర సర్కారుగా తమ అభిప్రాయాన్ని సైతం పంపాలని సభ్యులు కోరారు. ధర్నాచౌక్ కోసం బీజేపీ సైతం ఉద్యమాలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్‌కు వివరించారు. హోంమంత్రిని కలిసిన వారిలో జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరాం, పరిరక్షణ కమిటీ కన్వీనర్ చాడ వెంకట్ రెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కాంగ్రెస్ మాజీ ఎంపీలు వి హనుమంతరావు, పొన్నం ప్రభాకర్ తదితరులున్నారు.

కేసీఆర్‌కు 'తెలంగాణ హిట్లర్' అవార్డివ్వాలి

టీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

- దాన్ని ఆపడం కేసీఆర్ అబ్బతరం కూడా కాదు
- ధర్నాచౌక్ పునరుద్ధరణకు కేంద్రం చర్యలు చేపట్టాలి: జంతర్‌మంతర్ ధర్నాలో తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

రాష్ట్రంలో నియంతృత్వంగా పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు ఇవ్వాల్సింది ఆదర్శ రైతు అవార్డు కాదని, 'తెలంగాణ హిట్లర్' అవార్డు అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి మొదలయ్యిందని, దాన్ని ఆపడం సీఎం అబ్బతరం కూడా కాదని స్పష్టం చేశారు. అసంతృప్తిని అణగదొక్కాలని చూస్తే అది మరో రూపంలో బయటపడుతుంది తప్ప దాన్ని ఆపడం ఎవరి తరం కాదని తమ్మినేని నొక్కి చెప్పారు. ధర్నాచౌక్ పునరుద్ధరణ అంశంలో కేంద్ర ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయ్యాయనే నిర్ధారణకు వస్తామని స్పష్టం చేశారు. ధర్నాచౌక్ పునరుద్ధరణ కోసం సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో చేపట్టిన ధర్నాలో తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతులకు, కార్మికులకు, రాజకీయ పార్టీలకు, ఉద్యమ సంస్థలకు నిరసన తెలియజేసే ప్రజాస్వామ్య హక్కు లేదని, కానీ వేల ఎకరాలు భూమిని ఆక్రమించిన భూబకాసురులకు, డ్రగ్స్ మాఫియాకు రాష్ట్రంలో గొప్పగా ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందని విమర్శించారు. నయీం డైరీ దోషుల నుంచి డ్రగ్స్ మాఫియా వరకు ఏ ఒక్కరినీ రాష్ట్ర ప్రభుత్వం ముట్టుకోవడం లేదని వివరించారు. హైదరాబాద్‌లో ధర్నాచౌక్ (ఇందిరాపార్క్) ఉంటే ఉద్యమకారులు ఓ నిర్దిష్ట సమయం లో ముందస్తు అనుమతితో శాంతియుతంగా నిరసన తెలియజేసి వెళ్లేవారని తెలిపారు. ధర్నాచౌక్ ఎత్తేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎవరెప్పుడు, ఎక్కడ ధర్నా చేస్తున్నారో తెలీక పోలీసులు తలలు పట్టుకుంటున్నారని, ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నివాసమైన ప్రగతి భవన్ ముందే ప్రజలు ఆందోళన చేస్తున్న పరిస్థితులున్నాయని తెలిపారు. కేసీఆర్ నిర్ణయం తమ ప్రాణానికి వచ్చిందని పోలీసులు సైతం వాపోతున్నారని తమ్మినేని వివరించారు.

ధర్నాచౌక్ పునరుద్ధరణకు ఇందిరాపార్క్ దిగ్బంధించి చూపామని, నేడు ఢిల్లీలో తెలుగు పౌరుషం లేవనెత్తామని చెప్పారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ అవలంబిస్తున్న నియంతృత్వ పోకడలపై, అణిచివేతపై ప్రస్తు తం లోకమంతా కోడైకూస్తోందని చెప్పారు. 'మహమహుల పోరాటంతో తెలంగాణ రాష్ట్రం సాధించు కున్నాం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో 'నేను' అంటూ అగ్రస్థానం వహించిన జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరాం ను.. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇళ్లు కదిలితే అరెస్టు చేస్తున్నారు. ఇదేనా మనం కోరుకున్న తెలంగాణ?' అని ప్రశ్నించారు.

కేంద్రంలో, రాష్ట్రంలో ఏకపక్ష పాలన సాగుతోందని, ప్రశ్నించడాన్ని ఓర్వలేకపోతున్నారని తమ్మినేని విమర్శించారు. 'ప్రశ్నించే హక్కును కాలరాసిన నియంతలు చరిత్రగర్భంలో కలిసిపోయారు. ఈ నియంతలకూ ఆ గతి తప్పదు' అని హెచ్చరించారు. జంతర్‌మంతర్ ధర్నాతోనైనా కేసీఆర్‌కు బుద్ధి వస్తుందని ఆశిస్తున్నామని అన్నారు.

పోరు బాటే సరైన మార్గం

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ధర్నాచౌక్‌ను పోరాడి ఉద్యమాల ద్వారా సాధించుకోవాలని సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపు నిచ్చారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌ను సైతం పోరాటాలతో స్వాధీనం చేసుకున్నామని వివరించారు. 'బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత కేంద్ర ప్రభుత్వం శాంతిభద్రతలను సాకుగా చూపుతూ.. ఢిల్లీ అవతల హర్యానాలో ఆందోళనలు చేసుకోవాలని ఆంక్షలు విధించింది. కేంద్ర సర్కారు నిర్ణయానికి వ్యతిరేకంగా జంతర్‌మంతర్ రోడ్డును పోరాటాలతో స్వాధీనం చేసుకున్నాం. ఇదే పోరాట స్ఫూర్తిని ధర్నాచౌక్ పునరుద్ధరణకు చేపట్టాలి. పోరాడి సాధించుకోవాలి. వేరే మార్గం లేదు' అని స్పష్టం చేశారు. ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జంతర్‌మంతర్‌లో జరిగిన ధర్నాలో ఏచూరి పాల్గొని ప్రసంగించారు. 'ధర్నాచౌక్ పునరుద్ధరించాలనే ప్రజాస్వామ్య హక్కు కోసం సాగుతున్న ఈ పోరాటానికి సీపీఐ(ఎం)గా పూర్తి సంఘీభావాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నాం' అని ఏచూరి తెలిపారు. ఈ పోరాటంలో రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలతో భుజం-భుజం కలిపి నడుస్తామని భరోసానిచ్చారు. 'రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా అందరమూ కలిసి ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరముంది. దేశంలో ఎమర్జెన్సీని ఓడించినట్టుగా.. రాష్ట్రంలోని నియంతృత్వ పోకడలను తుదముట్టించాలి' అని అన్నారు. 'తెలంగాణలో నియంతృత్వ పాలన సాగిస్తున్న కేసీఆర్ బహుశా తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర మరిచినట్టున్నారు. నిజాం రజాకార్ల, పోలీసుల తూటాలకు ఎదురొడ్డి పోరాడి ప్రాణాలు అర్పించిన తెలంగాణ ప్రజలు... రాష్ట్రంలో ఈరకమైన నియంతృత్వానికి లొంగి కేసీఆర్ పాలనను సహించబోరన్న విశ్వాసం నాకుంది' అని ఏచూరి అన్నారు. సాయుధ పోరాటం లాంటి గొప్ప చరిత్ర కలిగిన తెలంగాణను కేసీఆర్ నియంతృత్వ చర్యల ముందు మోకరిల్లబోనీయమని హెచ్చరించారు. టీజేఏసీ, ఇతర ప్రతిపక్ష పార్టీలు ఈ పోరాటాన్ని ఢిల్లీ వరకు తీసుకొచ్చిన నేపథ్యంలో... ధర్నాచౌక్‌ను సైతం సాధించుకుంటారన్న విశ్వాసాన్ని ఏచూరి వ్యక్తం చేశారు.



ధర్నాచౌక్ కోసం పోరాడుదాం



(మొదటిపేజీ తరువాయి)

ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ఆదేశాలివ్వాలని కోరింది. ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ చాడ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో సోమవారం ధర్నాచౌక్ పునరుద్ధరణ కోసం ధర్నా జరిగింది. ఈ ధర్నాకు సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ డీ రాజా, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్, టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ పార్టీ నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రమణ, విరసం నేత వరవరరావు, అద్దంకి దయాకర్, పీడబ్ల్యుఓ నేత సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ సర్కార్లు ఎక్కువకాలం నిలవలేవు : ప్రొఫెసర్ కోదండరామ్

కేసీఆర్ సర్కారు లాంటి నిరంకుశ సర్కార్లను చాలా చూశామని, ఇలాంటి ప్రభుత్వాలు ఎక్కవ కాలం నిలవలేవని ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. ధర్నాచౌక్ ఎత్తేసిన తరువాత హైదరాబాద్‌లో నిరసన తెలియజేసే వేదిక లేక చాలా మంది అవస్థలు పడుతున్నారని వివరించారు. 'నిరంకుశ సర్కారు తెలంగాణలో ఉంది. ధర్నాచౌక్ ఆవశ్యకత ప్రజలను కదిలిస్తోంది. ధర్నాచౌక్ పునరుద్ధరణ కోసం ఢిల్లీలో చేపట్టిన ధర్నా కోసం స్వంత ఖర్చులతో ఇక్కడికి రావడం మాములు విషయం కాదు' అని చెప్పారు. 'ధర్నాచౌక్ ఉంటే ఏం ప్రయోజనం అని ప్రశ్నించే వాళ్లకు.. జంతర్‌మంతర్‌లో తమిళనాడు రైతులు చేపడుతున్న ఆందోళన నిదర్శనం' అని కోదండరాం వివరి ంచారు. 'సమస్య తెలిస్తే పరిష్కారం దొరుకతది. ముందుగా ఆ సమస్యను తెలియజెప్పేందుకు ఓ వేదిక ఉండాలి. రాష్ట్రంలో 104, 108, సెర్ఫ్ ఉద్యోగులు, ఆదివాసీలు, అణగారిన వర్గాలు ఇలా సర్వ సమాజం ధర్నాచౌక్‌లో కనపడేది' అని చెప్పారు. ధర్నాచౌక్ పోరాట గొంతుకను ఢిల్లీ వరకు వినిపించామని, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సైతం సానుకూలంగా స్పందించారని తెలిపారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల సమస్యల పరిష్కారానికి పూనుకోవాలంటే ధర్నాచౌక్ అవసరమని, అందుకోసం ప్రజాస్వామిక వాతావరణం కాపాడుకునేందుకు ఢిల్లీ వరకు వచ్చామని తెలిపారు. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే మరోసారి కూర్చొని కార్యాచరణ చేపడతామని వివరించారు. ఢిల్లీలో జరిపిన ధర్నాకు కమ్యూనిస్టు పార్టీలుగా పూర్తి సహాయ, సహకారాలు అందజేశాయని చెప్పారు.

పరిపాలనపై నమ్మకంలేక.. : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కేసీఆర్‌కు ఆయన పరిపాలనపై విశ్వాసం లేదని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. 'పరిపాలనపై నమ్మకం ఉంటే నిరసనలు అణిచివేసే వాడు కాదు' అని అన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ధర్నాచౌక్ కోసం ఢిల్లీలో ధర్నా చేయాల్సి రావడం దురదృష్టకరంగా చెప్పుకొచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ వర్గమూ సంతోషంగా లేదని చెప్పారు. ఇందిరాపార్క్‌లో నిరసన తెలియ జేయడం ప్రజా స్వామిక హక్కు అని స్పష్టం చేశారు.

అన్ని పార్టీలతో కలిసి పోరాటం : కుంతియా

కేసీఆర్ అవలంబిస్తున్న అప్రజాస్వామిక వైఖరికి నిరసనగా అన్ని రాజకీయ పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి కుంతియా తెలిపారు. ఇటు కేంద్రంలోని మోడీ సర్కారు సైతం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శిం చారు. ప్రజాస్వామిక హక్కుల కోసం చేస్తున్న ఈ పోరాటానికి ఏఐసీసీ తరపున పూర్తి మద్దతు ఇస్తున్నా మని తెలిపారు.

అందరూ తిరగబడాలి : ఎల్ రమణ

కేసీఆర్ నిరంకుశ పాలనపై అందరూ తిరగబడాలని టీడీపీ అధ్యక్షులు ఎల్ రమణ అన్నారు. అప్రజాస్వామికంగా ధర్నాచౌక్‌ను ఎత్తేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇసుకమాఫియా రాజ్యమేలుతోందని విమర్శించారు. పైగా ప్రజలకు ఇచ్చిన హామీలేవీ అమలు చేయడం లేదని అన్నారు.

ఆర్ఎస్పీ నేత జానకిరాములు మాట్లాడుతూ... తెలంగాణ పోరాట స్ఫూర్తితో కేసీఆర్‌ను గద్దెదించాలని పిలుపునిచ్చారు. ఎంసీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ.. ధర్నాచౌక్‌ను సాధిస్తామన్న విశ్వాసం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నేతలు గోవర్ధన్, రంగారావు మాట్లాడుతూ..ప్రజాస్వామ్య హక్కులను హరించడంలో కేసీఆర్ నెంబర్ వన్ అని విమర్శించారు. ప్రజాస్వామిక హక్కుల లేకుండా చేసే దుస్థితి ఏంటని నిలదీశారు. రాష్ట్రంలోని మేధావులు ఈ అంశంపై మౌనం వీడాలని పిడబ్ల్యుఓ నేత సంధ్య కోరారు. వీరితో కాంగ్రెస్ సీనియర్‌నేత వి హనుమంతరావు, ఇఫ్టూ నేత అపర్ణ తదితరులు ప్రసంగించారు.

ధర్నాచౌక్ ప్రజాస్వామ్యంలో భాగం : సురవరం

ప్రజాస్వామ్యంలో నిరసనలు, ధర్నాలు, ప్రదర్శనలు భాగమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి చెప్పారు. పోరాటాలు, ఉద్యమాల ద్వారా అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ధర్నాచౌక్‌ను ఎత్తేయడం దిగ్భ్రాంతి కలిగిస్తోందని అన్నారు. కేసీఆర్ రాజకీయాల్లోకి రాకముందు నుంచే ధర్నాచౌక్ ఉందని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక హఠాత్తుగా నిరంకుశ వైఖరితో ఎత్తేశారని విమర్శించారు. ధర్నాలు, ఉద్యమాల ద్వారా ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తారని, కాబట్టి అధికార కేంద్రానికి దగ్గరలోనే దీనికి అవకాశమివ్వాలని స్పష్టం చేశారు. 'పార్లమెంట్‌కు సమీపంలో జంతర్‌మంతర్ ఉన్నప్పుడు హైదరాబాద్‌లో ఎందుకు నిరాకరిస్తున్నావు' అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. 'తెలంగాణ హక్కుల కోసం ఇదే జంతర్‌మంతర్‌లో పోరాటం చేస్తాని కేసీఆర్ అన్నాడు. జంతర్‌మంతర్‌లో కాకుండా ఫరీదాబాద్‌లో ధర్నా చేసుకోవాలని ప్రధాని అంటే ఏం చేస్తావు?' అని ప్రశ్నించారు. ఈ ధర్నా అనంతరం అన్ని పక్షాలు, ప్రజా సంఘాలు ధర్నాచౌక్ పునరుద్ధరణ కోసం ముఖ్యమంత్రికి లేఖలు రాయాలని పిలుపునిచ్చారు.

జర్మన్ల నమ్మకం

ఏదైనా మంచి ఉపన్యాసం విన్న తరువాత భారతీయులు చప్పట్లతో తమ ఆనందాన్ని తెలియచేస్తారు. అట్లా చప్పట్లు మోగా యంటే ఉపన్యాసకులు అద్భుతంగా ప్రసంగించినట్లు అర్థం. అదే జర్మనీలో అయితే శ్రోతలు తమ ముందు ఉన్న టేబుల్‌ను చేతులతో చరచడం ద్వారా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. జర్మనీలో మద్యాన్ని సేవించబోయే ముందు గ్లాసులను ఒకదానితో ఒకటి తాకించి 'ప్రోస్ట్' అని పలకాలి. మీతో తాగే వ్యక్తి కళ్లల్లోకి చూస్తూ కబుర్లు చెప్పాలి. అట్లా చేస్తేనే వారి ఆచారాలను గౌరవించినట్లు లెక్క. అట్లా చేయకపోతే ఏడేండ్లు లైంగిక జీవితం అస్తవ్యస్థమవుతుందని అక్కడి వారు నమ్ముతారు.

రెండుసార్లు ముద్దాడితే...


స్పెయిన్ ప్రజలు బోళామనుషులు. పెద్దగా మాట్లాడుతూ ఎంతో స్నేహపూర్వకంగా ఉంటారు. భారతీయులు స్పెయిన్ వెళ్ళినప్పుడు కచ్చితంగా ఆశ్చర్యపోయే సంఘటనలు కొన్ని ఎదురవుతాయి. అటువంటి వాటిలో పలకరింపు ఒకటి. ఎవరన్నా అమ్మాయి వచ్చి ఆ చెంప పైనా ఈ చెంప పైనా రెండు సార్లు ముద్దుపెట్టిందనుకోండి. కంగారు పడకండి. అట్లా రెండు సార్లు ముద్దుపెడితేనే అక్కడ హలో చెప్పినట్లు లెక్క.



వంటకాలు నచ్చితే...

చైనా, జపాన్, కొరియా వంటి దేశాల్లో ఎవరింటికైనా భోజనానికి వెళ్లినప్పుడు వాళ్ల వంటలు బాగా నచ్చితే వారు వడ్డించిన సూప్‌ని పెద్దగా శబ్దం వచ్చేలా జుర్రుకోవాలి. అట్లా చేయడం ద్వారా వంట బాగుందని ఆతిథ్యమిచ్చినవారికి చెప్పినట్లన్నమాట. అయితే పశ్చిమ దేశాలో ఇట్లా శబ్దం చేస్తూ సూప్ తాగితే అమర్యాద కిందకు వస్తుంది.





హిందూత్వ శక్తులు ముస్లిం మైనారిటీలపై విషం కక్కుతున్న కాలం ఇది. మైనారిటీలను ఏం తినాలి, ఏం తినకూడదో కూడా కాషాయ దళాలు నిర్దేశిస్తున్న సమయం ఇది. స్వాతంత్ర్యం వచ్చి కేవలం 70 కూడా కాకుండానే మైనారిటీలపై ఇంత విద్వేషం విరజిమ్ముతున్న హిందూమతవాదులు ముందు ముందు ఏం చేయనున్నారో! వందల ఏండ్ల పాటు పాలించిన మొగల్ చక్రవర్తుల్లో ఇటువంటి వివక్ష, విద్వేషాలు ఉండి ఉన్నట్లయితే భారత సంస్కృతి మరో విధంగా ఉండేదేమో! తమపై ఉన్న ప్రష్యా ప్రభావాన్ని తొలగించుకొని ప్రతి అంశాన్నీ భారతీయాకరణ చేయడానికి ప్రయత్నించిన మొగల్ చక్రవర్తులను చూసి నేటి పాలకులు ఎంతైనా నేర్చుకోవలసి ఉంది. మొగలాయీల కాలంలోని చిత్రకళ ఏవిధంగా భారతీయాకరణకు గురయిందో చెప్పే ఈ వ్యాసం ఎన్నో ఆసక్తికరమైన అంశాలను తెలియచేస్తున్నది.



ముస్లిం పాలనలో భారతీయాకరణ

చిత్రలేఖనం అనేది ఎప్పుడూ భారత దేశంలో రాజాస్థాన ప్రత్యేకతగా ఉంటూ వచ్చింది. చిత్రలేఖన కళకు ఉత్తమ ఉదాహరణగా పరిగణించిన కుడ్య చిత్రలేఖనంతో పాటు మానవ చిత్రపటాలు వేయడం, దృశ్యాల చిత్రీకరణ అనేవి హిందూ పాలకుల, కులీనుల సరదాలుగా ఉండేవి. అయితే ఢిల్లీ సుల్తానులు చిత్ర లేఖన కళను ప్రోత్సహించలేదు. కానీ మొగల్ పాలకులు ఈ కళను పునరుద్ధరించారు. మొగల్ చిత్రలేఖనం, విదేశీ (పర్షియన్), భారతీయ అంశాల సమ్మేళనాన్ని ప్రతిబింబిస్తుంది. అక్బర్ పాలనాకాలంలో మొగల్ చిత్రలేఖన కళ ప్రాముఖ్యంలోకి వచ్చింది. జహంగీర్ పాలనలో ఇది ఆకాశానికి ఎగసింది. షాజహాన్ కాలంలో ఆడంబరంతో విజృంభించి వికసించింది. కానీ ఔరంగజేబ్ కాలంలో దీనికి మృత్యు గంట మోగింది. అవుధ్ నవాబుల పాలనలో ఇదొక క్షీణ కళగా 18వ శతాబ్దం చివరి వరకూ కొనసాగినా, బ్రిటిష్ పాలన ప్రారంభమవ్వడంతో ఈ కళ ఆచరణాత్మకంగా అంతమయింది. ఈ కళ జీవిత కాలం చాలా తక్కువే అయినప్పటికీ భారతీయ కళాచరిత్రలో ఇదొక ప్రకాశమానమైన ఉదంతంగా నిలిచిపోతుంది.

గొప్ప సౌందర్యారాధకుడూ, కళా పిపాసీ అయిన బాబర్ చిత్రలేఖన కళను గొప్పగా పోషించాడు. ఆయన ఆస్థాన చిత్రకారులను నియమించాడు. బాబర్ జీవిత వృత్తాంతా లతో కూడిన ఆల్వార్ రాత ప్రతి (పర్షియన్ కథనం)లోని చిత్రాలు చిత్రలేఖనంలో వారు చేసిన కృషిని వెల్లడిస్తాయి. బాబర్ వారసుడైన హుమయూన్ పర్షియాలో ప్రవాసిగా ఉన్నప్పుడు చిత్రలేఖనం పట్ల మంచి అభిరుచి పెంపొందించుకొన్నాడు. ఆయన భారతదేశానికి తిరిగివచ్చేటప్పుడు పర్షియాలో ప్రముఖ చిత్రకారులైన సయ్యద్ అలీ తబ్రేజీ, ఖ్వాజా అబ్దుస్ సమాద్‌లను తనతో పాటు తీసుకొచ్చాడు. ఈ ఇద్దరు చిత్రకారులు భారతీయ సహాయకులతో కలిసి కృషి చేసి మొగల్ చిత్రలేఖన సంప్రదాయానికి చెందిన మూల కేంద్రాన్ని రూపొందించారు.

హిందు కళాకారులకూ ఆదరణ

అక్బర్ కాలంలో చిత్రలేఖనం గణనీయమైన ప్రగతి సాధించింది. క్వాజా అబ్దుస్ సమాద్ అధిపతిగా అక్బర్ ఒక ప్రత్యేక చిత్రలేఖన విభాగాన్ని ఏర్పాటు చేశాడు. ఈ విభాగం పట్ల అతనికున్న వ్యక్తిగతమైన ఆసక్తి, అతని ఉదారమైన సహజ సౌందర్య స్వభావం, విదేశీ కళాకారుల పట్ల అతనికి గల సానుభూతి వైఖరి, అతని మత సహనం, హిందువులతో అతనికి గల సాహచర్యం- ఇవన్నీ చిత్రలేఖన కళకు అన్ని రకాల ప్రోత్సాహం అందించడంతో పాటు దాని గమనాన్ని కూడా ప్రభావితం చేశాయి. ఫలితంగా చిత్ర లేఖన పద్ధతిలోను, వైవిధ్యంలోను, రంగుల నాణ్యంలోనూ భారతీయ పర్షియన్ రీతుల మేలు కలయిక ఏర్పడింది. పూర్తిగా వర్ణనాత్మక చిత్రలేఖన సంప్రదాయమనే ఒక కొత్త చిత్రలేఖన సంప్రదాయం వృద్ధి చెందడం ప్రారంభమయింది. భారతదేశమంతటా ఉన్న చిత్రకారులతో పాటు విదేశీ చిత్రకారులను కూడా అక్బర్ ఆహ్వానించాడు. ఈ చిత్రకారులు విభిన్న జాతులకు, కులాలకు చెందినవారైనప్పటికీ గొప్ప ప్రతిభావంతమైన చిత్రాలను సృష్టించాలనే



ఉమ్మడి లక్ష్యం గలవారు.

అక్బర్ కాలంలో ఉన్న 17 మంది చిత్రకారుల్లో 13మంది హిందువులే. మానవ వర్ణనలోను, గాథా చిత్రణలోను, జంతు చిత్రణలోను వీరికి అద్భుత ప్రావీణ్యం ఉండేది. వీరిలో దాస్వంత్, బాస్వాన్, సన్యాల్ దాస్, లాల్ కేసు, ముకుంద్, హరిబన్స్ అనేవారు అత్యంత ముఖ్యులు. పర్షియన్ కల్పిత గాథలను చిత్రించడంతోపాటు పర్షియన్ మహాభారత గ్రంథం, అక్బర్‌నామాతో పాటు ఇతర గ్రంథాల్లోని సన్నివేశాలను చిత్రించే పనిని కూడా కళాకారులకు అప్పగించడం జరిగింది. ఆ విధంగా భారతీయ కథాంశాలు, సన్నివేశాలు వాడుకలోకి వచ్చి మొగల్ సంప్రదాయాన్ని పర్షియన ప్రభావం నుంచి విముక్తి చేయడంలో తోడ్పడ్డాయి.

స్వర్ణయుగం

జంహంగీర్ చక్రవర్తికి చిత్రలేఖంనంలో మంచి అభిరుచి ఉంది. చారిత్రక చిత్రపటాలను అనేకం సేకరించాడు. మంచి కళావిమర్శకుడు. చిత్రలేఖనంలో ఈయన సముపార్జించిన అనుభవం ఎంతటిదంటే కేవలం చిత్రాలను చూసే వాటిని చిత్రించిన చిత్రకారుల పేర్లు చెప్పగలడు. సూక్ష్మరూపం (మీనియేచర్) చిత్రలేఖనాన్ని అభ్యసించే వ్యక్తిగా ఆయన; భారత, విదేశీ సంప్రదాయాలకు చెందిన ఉత్తమ నమూనాలను నిరంతరం ప్రభుత్వ చిత్రశాలల్లో చేరుస్తూ ఉండేవాడు. సంప్రదాయ చిత్రలేఖనాంశాల్లో అతనికి గల విజ్ఞానం, అతని ఆస్థాన కళాకారుల నైపుణ్యంతో కూడిన ఉత్సాహం వల్ల మొగల్ చిత్రలేఖనం పర్షియన్ ప్రభావం నుంచి విముక్తమైంది. అంతేకాకుండా భారతీయ శైలిని సంతరించుకొని, హిందు సంప్రదాయాలవైపు మొగ్గుచూపింది. జహంగీర్ పాలనలో మొగల్ చిత్రలేఖనం అత్యున్నత శిఖరాలను అందుకొని, ఆ కాలం నాటి ఆనందమైన సహజమైన ఉత్తమ కళగా రూపుదిద్దుకొంది. ఈయన కాలం మొగల్ చిత్రకళకు స్వర్ణయుగం అని చెప్పవచ్చు.

మొగల్ చిత్రలేఖన సంప్రదాయంలో కొన్ని విశిష్ట లక్షణాలు కనిపిస్తాయి. మొగల్ చిత్రాలు పరిమాణంలో చిన్నగా ఉంటాయి. ప్రాచీన కాలానికి చెందిన బౌద్ధ భిత్తి చిత్రా (ఫ్రెస్కో)ల హుందాను, పరిమాణాన్ని ఈ చిత్రాలు ఎప్పుడూ సాధించలేదు. మొగల్ చిత్రలేఖనానికి వేట, పోరాటం వంటి సంఘటనలు, జంతువులు, పక్షులు, చెట్లు, మొక్కలు, పూలు, వంటి ఎన్నో వస్తువులు ఉన్నాయి. కానీ మార్మిక వాదానికి సంబంధించిన చిత్రాలు గాని, గృహ జీవితానికి సంబంధించిన వాస్తవ చిత్రాలు కానీ ఈ చిత్రలేఖనంలో చోటుచేసుకోలేదు. మొగల్ చిత్రకళ రాజాస్థానానికి, కులీనులకు పరిమితమై జానపదుల భావనకు దూరంగా ఉండేది. ఈ చిత్రలేఖనం భారతీయ వాతావరణాన్ని తనలో ఇముడ్చుకున్నప్పటికీ, భారతీయ భావోద్రేకాలను, భారతీయుల దైనందిన జీవనాన్ని కానీ ప్రతిబింబింపచేయలేదు. మామిడి, మర్రిచెట్లు, జింక, సింహం, నెమలి వంటి భారతీయ ప్రకృతిలోని అంశాలను, భారతీయ వస్తువులనూ, ఆభరణాలను విశేషంగా చిత్రించడం జరిగింది కానీ, ప్రజాజీవనాన్ని మాత్రం ప్రతిబింబింపచేయలేదు. ప్రకృతి ఆరాధన అనేది మొగల్ చిత్రకళ విశిష్ట లక్షణం. మానవ రూప వర్ణనలో మొగల్ సంప్రదాయం ప్రశంసనీయమైన ప్రగతి సాధించింది. సరైన రంగులు వాడటంలోను, ఔట్‌లైన్ గీయడంలోను, వాస్తవ లక్షణాలను చిత్రించడంలోను మొగల్ చిత్రకారులు ప్రసిద్ధికెక్కారు. ముఖం, తల, చేతులు, వేళ్లను అద్భుతమైన పోలికలతో సౌకుమార్యంగా చిత్రించేవాడు. ఆరు రంగుల కూర్పు విషయంలో మొగల్ కళాకారుల నైపుణ్యం అనన్య సామాన్యమైంది.

(కె.కృష్ణారెడ్డి రచించిన భారతదేశ చరిత్ర మధ్యయుగం అనే పుస్తకం ఆధారంగా...)



సంబురు జీవన విధానం

కెన్యా ఉత్తర భాగంలో నివసించే 'సంబురు' తెగవారు ప్రకృతితో పోరాడుతూ తమ ప్రత్యేక సంస్కృతిని కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే వీరు 'మసాయ్' తెగ జీవన విధానంతో దగ్గరి పోలికలు కలిగి ఉన్నారు. సంబురు ప్రజలు పూర్తిగా సంచార జీవనంపైనే జీవించకపోయినా తమ పశువుల మందలతో ఎక్కువ కాలం గడ్డి ఉన్న ప్రాంతాలను వెతుక్కుంటూ సంచరిస్తారు. వీరు ఎక్కువగా పాలమీదే ఆధారపడినా అప్పుడప్పుడూ తమ ఆవుల రక్తాన్ని కూడా తాగుతారు. ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే మాంసాన్ని తింటారు. దుంపలు, వేర్లు, కూరగాయలు కూడా వీరి ఆహారంలో భాగంగా ఉంటాయి.



సంబురు ప్రజలు నివసిస్తూ ఉన్న రిఫ్ట్ లోయ ప్రాంతం ఎండిపోయి ఉంటుంది. పెద్దగా చెట్టూ పుట్ట ఉండని ఎడారి పరిస్థితి ఉన్న ప్రాంతం. పశువుల పెంపకంపై ఆధారపడ్డ వీరి ఆర్థిక వ్యవస్థ వీరిని నిరంతరం గడ్డి ఉన్న ప్రాంతాలకు వలసపోయేలా చేస్తున్నది. ఒక ప్రాంతంలో పశువులకు గడ్డి ఉన్నదంటే అయిదారు వారాలు అక్కడే నివసిస్తారు. తాత్కాలికంగా నివసించడానికి అనుగుణంగా మట్టి గోడలు, గుంజలు, గడ్డిచాపలతో నిర్మించిన ఇండ్లలో వీరు నివసిస్తారు. ఈ గుడిసెల చుట్టూ ముల్ల కంపలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకొని క్రూర మృగాల నుండి రక్షణ పొందుతారు. వీరు నివసించే ఈ నివాస సముదా యాలను 'మన్యట్టా'లంటారు. ఆ ప్రాంతంలో పశుగ్రాసం అయిపోతే ఇండ్లను సులభంగా పీకి తమతో పాటు తరలించ డానికి వీలుగా ఇండ్ల నిర్మాణం ఉంటుండటం విశేషం.

సాధారణంగా సంబురు ప్రజలు ఐదు నుంచి పది కుటుంబాలు కలిసి ఒక సమూహంగా జీవిస్తారు. పురుషులు వారి పశువుల ఆలనా పాలనా చూడటంతోపాటు మొత్తం తెగ రక్షణ భారం వహిస్తారు. క్రూర జంతువుల నుండి, శత్రు తెగల నుండి వచ్చే ప్రమాదం నుండి నిరంతరం తమవాళ్లను రక్షించడం వీరి బాధ్యతన్నమాట. అట్లాగే పురుషులు ఇతర సంబురు వంశాలవారిపై దాడిచేసి పశువుల మందలను దొంగిలించుకురావడంలోనూ పాల్గొంటారు. మగపిల్లలకు చిన్నప్పటి నుంచే పశువులను కాయడం, వేటాడటంలో శిక్షణ ఇస్తారు. బాలుడు వివాహం చేసుకోదగిన మగవానిగా మారాడని చెప్పడానికి గుర్తుగా సున్తీ చేస్తారు. ఈ సందర్భంగా ఉత్సవం నిర్వహిస్తారు.

ఇక స్త్రీల విషయానికి వసే... తినడానికి అవసరమైన వేర్లు, దుంపలు, కూరగాయలను సేకరించడం, నీటిని తీసుకురావడం, పిల్లల్ని పెంచడం వీరి ప్రధాన విధులు. మొత్తం మీద ఇంటిని నిర్వహించడం వీరి కర్తవ్యం. ఆడపిల్లలు తల్లికి ఇంటిపనుల్లో సాయం చేస్తారు. అమ్మాయిలు పెద్దవారు అయినట్లు చెప్పడానికి కూడా ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

- మౌక్తిక్



ఎవరు ఈ గణపతి?



మనమంతా ఒకప్పుడు నివసించింది గణ సంస్కృతిలో. మనిషి చరిత్రలో గణ వ్యవస్థ కొన్ని వేల సంవత్సరాలు కొనసాగింది. అందులో సామాన్యుడు, గొప్పవాడు అన్న తేడా లేదు. ఈ గణదశలో మాతస్వామ్య వ్యవస్థ మాత్రమే ఉండేది. అంటే సంతానం తల్లి ఇంటి పేరుతోనే కొనసాగేవారు. పురాణాల్లో కూడా దేవ గణాలు, రాక్షస గణాలు, ఋషిగణాలు అన్న పేర్లు కనిపించడాన్ని బట్టి పురాణ కథలు గణ వ్యవస్థకాలం నాటివి అని అర్థమవుతుంది..ఆ కాలంలో గణాల నాయకులని గణపతులు అనేవారు. ఆర్యులు మన దేశం వచ్చే నాటికి ఇక్కడ గణవ్యవస్థలో బతుకు తున్న అనేక తెగలున్నాయి. ఆ తెగలు ఆర్యులను అడ్డుకు న్నాయి. ఆర్య తెగలకు శత్రువులుగా ఉన్న గణపతు లను చంపి, తర్వాతి కాలంలో ఈ సంఘటనను పురాణ కథగా మార్చి, ఆ గణపతులను ఆర్య దేవతల్లో చేర్చి ఉంటారనేది ఒక భావన.



ఆర్యులు గణ వ్యవస్థను నాశనం చేసి బలమైన గణపతిని తమలో కలుపుకొని ఒక దేవుని స్థాయిని కల్పించి ఉండవచ్చు. ఫలితంగా ఇప్పుడు దేశవ్యాప్తంగా మనం జరుపుకొంటున్న గణపతి పండుగ ఆవిర్భవించి ఉండవచ్చు. గణపతికి ఏనుగు తల ఉండటం ఆ గణం యొక్క ఆధిపత్యాన్ని లేదా మిగతా గణాలపై గల సార్వభౌమత్వాన్ని తెలియచేస్తుందనేది కొందరి అభిప్రాయం.

వినాయక చవితి కథలోకి వెళితే పార్వతి తాను తయారుచేసిన నలుగు పిండి ముద్దకు ప్రాణం పోసి, ద్వారం దగ్గర కాపలాగా ఉంచితే శివుడు అతని తలను నరికేశాడు. తర్వాత ఏనుగు తల అతికించి, గణాలకు అధిపతిని చేశాడు. కానీ అసలు వాస్తవంలోకి వెళితే, మాతస్వామ్యంలో మోరియ అనే స్త్రీ పేరు మీదుగా వచ్చిన మౌర్యవంశానికి చెందిన బృహద్రదుని బ్రాహ్మణ సేనానియైన పుష్యమిత్ర సుంగుడు చంపి రాజ్యాధికారాన్ని వశం చేసుకొన్నాడు. ఈ సంఘటననే శివుడు బాలుడైన వినాయకుణ్ణి చంపి, ఆ తరువాత బతికించినట్లు ప్రతీకాత్మకంగా ఆర్యులు చెప్పారని భావించవచ్చు.

- శైలజ బండారి

రెజ్లింగ్‌లో నిరాశ

పారిస్ : ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ తొలి రోజు భారత్‌కు నిరాశే మిగిల్చింది. యోగేశ్, గుర్‌ప్రీత్ సింగ్, రవీందర్ ఖత్రి, హర్దీప్‌లు తొలి రౌండ్‌లోనే ఓటమిపాలయ్యారు. యోగేశ్ (71 కేజీలు) 1-3తో, గుర్‌ప్రీత్ సింగ్ (75 కేజీలు) 1-5తో జార్జియా రెజ్లర్ల చేతిలో కంగుతిన్నారు. రవీందర్ (85 కేజీలు) హంగేరి రెజ్లర్ చేతిలో 2-5తో ఓటమిపాలయ్యాడు. గ్రీకో రోమన్ కేటగిరీలో భారత్ తొలి రౌండ్‌లోనే ఓడినా.. మన రెజ్లర్లపై నెగ్గిన వారు ఫైనల్స్‌కు చేరితే రిపిఛేజ్ రౌండ్‌లో కాంస్య పోరులో తలపడే అవకాశం భారత రెజ్లర్లకు దక్కనున్నది.



శ్రీకాంత్ శుభారంభం

- తొలి రౌండ్లో అలవోక విజయం
- మెరిసిన సమీర్ వర్మ, తన్వీ లాడ్
- బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్స్



తన్వీ లాడ్

గ్లాస్గో (స్కాట్లాండ్) : తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో అలవోక విజయంతో టైటిల్ దిశగా ఓ అడుగు ముందుకేశాడు. రష్యా షట్లర్ సెర్గియో సిరంత్‌పై వరుస గేముల్లో గెలుపొందిన శ్రీకాంత్ రెండో రౌండ్లోకి అడుగుపెట్టాడు. 21-13, 21-12తో 29 నిమిషాల్లోనే మొదటి మ్యాచ్‌ను ముగించాడు. వర్ధమాన షట్లర్ సమీర్ వర్మ సైతం తొలి రౌండ్లో మెరిశాడు. స్పెయిన్ షట్లర్ పాబ్లో అబైన్‌పై 21-8, 17-4 (రిటైర్డ్ హర్ట్)తో గెలుపొందాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ సాయి రెడ్డి, మనీశ జంట 24-22, 21-17తో హాంగ్‌కాంగ్ జోడీపై గెలుపొంది రెండోరౌండ్లోకి ప్రవేశించారు. మహిళల సింగిల్స్‌లో తన్వీ లాడ్ 17-21, 21-10, 21-19తో బ్రిటన్ అమ్మాయిపై గెలుపొందింది. మెన్స్ డబుల్స్‌లో మను అత్రి, సుమీత్ రెడ్డి జోడీ 20-22, 11-21తో కొరియా జంట చేతిలో ఓటమిపాలయ్యారు.

ఎనిమిదో సీడ్ శ్రీకాంత్ తొలి గేమ్‌లో 8-3, 11-6తో ముందంజలో కొనసాగి.. 15-7, 17-12తో దూసుకెళ్లాడు. రెండో గేమ్‌లోనూ 7-2, 12-5, 18-9తో వరుస పాయింట్లు సాధించాడు. 21-13, 21-12తో సునాయాసంగా గెలుపొందాడు. ఉత్కంఠగా సాగిన మిక్స్‌డ్ డబుల్స్ పోరులో సాత్విక్ రెడ్డి, మనీశలు తొలి గేమ్‌లో 18-20తో గేమ్ పాయింట్ వద్ద ప్రత్యర్థిని నిలువరించి 24-22తో 1-0 ఆధిక్యం సాధించారు. హోరాహోరీగా సాగిన రెండో గేమ్‌లో 15-13, 18-14తో ముందంజలో నిలిచి నెగ్గారు. చొలె బిర్చ్ (బ్రిటన్)తో మూడు గేముల పోరులో తన్వీ లాడ్ తొలి గేమ్ కోల్పోయినా తర్వాతి రెండు గేముల్లో నెగ్గి రెండో రౌండ్‌కు చేరుకున్నది.

సింధు, సైనా పోరు నేడు

అగ్రశ్రేణి షట్లర్లు, మెడల్ రేసులో ముందున్న క్రీడాకారిణీలు పి.వి సింధు, సైనా నెహ్వాల్‌లు నేడు తొలి పోరులో బరిలోకి దిగనున్నారు. తొలి రౌండ్లో సింధు, సైనాలకు బై లభించింది. దీంతో నేడు రెండో రౌండ్లో వీరిద్దరూ పోటీపడనున్నారు. స్విస్ షట్లర్ సబ్రినా జాకెట్‌తో సైనా నెహ్వాల్ తలపడనున్నది. తొలి రౌండ్లో మూడు గేముల హోరాహోరీ పోరులో గెలుపొందిన సబ్రినా తర్వాతి పోరులో టాప్ షట్లర్‌ను ఢీకొట్టనున్నది. పురుషుల సింగిల్స్‌లో బి. సాయిప్రణీత్, అజయ్ జయరాంలు సైతం నేడు తొలి పరీక్ష ఎదుర్కొనున్నారు.



శ్రీకాంత్

ప్రొ కబడ్డీలో నేడు

గుజరాత్ X పుణెరి
రాత్రి 8 గంటలకు

యూపీ X బెంగాల్
రాత్రి 9 గంటలకు

వేదిక : లక్నో

స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం

ఓ జట్టుపై వరుసగా ఆరు ఇన్నింగ్స్‌ల్లోనూ 50 ప్లస్ పరుగులు సాధించిన ఏకైక భారత ఆటగాడు శిఖర్ ధావన్. శ్రీలంకపై ధావన్ గత ఆరు వన్డేల్లోనూ వరుసగా ఫిఫ్టీ ప్లస్ ఇన్నింగ్స్‌లు నమోదు చేశాడు.

1

లంకేశ్వరుడు

శ్రీలంకపై ధావన్ విధ్వంసకాండ

గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో గబ్బర్ చెడుగుడు

శ్రీనివాస్ దాస్ మంతటి

125, 190, 14, 35, 119, 132.. శ్రీలంకపై గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో శిఖర్ ధావన్ దూకుడు పర్వం. ఆరు ఇన్నింగ్స్‌ల్లోనే ఏకంగా నాల్గు సెంచరీలు సాధించాడు. **94, 113, 79, 91, 125, 132..** ఇవీ శ్రీలంకపై గత ఆరు వన్డే ఇన్నింగ్స్‌ల్లో శిఖర్ ధావన్ విశ్వరూపం. హద్దులేని విన్యాసాలతో గబ్బర్ గర్జన చేస్తున్నాడు. కానీ మూడు మాసాల క్రితం ధావన్ పరిస్థితి భిన్నం. చాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి ముందు తుది జట్టు చర్చల్లో పెద్దగా వినిపించని పేరు శిఖర్ ధావన్. లోకేశ్ రాహుల్ గాయంతో దూరమైతే గానీ జాతీయ జట్టులోకి పునరాగమనం చేయలేకపోయిన ఓపెనర్ శిఖర్ ధావన్. మరోసారి మరో ఓపెనర్ మురళీ విజయ్ తప్పుకుంటే తప్ప.. టెస్టు జట్టులో చోటు దక్కించుకోలేని ఆటగాడు శిఖర్ ధావన్. గత మూడు మాసాల్లో శిఖర్ ధావన్ కెరీర్ గ్రాఫ్ ఎవరూ ఊహించని మలుపులు తిరిగింది. ఐపీఎల్‌తో ఫామ్‌లోకి వచ్చి.. జాతీయ జట్టులో అందివచ్చిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్న శిఖర్ ధావన్ ఇప్పుడు టీమ్ ఇండియా సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ అయ్యాడు. శ్రీలంకపై కొనసాగిస్తున్న దండయాత్రతో డ్యాషింగ్ ఓపెనర్‌గా రాటుదేలుతున్నాడు.

లంకపై ప్రతాపం

ఐసీసీ టోర్నీల్లో శిఖర్ ధావన్ ప్రత్యేక ప్రదర్శనల కోవలోకే శ్రీలంకపై విశ్వరూపం వస్తుందేమో!. ఐసీసీ ఈవెంట్లు అనగానే ఒక్కసారిగా ఫామ్‌లోకి వచ్చే ధావన్.. శ్రీలంకపైనా అదే సంప్రదాయం కొనసాగిస్తున్నాడు. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా మంచినీళ్ల ప్రాయంలా పరుగులు పిండుకుంటున్నాడు. ఈ సీజన్‌లో చాంపియన్స్ ట్రోఫీలో ఓవల్‌లో మొదలైన ధావన్ మెరుపులు దంబుల్లా వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. ఓవల్‌లో 125 పరుగులతో శివమెత్తిన ధావన్.. దంబుల్లాలో 90 బంతుల్లోనే 132 పరుగులు బాది ఔరా అనిపించాడు. ఈ క్రమంలో గాలె టెస్టులో తొలి రోజే 190, కొలంబోలో మరో శతక (119) విన్యాసం గావించాడు. టెస్టు, వన్డేలలో కలిపి గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా మూడు సెంచరీలు సాధించాడు. ఇక ప్రత్యేకించి వన్డేల్లోనూ గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో మూడు సెంచరీలు సాధించటమే కాదు వరుసగా ఆరు ఫిఫ్టీ ప్లస్ స్కోరు సాధించిన ఏకైక భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. కెరీర్ సగటు 45.37గా ఉంటే శ్రీలంకపై అతడి సగటు 84.11. స్ట్రయిక్‌రేట్ విషయంలోనూ లంకేయులపై ధావన్ తిరుగులేని రికార్డు కల్గి ఉన్నాడు.

ద్వీపదేశంతో శిఖర్ ధావన్ ప్రేమయాణం ముందు నుంచీ కొనసాగుతున్నదే. వేదిక ఏదైనా, బౌలర్లు ఎవరైనా.. ప్రత్యర్థి శ్రీలంక అయితే చాలు ధావన్ దండయాత్రకు ఆకాశమే హద్దు! ఓవల్‌లో అయినా, గాలెలో అయినా ధావన్ బ్యాట్‌ది ఒకటే సమాధానం. స్పిన్ ఆధారిత శ్రీలంకపై స్వీప్ షాట్లతో విరుచుకుపడుతున్న ధావన్.. పేస్ బౌలర్లనూ వదలటం లేదు. దాదాపుగా ఫుల్ షాట్లకే మొగ్గుచూపుతున్న ధావన్.. టెక్నిక్, టైమింగ్‌కు బలం జోడిస్తున్నాడు. స్పిన్నర్లను స్వీప్ చేస్తూ, సీమర్లను ఫుల్ షాట్లు కొడుతూ శిఖర్ ధావన్ లంకేశ్వరుడయ్యాడు. ఆ జట్టుపై పరుగుల ప్రేమ కొనసాగిస్తున్నాడు. శ్రీలంకతో మరో నాల్గు వన్డేలు, ఓ టీ20 ఆడాల్సి ఉన్న నేపథ్యంలో ధావన్ దండయాత్రలో మరెన్ని శతక విన్యాసాలు రానున్నాయో చూడాల్సిందే.



లంకపై గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో..

వన్డేల్లో : 94, 113, 79, 91, 125, 132
ఓవరాల్ : 125, 190, 14, 35, 119, 132

శిఖర్ ధావన్ కెరీర్ వన్డే గణాంకాలు

	మ్యాచులు	ఇన్నింగ్స్	పరుగులు	సగటు	100	50
శ్రీలంకపై	10	10	757	84.11	03	04
ఓవరాల్	87	86	3721	45.37	11	21

ఇన్నింగ్స్ ఓపెన్ చేసి, ప్రత్యర్థికి చుక్కలు చూపించిన విధ్వంసక ఓపెనర్ అనగానే ముందుగా గుర్తొచ్చే ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్. మానసికంగా ప్రత్యర్థిని కుంగదీసే ఇన్నింగ్స్‌లు బాదటంలో అతడికి అతడే సాటి! సగం లోడ్ చేసిన గన్‌తో ఉండే ప్రమాద తీవ్రత అంచనా వేయగలమా? శిఖర్ ధావన్ విధ్వంసకాండ ఊహించగలమా? అనే రీతిలో సాగిపోతున్నాడు భారత జట్టు గబ్బర్. ఓపెనర్‌గా సెహ్వాగ్ శైలిని, దూకుడును తలపిస్తున్న ధావన్.. మిగతా జట్ల సంగతి అటుంచితే శ్రీలంకకు సింహస్వప్నమయ్యాడు. నిర్దాక్షిణ్య దండయాత్రలో సెహ్వాగే నయం అని శ్రీలంక అనుకునేంతలా ఆ జట్టును ఉతికారేస్తున్నాడు!.

రెగ్యులర్ యోయో

దంబుల్లా : బ్యాట్స్‌మెన్ బ్యాటింగ్ సాధన, బౌలర్ల బౌలింగ్ ప్రాక్టీస్. అదనంగా కాసేపు ఫీల్డింగ్ కదలికలు. సహజంగానే టీమ్ ఇండియా ప్రాక్టీస్ సెషన్‌లో కనిపించే దృశ్యాలు. కానీ ఫిట్‌నెస్ కోచ్ శంకర్ బసు వీటికి అదనంగా ఫిట్‌నెస్ డ్రిల్స్‌ను జోడించాడు. రెగ్యులర్‌గా ఆటగాళ్లందరూ ప్రమాణిక ఫిట్‌నెస్ నిరూపించుకునే దిశగా కొత్త పద్ధతి ప్రవేశపెట్టాడు. యోయో టెస్టుగా పిలువబడుతున్న ఈ ఫిట్‌నెస్ కారణంతో యువరాజ్ సింగ్, సురేశ్ రైనాలకు జట్టులో చోటు నిరాకరించారనే వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. అయితే జట్టులోని ఉన్న ఆటగాళ్లు సైతం సిరీస్ సాంతం యోయో పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సిందేనట. లేదంటే బెంచ్‌కు పరిమితం కాకతప్పదట!. శ్రీలంక పర్యటనలో శిఖర్ ధావన్ రెండు సార్లు యోయో పరీక్షకు హాజరయ్యాడు. గాలె టెస్టుకు ముందు, దంబుల్లా వన్డేకు ముందు ధావన్ యోయోలో ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడు. తొలిసారి పుజారా, అశ్విన్‌లతో కలిసి యోయోలో నిరూపించుకున్న ధావన్.. తాజాగా లోకేశ్ రాహుల్, విరాట్ కోహ్లిలతో కలిసి యోయోలో ఫిట్‌నెస్ చాటుకున్నాడు. 'ఫిట్‌నెస్ ప్రధానంగా మారింది. అన్ని విభాగాల్లో ఫిట్‌నెస్ కీలకం. ఒక్క పేలవ ఫీల్డింగ్ ఘటన మ్యాచ్‌ను మలుపుతిప్పగలదు. ప్రస్తుత క్రికెట్ పదేండ్ల క్రితం నాటిది కాదు. ఫిట్‌నెస్ విషయంలో విప్లవాత్మక మార్పు వచ్చింది. ప్రతి మ్యాచ్‌కు వంద శాతం ఫిట్‌గా ఉండాల్సిన అవసరముంది. ప్రస్తుత ఫిట్‌నెస్ డ్రిల్స్ బాగున్నాయి' అని శిఖర్ ధావన్ వెల్లడించాడు.



ఫిట్‌నెస్ కోచ్ శంకర్ బసుతో కోహ్లి (ఫైల్)

పాక్ క్రికెట్‌కు మంచి రోజులు!

వరల్డ్ ఎలెవన్‌తో టీ20 సిరీస్

కరాచీ : పాకిస్థాన్ క్రికెట్‌కు శుభవార్త. 2009 శ్రీలంక జట్టు బస్‌పై ఉగ్రదాడి అనంతరం స్వదేశంలో క్రికెట్ సిరీస్‌లు నిర్వహించలేకపోతున్న పాకిస్థాన్ ముందు సువర్ణావకాశం. పాక్ గడ్డపై క్రికెట్ భవిష్యత్ రానున్న మూడు మాసాల్లో తేలిపోనున్నది. ఇప్పటికే శ్రీలంక క్రికెట్ బోర్డు లాహోర్‌లో ఏకైక టీ20 మ్యాచ్‌లో ఆడేందుకు అంగీకరించగా, తాజాగా ప్రపంచ ఎలెవన్‌తో పాకిస్థాన్ మూడు మ్యాచుల టీ20 సిరీస్ ఆడనున్నట్టు పీసీబీ చైర్మెన్ నజీమ్ సేథీ ప్రకటించారు. 'ఇది చాలా పెద్ద విషయం. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లు ముఖ్యమైన మాసాలు. పాక్ గడ్డపై భద్రత ఉందని చాటాల్సిన సమయం. పంజాబ్ ప్రభుత్వం అత్యున్నత స్థాయి భద్రత ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. వరల్డ్ ఎలెవన్ పాక్‌లో పర్యటించనున్నది. అంతర్జాతీయ ఆటగాళ్లు లాహోర్‌లో ఆడనున్నారు. ఇది పాక్‌లో క్రికెట్ భవిష్యత్‌కు అత్యంత కీలకం' అని సేథీ పేర్కొన్నారు. సెప్టెంబర్ 10 నుంచి లాహోర్‌లో మూడు టీ20 జరుగనున్నాయి. దీనికి ముందు ఆగస్టు 26, 27లలో ఐసీసీ సెక్యూరిటీ బృందం లాహోర్ పర్యటించిన నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఆండీ ఫ్లవర్ వరల్డ్ ఎలెవన్ కోచ్‌గా పాకిస్థాన్‌కు వెళ్లనున్నట్టు సమాచారం. 15 మందితో కూడిన వరల్డ్ ఎలెవన్ దుబాయ్‌లో వారం రోజుల ప్రాక్టీస్ తర్వాత లాహోర్‌లో అడుగుపెట్టనున్నది. క్రికెట్ మ్యాచులకు ప్రెసిడెంట్ తరహా భద్రతా ఏర్పాట్లు చేసేందుకు పంజాబ్ ప్రభుత్వం సిద్ధమైందని సమాచారం. అక్టోబర్‌లో శ్రీలంక, నవంబర్‌లో వెస్టిండీస్‌లు పాక్‌లో పర్యటించాల్సి ఉన్నది.

అభిమానాగ్రహం

● శ్రీలంక జట్టు బస్ వద్ద అభిమానుల నిరసన



దంబుల్లా : చాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ దశ నుంచే నిష్క్రమణ. పసికూన జింబాబ్వేతో 2-3 చేతిలో వన్డే సిరీస్ ఓటమి. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న బంగ్లాదేశ్ చేతిలో టెస్టు పరాభవం. తాజాగా భారత్ చేతిలో 0-3 టెస్టు సిరీస్ వైట్‌వాష్ ఓటమి సహా దంబుల్లా వన్డేలో అత్యంత దారుణ పరాజయం. ఇప్పటికే పలు సందర్భాల్లో జట్టు ప్రదర్శనపై ఆగ్రహం వ్యక్తం చేసిన లంక అభిమానులు.. తొలి వన్డేలో ఓ అడుగు ముందుకేశారు. 216 పరుగులకే కుప్పకూలి, భారత జట్టుకు కనీస పోటీ ఇవ్వలేకపోయిన శ్రీలంక ప్రదర్శన పట్ల అభిమానులు ఆగ్రహంతో ఉన్నారు. దంబుల్లాలో రికార్డు స్థాయిలో అభిమానులు హాజరుకాగా, కొందరు చెట్లపైకి ఎక్కి మరీ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆసక్తి చూపారు. కానీ తీరా స్వదేశీ జట్టు ఘోర పరాభవం అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. మ్యాచ్ అనంతరం జట్టు బస్ వద్దకు చేరిన 50 మందితో కూడిన అభిమానుల బృందం నిరసన వ్యక్తం చేసింది. శ్రీలంక క్రికెట్ బోర్డుకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో శ్రీలంక జట్టు బస్ షెడ్యూల్ కంటే అర్ధ గంట ఆలస్యంగా బయల్దేరింది. పోలీసులు పరిస్థితి సద్దుమణిగేలా చేసి అభిమానులను చెదరగొట్టారు. అభిమానులు ఏకంగా జట్టు బస్ వద్దే నిరసనకు దిగటంతో దిగ్గజ ఆటగాడు కుమార సంగక్కర సహా కెప్టెన్ ఉపుల్ తరంగ అభిమానులను శాంతపరిచే ప్రయత్నం చేశారు. జట్టు విజయాలు సాధించినప్పుడు అండగా నిలిచారు. ఇప్పుడు జట్టు కష్టాల్లో ఉన్నది. ఇప్పుడే మీ మద్దతు మరింత అవసరమని అభిమానులను కోరారు. జట్టు గెలుపు బాట పట్టే వరకూ సహనం వహించాలని సూచించారు. అయితే శ్రీలంక వరుస వైఫల్యాలతో అభిమానుల ఆగ్రహావేశాలు ఏ స్థాయికి చేరుకున్నాయో దంబుల్లా బస్ సందర్భం చెప్పకనే చెబుతున్న కఠోర వాస్తవం!.

సెలక్టర్లదే తప్పు

శ్రీలంక కోచ్

శ్రీలంక వరుస వైఫల్యాల బాధ్యత సెలక్షన్ కమిటీదే అని ఆ జట్టు కోచ్ నిక్ పోథాస్ విమర్శించారు. మ్యాచ్ మ్యాచ్‌కు కొత్త ఆటగాళ్లతో జట్టును గెలుపు బాటలో నడిపేదెలా అని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆటగాళ్లు వేలెత్తి చూపలేని స్థాయిలో కఠోర సాధన చేస్తున్నారు. సహాయక సిబ్బంది జట్టు వ్యూహంలో నిరంతరం శ్రమిస్తోంది. కానీ నిలకడగా ఓ జట్టును ఉంచలేనప్పుడు ఏం చేయగలం. ఎలా ప్రయత్నించగలం' అని కోచ్ విమర్శించారు. గతేడాది మే నుంచి ఇప్పటి వరకూ శ్రీలంక వన్డే జట్టుకు సుమారు 40 మంది ఆటగాళ్లను ఎంపిక చేయటం గమనార్హం. దిగ్గజ ఆటగాడు సనత్ జయసూర్య సారథ్యంలోని సెలక్షన్ కమిటీ ఇప్పటికే పలు విమర్శలు ఎదుర్కొంటున్నాడు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.